భారతి

సంపుటము 22 | ఏప్రెల్, 1945 | సంచిక 4

పార్థివ - చైత్రము

చంపకమాల

•

= శ్రీ హనుమచ్ఛాస్త్రి =

౧

నగవుల పూలగుత్తి వయినాడవురా సఖ! ఎంత దాచినన్
మొగలుల పండువొత్తుల గుబుల్కొను కమ్మని తావివోలె నీ
మొగమున తీయనైన యనుభూతులు సిగ్గుల దేలి వెల్గు; నే
సొగసుల రాణి యౌవనరుచుల్ చవిగొంటివిరా సుహృత్తమా?

౨

ఇక తెరచాటు లేటికి? సుహృద్వర! నల్లని కన్ను రేకు పొం
దికల జపాసుమప్రభల దిద్దిన వే శుభయామినుల్? రసో
త్సుకత చెలంగు నీయమృతచుంబనముద్రలు మేలుకొన్న వే
నకి జడలోని మల్లెల పసందులు నీమెడలోని వాసనల్?

౩

పొలపొల గాలి కౌగిళుల పొంపిరివోయెడు సన్నజాజిలీ
గల ననుమొగ్గలట్లు పులకల్ నెలకొన్నవి మేని నిండ; నీ
తలపుల తీయనైన కవితల్ ఫలియింపగ నెట్టకేల కే
కలల వెలుంగు ఊర్వసి ముఖాముఖ ముద్దుల నిన్ వరించెరా!

౪

అరవిడు నల్లకల్వజత యందము చిందెడు కన్నుదోయి ని
ద్దురల తెరల్ తెమల్చుకొని దూరపు మేరల స్వర్గఖండముల్
దరిసిన రాత్రి కమ్మని తలంపుల దోగెడు నేమొ యింకనుం
బరపదు చూడ్కి యొక్కటియు మానవమాత్రులమైన మాపయిన్.

౫

ఇవురుకటారిజోడు సవరించెను తీయని విల్లు; తోటలన్
నవమధులక్ష్మి మంజుపద నర్తన నిస్వనముల్ చెలంగ, నీ
పువుబెడదన్ విదల్చుకొని పొంగిన భావమధుస్రవంతికా
కవితలు పల్కరా! యరుత కాన్కగ చంపకమాల వైచెదన్.

5 మార్చి '45.

ప్రభావతీ ప్రద్యుమ్నము

కొన్ని విశేషాలు

= శ్రీ మొందలి వెంకటరామయ్య =

ప్రభావతీప్రద్యుమ్నాన్ని సావధానంగా పఠించినట్లయితే కొన్ని విశేషాంశాలు గోచరిస్తాయి. ప్రబంధవస్తువు వేరైనప్పటికిన్ని తెలుగులోని ప్రబంధాలు చాలావరకు ఒకేమార్గాన్ని అనుసరించాయి. ప్రబంధకథాప్రారంభమైన పద్యంతోనే పురవర్ణనను మొదలుపెట్టి తరువాత క్రమంగా చతుర్వర్ణములను వర్ణించడం, పువ్వులావికాదివర్ణనము—ఇవి ప్రబంధసంప్రదాయాన్ని సూచిస్తాయి.

ఎందువల్లనో యీపద్ధతి నచ్చక పింగళిసూరన్న తన కావ్యంలో కొంత నవ్యతను కనబరచడానికి పూనుకొన్నట్లు గోచరిస్తుంది. ప్రబంధాలన్నీ ఒకే పంథా ననుసరిస్తే పాఠకులకు వానియందు అభిరుచి కలగ దనే భావమే అతన్ని యిలాంటి నూత్న సృష్టికి పురికొల్పి ఉంటుంది. పూర్వసంప్రదాయాన్ని పూర్తిగా విసర్జించకుండా దాన్ని హృదయంగమమైన రీతిని తన ప్రభావతీప్రద్యుమ్నంలో నిర్వహించాడు.

"శ్రియఃపతి శ్శ్రీమతి శాసితుం జగ
జ్జగన్నివాసో వసుదేవసద్మని
వసన్ దదర్శావతరంత మంబరా
ద్ధిరణ్యగర్భాంగభవం మునిం హరిః"

అని మాఘకవి తన కావ్యాన్ని ప్రారంభించినట్టు-

"శ్రీరమణీరమణీయమ
హోరస్థలుఁ డచ్యుతుఁడు సముజ్జ్వలమహిమన్
ద్వారక నుండఁగ నొకనాఁ
డారూఢాదరత నింద్రుఁ డవ్విభుకడకున్."

"లోకహితకార్యపర్యాలోచనంబునకై చనుదెంచువాఁడు నాకంబు వెడలి యాకసంబున నడతెంచుచున్న సమయంబున"—

అని ప్రారంభించి పాఠకునిగూడా యింద్రునితో వియత్పథవిహారానికి తీసికొనిపోయి, అచ్చటనుండి—తాను స్వయంగా గాకుండా—యింద్రమాతలుల ముఖంగా ద్వారకానగరసౌందర్యాన్ని చవిచూపించాడు. ఉన్నతస్థలంనుంచి ప్రకృతి నంతా ఒక్కమారుగా చూడవచ్చు. భూమిమీద నిలిచి చూడడంలోనూ, వియత్పథంనించి చూడడంలోనూ భేదంవుంది. భూమిమీద నున్న మనుష్యుని దృష్టి దూరంగా ప్రసరించదు- మధ్య యెన్నో ఆటంకా లుంటాయి. ఉన్నతప్రదేశంనుంచీ క్రిందికి చూచే మనుష్యునికి ఒక విశాలమైన ప్రకృతిచిత్రాలన్నీ ఒకేమారు గోచరిస్తాయి—మనోహరములుగానూ వుంటాయి. అదీగాక పాఠకుడు తానుగూడా వియత్పథవిహారాన్ని ఊహించుకొని క్రింద వుండే సృష్టిచిత్రాలను గురించి కావ్యంలోని ఒకానొక పాత్ర తనకే వివరించి చెపుతూ ఉన్నట్టు భావించి ఆనందాన్ని అనుభవిస్తాడు. అప్పుడు కావ్యంలోని వర్ణనము విసుగును కలిగించదు. ఈ విషయాన్ని సూరన్న గ్రహించి, తన కావ్యాదిలో మాతలిద్వితీయుడై నాకలోకంనుండి శ్రీకృష్ణదర్శనార్థమై క్రిందికి దిగివస్తున్న ఇంద్రుని

ప్రవేశపెట్టి, వారు "తత్తద్వస్తుసందర్శనసమయ సముచితవచోరచనల వినోదించుచుఁ గొంతదవ్వున నుర్వికి డిగ్గ"లోపల తన పురవర్ణనాన్ని ముగించి, కథాసందర్భాన్ని అందుకున్నాడు. ప్రబంధప్రారంభంలోనే ఒక నూత్నమార్గాన్ని త్రొక్కాడు.

బ్రాహ్మణవర్ణనమందు గూడా నవ్యత కాన్పిస్తుంది. కేవలం కవే వర్ణించాడనే భావం పాఠకునికి కలగకుండా సమర్థించుకుంటూ, ఆ వర్ణనమును ప్రకృతకథోపయుక్తంగా చేసుకోవడంలోనే యీ కవిప్రతిభ యిమిడిఉంది.

వసుదేవుని యాగసమాప్తిసమయంలో భద్రుడను నటుణ్ణి సభలో ప్రవేశపెట్టాడు. అతడు తన అద్భుతవర్తన ప్రవర్తనములవల్ల పరితుష్టులను జేయగా వారందరూ అతనికి పారితోషికము లిచ్చారు. భద్రుడు వాళ్లనందరినీ పొగిడాడు. సభలోని ధూర్తవటువులు కొందరు—"భద్ర! కడు సొంపులుగా బొగడించుకోఁ జూమీ తలపగ నిప్పు డింత తెరువరుల మైతిమి." అంటూ "తమ దండపుఁగోలల నన్న మాఱుఁగోచుల"ను భద్రుని కిచ్చి తమ్ముగూడా పొగడమన్నారు. యీ సమయాన్ని పురస్కరించుకొని, కవి, ఔచితికి భంగం లేకుండా—యిది అనవసరవర్ణన మని పాఠకునికి అనిపించనట్లు—భద్రునిచేత బ్రాహ్మణవర్ణనము చేయించాడు. ఘట్టము హాస్యరసపూరిత మైనది. పాఠకునికి ఉత్సాహాన్ని కలిగించేది. అలాంటి ఘట్టంలో వర్ణనమును ఇముడ్చడం కవిసమయోచితజ్ఞతకు నిదర్శనం.

"వేదశాస్త్రముల వెదచల్లఁగల శుచి
బ్రాహ్మణజాతికోరకములార!
పరిశుద్ధి పెంపొందు బ్రహ్మవర్చసపావ
కమూర్జితస్ఫులింగంబులార!
యరయనట్టికశికలంతలయ్యును బింక
మున బ్రహ్మశిఖ మట్టు ప్రోడలార!
దంటమాటలకు ధార్త్యమునకు నావతి
పడిపట్టినట్టి సత్పాత్రిజాలార!"

అని భద్రుడు వటువులను పొగిడాడు. ఆ పొగడ్తకు తృప్తిజెందని వటువులు అంతతో పోక, ఆ ప్రాంతంలో అట్టాడుకుంటే వారిని భద్రుడు "మ్రుచ్చు"లన్నాడు. ఆ వటువులు కోపించి—

"ఆటవాండ్రని నమ్మి యనుమతింపగ నెట్టి
పురమైన నశ్రమంబునను జొచ్చి
పగలెల్ల నాటల బ్రమయించుచును సందు
గొందులెల్ల నెఱింగికొనుచు రేలు
కన్నగాండ్రగుచు నగళ్లు ప్రవేశించి
యందు నెంతటివార లడ్డమైన
జక్కడచుచు చేనుగ్రుక్కినపాటిగా
నిష్టమైన యర్థమెల్ల బడసి
బ్రదుకుచునికి మీ స్వభావము"

అని భద్రుని ఆక్షేపించారు.

"ఇంద్రకార్యము దెస నవ్వత్తిల్లు చిత్తంబుతో ననికి వజ్రపురంబు జొచ్చుట కుపాయాన్వేషిరై యున్కి జేసి నిజాపేక్షకు నుత్తరంబుగ" వటువుల వాక్యాలను జనార్దనుడు గ్రహించి" తదనుసారంబున వజ్రపురప్రవేశమును, వజ్రనాభవినాశంబును నతిసుకరంబులుగా మనంబున నిశ్చయించుకొని తత్ప్రయోజనంబునకు నరుగ నర్హుం డెవ్వడొకో" అని విచారించుటకు అవకాశం కలిగింది. కడకు వటువాక్యానుసారమే ప్రద్యుమ్నగదసాంబులు వజ్రనాభపురిని ప్రవేశించి వాని వినాశానికి కారణు లయ్యారు.

భద్రుని బ్రాహ్మణవర్ణనంమూలంగా వటువులు అప్రయత్నంగానూ, అన్యాపదేశంగానూ వజ్రనాభవధకు బీజాన్ని నాటారు. యీ ఘట్టం కావ్యానికి ప్రాణప్రదం. అలాంటిదాన్ని అతికౌశలంతో నిర్వహించాడు సూరన్న. అటు ప్రబంధసంప్రదాయాన్ని కాపాడుకుంటూ, ఇటు వర్ణనమును కావ్యబీజోత్పాదకంగా చేయగలిగాడు.

ఇలాంటి ఘట్టాలు మరికొన్ని కనిపిస్తాయి. బ్రహ్మకూ, సరస్వతికీ ప్రణయకలహం కలిగినట్టు హంపీ చెప్పిన సందర్భంలో; బ్రహ్మ మన్మథుణ్ణి నిందిస్తూ—

"ఏలరా! మన్మథుడ! నన్ను నింత రేచు
టేమి మేలు? రానున్న వి యిట్టి పాట్లు
నీవు నిక ప్రభావతి యను నెలతపై వి
రాళికారణముగ; వేగిరంబు వలదు."

అనిన మాటలను హంసి తాను వినినట్లు ప్రభావతితో చెప్పి ఆమెకు ప్రద్యుమ్నునియందు అనురాగాన్ని వృద్ధిచేసింది. యీ మన్మథోపాలంభనమువల్ల ప్రభావతీప్రద్యుమ్నుల సంయోగం నిశ్చయమని ఉత్తరార్థాన్ని గూడా సూచిస్తూంది. తద్వారా యిది కథకు పుష్టిని కలిగించింది.

"కన్గవల కల్కితనంబున పువ్వులాడికల్ తలపులు గొల్లలాడి మిగులం బ్రమయించి యువవ్రజంబుచే వెల లధికంబుగా గొనుచు వేడుక నమ్మిరి పువ్వు లంగడిన్" అనే పువ్వులాడికా ప్రసంగంతో పాటు— "ప్రభావతికి నొక్క యతివ విరులు గొనుచు బోవగ నందు నింపున జరించు తేటిగమిలోన" ప్రద్యుమ్నుని గూడా ఒక తేటిగా మార్చి ప్రభావతి అంతఃపురానికి చేర్చాడు కవి. ప్రబంధాదిలో సంప్రదాయరక్షణకై—కథాసందర్భానికి ఉపకరించని—పువ్వులాడికావర్ణనమునకూ, కథాసందర్భంలో నాయకుణ్ణి తేనెటీగగా పుష్పాన్నాశ్రయింపజేసి నాయికవద్దకు జేర్చునప్పుడు చేయబడ్డ పువ్వులాడికావర్ణనమునకూ భేదం లేదూ! ఇట్టి వర్ణనము కవియొక్క సమయోచితబుద్ధిని ప్రదర్శిస్తుంది.

ఈ విధంగా తాను ఉద్దేశించిన వర్ణనమును పాఠకునికి హృదయంగమంగా వుండేలాగా తత్తదుచిత సన్నివేశాల్లో ఇమిడ్చి, ఆ వర్ణనములను కావ్యవస్తుపోషకములుగా చేసుకొన్నాడు సూరన.

ప్రబంధకర్త లందరూ స్త్రీపురుషవర్ణనల్లో ఉపయోగించే ఉపమానవస్తువుల ప్రసక్తి యీ కవికి రుచించినట్లు అగపడదు.

"నెత్తమ్ము లనుచు గ్రొన్నెల లంచు వటఫల
శ్రీ లంచు తాబేటిచిప్ప లనుచు
నమ్ముల పొదు లంచు నవటికంబము లంచు
బులిన మంచును సుడిచెలువ మనుచు
హరిమధ్యమం బంచు హైమకుంభము లంచు
నవమృణాళము లంచు జివురు లంచు
మదను శంఖ మటంచు మణిదర్పణము లంచు
బగడ మంచును దిలప్రసవ మనుచు
శఫరు లనుచు సింగిణు లంచు జంద్రఖండ
మనుచు శ్రీకారము లటంచు నళు లటంచు
నిట్టివి గదయ్య చెప్పబోయిన నుపమలు
వీని దడవ సిగ్గౌదవు"

అనే పద్యమే పైవిషయాన్ని స్పష్టపరుస్తుంది. సౌందర్యం సహజమయినది. ఒకానొక యువతిని వర్ణించడంలో ఆమె అవయవాలను వేరువేరుగా తీసికొని కొన్ని వస్తువులతో పోల్చడమనేది అస్వాభావికతను తెలుపుతుంది. సహజసౌందర్యాన్ని యథాతథంగా వర్ణిస్తేనే దానిలో స్వాభావికత గోచరిస్తుంది. స్త్రీ అవయవాలకు ఉపమానత్వాన్ని పొందే వస్తువులన్నిటిని ఒకటిగా చేరిస్తే ఒకానొక వికృతరూపం తయారవుతుంది. అందువల్ల సూరన్న అట్టి వర్ణనములోని కృతకతను గమనించి—

"అటుగా కద్భుతరామణీయకగుణా
ఢ్యంబైన సద్వస్తువున్
బటువాచారసికుల్ ప్రసంగమయినన్
శారంబు ముట్టన్ రసో
త్కటతం జెప్పక మానజాలరను
పక్షం బొందు భావించినన్
ఘటియిల్లున్ వనితాంగవర్ణనకు ని
క్కం బన్యథాసిద్ధియున్."

అని యాథార్థ్యాన్ని వెల్లడించాడు. తత్త్వతః ఆలోచించినట్లయితే స్త్రీ అంగాలను వేరువేరుగా వర్ణించడమనేది స్వభావానికి దూరం. మానుషశరీరం అఖండమైనది. అంగాలన్నీ ఒకటిగా చేరినప్పుడే శరీరానికి సౌందర్యం సిద్ధిస్తుంది. ప్రత్యేకాంగవర్ణనం అఖండశరీరసౌందర్యమునకు పుష్టిని కలిగించదు. ఈ రహస్యాన్ని గ్రహించాడు కవి.

శరీరవర్ణనములో ఉపమానాలను జొప్పించడం యీయనకు యిష్టం ఉన్నట్లు కనిపించదు. అందువల్లనే—

"సుకవులు క్రిందుమీదరసి
చూడక యీడని యీడుకొన్న హో
టకకదళీవిలాస మక
టా విపరీతము గాక సాటియే
యకలుష రామణీయక స
మంచితకోమలతద్వధూరుల
క్ష్మికి సరిగా వచెంత తల
క్రిందయినన్ గరిరాజహస్తముల్."

"......................చం
ద్రాద్యుపమల్ మాచనా
భంగుల్ గాని, యథప్పహ్రసగుణ సౌ
భాగ్యంబు లాయంగముల్."

"......................
..........చంచరీకచం
ద్రాద్యుపమానశోభకు ప
హ్రసగుణంబుగ హెచ్చు గేళవ
క్త్రాద్యఖిలాంగలక్ష్మి."

అని అనేకమార్లు ఉపమానవాచకములను నిరసించాడు. యీ సందర్భంలో భర్తృహరియొక్క—

"నోపత్యేన మృగాంక ఏష వదనీ
భూతో నచేందీవర
ద్వంద్వం లోచనతాం గతం నకనకై
రప్యంగయష్టిః కృతా
కింత్వేవం కవిభిః ప్రతారితమనా
స్తత్త్వం విజానన్నపి
త్వఙ్మాంసాస్థిమయం వపుర్మృగదృశాం
మందో జన స్సేవతే."

అనే శ్లోకం జ్ఞాపకంవస్తుంది.

ఉపమానవస్తువులయందు తనకు గల గాఢనిరాదరాన్ని—

"అమరారికరుల కుంభముల వ్రయ్యగమొత్త
రమణిచన్నులు నఖాగ్రముల నొత్త
సమదరాక్షసరథచక్రంబు లీల గూల్ప
గాంతశ్రోణికి నాడిగంబుసల్ప
వసురేంద్రజయశంఖ మవనిపై వ్రేయింప
గామినికంఠంబు గౌగలింప
వజ్రనాభుని ధనుర్వ్యావర్తలు గడతేర్ప
బడతికన్బొమసంజ్ఞ బనులొనర్ప
దైత్యు మెఱుగుదూపులు దళితములుసేయ
దత్తనూజచూపులు ఫలితములుసేయ"

అనే పద్యంలో చూపించాడు. ఈ పద్యంలో వీరశృంగారములతో గూడిన ప్రకృతార్థమేకాకుండా—"కరుల కుంభములు వ్రయ్యగ మొత్తుట", "రథచక్రంబుల గూల్చుట", "శంఖ మవనిపై వ్రేయించుట", "ధనుర్వ్యావర్తలు గడతేర్చుట", "మెఱుంగుదూపులు దళితములుసేయుట" అనేవానివల్ల కలిగే ధ్వనిద్వారా ఆయా ఉపమానవస్తువులయందు కవికి గల గాఢనిరాదరము అనే అప్రకృతార్థంగూడా స్ఫుటంగా కనిపిస్తాంది. ఆయా వస్తువులను కవి తిరస్కరించాడు గూడాను.

సహజసౌందర్యాన్ని సహజధోరణిలోనే—ఉపమానవస్తునిరపేక్షకంగా—వర్ణించి, తద్వర్ణనమునందు స్వాభావికతను గోచరింపజేయడమే కవి ఆశయం. సౌందర్యవర్ణనానికి చంద్రమన్మథ మలయమారుతోపాలంభనములకూ ప్రత్యేకంగా ఒకటిరెండు ఆశ్వాసాలు కేటాయించడం యీ కవిమతం గాదు. అలాంటి దీర్ఘవర్ణనములకు తావివ్వడంవల్లనే ప్రబంధాలు పాఠకుని ఆకర్షింపలేకున్నాయి.

ఉపమానవస్తువుల అస్వాభావికతను యీక్రింది పద్యంవల్ల గ్రహింపవచ్చు:

"తరుణికెంగే లంచు దమిబట్టి కటకటా
చిగురాకె యిది యంచు జిన్నవోయి
వెలదిపాలిండ్లంచు వెస నంటి చెల్లబో
పూగుత్తులే యంచు బొలుపుదఱిగి

చెలువపయ్యెద యంచు చేసాచి యయ్యో ప
 రాగోదయమె యంచు రహి దొలంగి
రమణి వేనలి యంచు రతికాంతు డొడిసి హా
 తేటిమొత్తమె యంచు దెల్లవాఱె."

ఇందులో ఆయా ఉపమేయముల సామ్యము కోసం తత్తదుపమానములను గ్రహించడంవల్ల "చిన్నబోవుట, పాలుపడటుగుట, రహిదొలగుట, తెల్లవాఱుట" అనేవి సంభవిస్తాయని వ్యంగ్యంగా కవి తెలుపుతూ అట్లు గ్రహించేవారిని ఆక్షేపించడాని కీపద్యాన్ని ఉద్దేశించినట్లు కనబడుతుంది.

కొన్ని ప్రదేశాల్లో యీ కవి దిక్కాత్రంగా వర్ణనములను ప్రవేశపెట్టాడు.

"ఆరయ నింక నేమడిగె
 దల్లవె యాతడు శంబరుం డిలో
కారిని డ్రుంచునప్పటి ప్ర
 హారకిణంబు లురంబునందు నా
హా! రతికంకణాంకములు
 నల్లవిగో మెడయందు; వీరశృం
గారకళాధుర్యు నిట్లతని
 గట్టిగ నెవ్వ రెఱింగి రావనిరో!"

"శౌర్యయుతుం డతండు భుజ
 సత్త్వనిధానము కాంతిరాశి గాం
భీర్యపుఁబ్రోక సత్కళల
 పెద్దని రూపము దాల్చినట్టి యౌ
దార్యము పెక్కు లేటికి స
 దాత్తగుణోదయ మాయపూర్వసౌం
దర్యత కెంత యెంత యుచి
 తంబగు నంతయు గల్గి శోభిలున్."

అనేవి ఉదాహరణాలు. అసమాన సౌందర్యానికి యేయేలక్షణా లుండాలో ఆయాలక్షణాలు గల ఒకవ్యక్తిని పాఠకుని మనోవీథిలో నిలిపాడు. కృత్రిమ వస్తువులతో పోల్చి శరీరశోభకు కళంకం ఆపాదించడానికి బదులు ఒకానొక సౌందర్యరాశిని ఊహింపచేయడం ఉచితంగా లేదూ? మరికొన్ని—

"తిర్యగ్వనితను నన్ను స
మర్యాదానందమగ్నమతి జేసె మహా
శ్చర్యముగ దద్వధూసౌం
దర్యం బపు డేమి చెప్ప నలినాక్షసుతా!"

"శృంగగ్రాహిక జెప్ప వే తెఱవుల్
 సిద్ధింపమిం జేసి చి
త్రాంగశ్రీనిధి నవ్వధూమణిని స్థా
 లారుంధతీన్యాయమా
ర్గాంగీకారమునన్ వచించితిని."

"తెలివా! పందిట పందెడు
నెఱివెండ్రుక లాయతములు నీలము లివిరో
తెలుగున ముడిచిన నీకున్
గొఱితగలదె? యువిద జట్టిగొను నీవిభునిన్."

అనే వర్ణనములు ఎంత స్వాభావికంగా ఉన్నాయి! సుందరప్రేయసీప్రియులను ఊహాపథంలో నిలపడమే యీ కవి చేసిన పని. పాఠకుడు వారి సౌందర్యాన్ని మనసా భావించి ఆనందిస్తాడు— అప్పుడు వర్ణనము సార్థకమౌతుంది.

ప్రబంధవర్ణనములందు నిరసనభావాన్ని తెలపడానికి సూరన్న తన "శుచిముఖి"కి "ఉపమాతిశయోక్తికామధేనువు" అనే బిరుదమును ప్రసాదింపజేసి ఉంటాడు అనే భావం పాఠకులకు కలగకపోదు. అటు ప్రబంధసంప్రదాయాన్ని విసర్జించకుండా చేయదలచిన వర్ణనములను హృదయంగమంగా చేస్తూ, వానిని కావ్యవస్తువుకు అంగములుగా నిర్వహించడమే యీ కవిలోని విశేషం.

మరియొక విషయం: విప్రలంభశృంగారవర్ణనమునకు ఒక లలితమైన పద్ధతి ననుసరించా డీయన. అదే "గోత్రస్ఖాలిత్యం" అనేది. ప్రణయకలహంవల్ల నాయికానాయకులకు తాత్కాలికవియోగాన్ని కల్పించడానికి ఒక సుకుమారప్రయోగ మిది. "వనితలకు సవతినామము మారణమంత్రము" అనే సూత్రమే దీనికి మూలం. యీ విషయం సర్వవిదితం—అనుభవజ్ఞులు కూడా అనేకమంది ఉంటారు. స్వాభావికమైన యీ

"గోత్రస్ఖాలిత్యా"న్ని పురస్కరించుకొని, నాయికానాయకులకు తాత్కాలికవిరహాన్ని కల్పించి, విప్రలంభవర్ణనకు తరుణాన్ని సంపాదించాడు.

"ప్రద్యుమ్నుండు ప్రభావతీ రతివిహా
రప్రౌఢిపారవశ్య సం
పద్యుక్తిఁ గడు జొక్కి దక్కి రతీ
మత్ప్రాణమా నీకు."

అని అనగానే "గోత్రస్ఖాలిత్యము" ఓర్వలేని ప్రభావతి "శయ్యాంతరము"ను ఆశ్రయించింది. కవికి విప్రలంభవర్ణనమునకు అవకాశం దొరికింది. శృంగారమునకు పరిపుష్టి కలగగానే—


"రమణీ! యిందాకను దెలి
యను నీయల్కకు నిమిత్త మదియే ధవరు
త్తమరతి చే గరగుచు మె
చ్చుమరగ నట్లంటి దాని; నది తప్పగునే?"

అను నాయకునిచే ఊరడింపకేసి ఇరువురినీ ఏకముఖం చేశాడు. ఇంతకూ "రతి" శబ్దమే విరహానికీ, పునస్సంయోగానికీ కారణ మయింది. ఇలాంటి సుకుమారప్రయోగాన్ని ఊహించి తన కావ్యంలో కనబరచిన సూరన అభినంద్యుడు. కళాపూర్ణోదయంలోని—

"కళలంటి కలచి తన చె
య్యుల జొక్కెడు తపసిమది చివుక్కురు మనగా
నలకూబర! విడువిడురా
అలసితి నని పల్కె మన్మథాతివివశతఁ"

అనేది పురుషపర్యాయంగా ఉన్నా "గోత్రస్ఖాలిత్యం" అనే శీర్షిక క్రిందికే వస్తుంది.

పై విషయాలను బట్టి చూస్తే ప్రబంధనిర్మాణంలో సూరన కొన్ని నూత్నమార్గముల నాదేశించాడనడానికి సందేహం లేదు. స్వభావానికి సాధ్యమైనంత సమీపంలో తన కావ్యాన్ని నడిపించడం యితనికి యిష్టం. అమానుషవర్ణనములు, సన్నివేశములు—వీని మూలంగా పాఠకునికి విశ్వాసాన్ని కలిగించడం దుర్లభ మని గ్రహించాడు. కావుననే సూరనకావ్యాలు పాఠకుల నాకర్షింపగలిగాయి.



అన్నదమ్ములు

[కథానిక]

= శ్రీ 'జమదగ్ని' =

'ఏమిటిరా! ఈ తగాదాలు. నే చెప్పినట్టా వినక, మీ అంతట మీరూ చూచుకోకపోతే ఎల్లా ఈ వ్యవహారం తెమలడం? రాముడూ! నువ్వన్నా ఒక దారికి రా' అన్నాడు గ్రామంలో కులపెద్ద ముసలి పుల్లారెడ్డి.

'ఇల్లు అలా పంచితే నే నెందు కొప్పుకుంటాను తాతా! గాలీ, వెల్తురూ వచ్చే దక్షిణపుభాగం వాడు తీసుకుంటే ఈ చీకటికోణంలో నే ఉండాలి! వాణ్ణే ఉత్తరపుభాగం తీసుకోమను' అన్నాడు చిన్నవాడు గోపాలం.

'సరే! ఇంటి విషయంలో వాడు చెప్పినట్టే కానియ్యి తాతా! పొలంమాట కూడా పరిష్కారం చెయ్యి!' అన్నాడు రాముడు.

'పొలానికి పెద్ద పంచేదేమున్నదిరా! ఉన్నవి రెండెకరాలాయి. రెండూ నాలుగుమళ్లుగా ఉండనే ఉన్నాయి. ఇద్దరూ చెరో రెండుమళ్లూ తీసుకోండి.'

'మళ్లీ అదేమిటి! ఏఏమళ్లు ఎవ రెవరు తీసుకోవాలో కూడా ఖరాఖండిగా తేల్చెయ్యి!'

'అయితే నువ్వు ఎగువ రెండుమళ్లూ తీసుకో! దిగువ రెండుమళ్లూ రాముడు తీసుకుంటాడు.'

'బాగానే! ఉంది. నీరు సమంగా పట్టి ఎక్కువ పంట పండే పల్లపుమళ్లు రెండూ వాడికిచ్చి ఎందుకూ పనికిరాని ఎగువమళ్లు రెండూ నన్ను తీసుకోమంటే నే నేమన్నా బాగుపడాలా!'

'తాతా! ఈ పంపకంతో నాప్రాణం విసిగెత్తిపోతోంది. వా డిష్టమొచ్చినట్లు కానీ ప్రతిదీని'.

'అదేమిటండీ! అంతకాడికి పంపకాలు పెట్టుకోకపోతే ఏం? అంతా ఆయనగార్నే తీసుకోమని ఊరుకోకపోయారూ' అని గది కిటికీలోనుంచి తొంగి చూస్తున్న అన్నపూర్ణ భర్త నుద్దేశించి అన్నది.

రాముడు భార్యమాట వినీవిననట్టుగా ఊరుకున్నాడు. పుల్లారెడ్డి ఆ మాటల్తో కొంచెం కదిలి న్యాయ మాలోచించి 'గోపాలం! నువ్వన్నమాట బాగానే ఉంది. ఎగువమళ్లు రెండూ ఎందుకూ పనికిరావని నువ్వే అంటున్నావు కదా! అవి వాడుమాత్రం ఎట్లా తీసుకుంటాడు చెప్పు' అని మెల్లగా అన్నాడు.

దీంతో గోపాలం మండిపడి 'వ్యవహారాల్లో ఆడవాళ్లుకూడా దిగితే ఇక చెప్పేదేముంది? ఇంట్లో కూర్చుని ఏడవక వీటిల్లో వాళ్ల కెందుకంట' అంటూ ఎదురుగుండా ఉన్న గోడకొట్టుకొయ్యవంక చూస్తూ అన్నాడు.

రాముడు ఈమాట భరించలేకపోయాడు. అతని కాపాదమస్తకమూ శరీరం కోపంతో గజగజలాడింది. 'తమ్ముడివని ఊరుకున్నానురా వెధవా! ఏదో చిన్నవాడివి- నీ కయిష్టంగా ఎందుకు జరగాలని నేను

ఇయ్యి; ముందు వాటి కదే ఆబాజవుతుంది. ఏమంటావ్.' అన్నాడు.

'నాకుమాత్రం బీడు అక్కఅలేదా ఏమిటి!' అంటూ మారిమసిడిచాడు గోపాలం.

వెంటనే రెడ్డి 'అదీ ఎకరమే ఇదీ ఎకర మేనాయి. దీనికి చుట్టూ కోటగోడలాంటి కోఅడి ఉండె. దొడ్డినిండా వాములే పెట్టావా? వామిమేర విడిచి మిగిలింది రెండుచాళ్లు దున్ని విడిచిపెడితే మెలలోకు బీడు సిద్ధమౌతుంది!' అన్నాడు.

'అదిమాత్రం నమ్మకమేమిటి? అది ఎప్పుడో తాతలనాటినుండీ దిక్కూ దివాణా లేక వాములతో ఉడికెత్తిన భూమి గడ్డిపట్టుతుందా ఏడుస్తుందా! అల్లా ఎందుకు? ఇందులోనూ రెండుభాగాలు చెయ్యి; అందులోనూ రెండుభాగాలు చెయ్యి' అన్నాడు గోపాలం.

'అక్కడోకాస్త అక్కడోకాస్త ఉంటే ఆబాజాచేసుకోవడం కష్టం కాదుట్రా!'

'కష్టం అయితే అయిందిలే. అల్లా చేస్తేనే నేను ఒప్పుకుంటాను.'

'ఎందుకు తాతయ్యా! ఇంత రాద్ధాంతం. వాడిఇష్టం వచ్చినట్లు నిశ్చయంచెయ్యి. నేనేమీ ఎదురు చెప్పనన్నాగా' అన్నాడు రాముడు.

'సరే! అట్లాగే కానివ్వండి. ఇక అయిపోయి నట్టేనా!' అన్నాడు రెడ్డి.

'మరి పాత్రసామగ్రీ-గొడ్డూ గోదా అసలు ముఖ్యమైన విషయాలు విడిచిపెట్టితే ఎట్లాగా? అవి పంచనక్కఅలేదా ఏమిటి' అంటూ గోపాలం మళ్లీ లేచి నుంచున్నాడు.

దీంతో రాముడికి చిరాకు ఎక్కువైంది. పంపక మన్నాక అన్నీ ఒకసారే తేలిపోతే మంచిదిగదా అని సమాధానపఱుచుకొని పాలేళ్లను కేకవేసి ఉన్న సామగ్రి అంతా దింపమన్నాడు. ఒక్క అరగంటలో చెంబూ తప్పాలా దగ్గఱ్నుంచీ బొట్టుపెట్టెలూభోషా ణాలవఱకూ అన్నీ బైటపడవేశారు.

'తాతయ్యా! ఉన్న సామాన్లివి. నీఇష్టం వచ్చినట్లు పంచు' అని దూరంగా కూర్చున్నాడు రాముడు.

'ఇప్పుడు ఇంట్లో వాడకంలో ఉన్న సామాన్ల తోనే తీసుకుంటాడా?' అని రెడ్డివంక చూచి అన్నాడు గోపాలం.

తల వంచుకుని అరుగుమీద నెత్తిన చేతులు పెట్టుకు కూర్చున్న రాముడు ఉలిక్కిపడి 'ఏమేవ్! ఆ అంటగిన్నెలతోపాటు ఇంట్లో ఉన్న వస్తువులన్నీ బైటపడెయ్యి' అని భార్య నుద్దేశించి కేకవేశాడు. అన్నపూర్ణ ఒక్కొక్కటే బైటకు చేరవెయ్యడం మొదలు పెట్టింది. ఒక పాలేరు వాటి నందుకుని సామాను లన్నింటిలో చేరుస్తున్నాడు.

ఇంతలో గొడ్లపాకలో పాడిఆవు అరిచింది. దానిముందు మేత అయిపోవడం చూచి మఱొక పాలేరు మేత తేవడానికి వెళ్లాడు. పుల్లారెడ్డి సామాన్లు ఇంకా అన్నీ రాకపోవడం చూచి ముందు పశువుల సంగతి నిర్ణయంచేద్దా మనుకున్నాడు. వాళ్లకు రెండా వులూ, రెండు గేదెలూ, ఒక ఎడ్లజతా మాత్రం ఉన్నాయి. ఆ ఎడ్లజత వాళ్ల ఇంట పుట్టిపెరిగిందే. ఆ రెండావులూ ఏడాదివిడిచి ఏడాది కోడెదూడల్ని పెడ్తాయి. అయితే అవి వీళ్ల ఇంటికి ఏడాది హెచ్చు తగ్గగా వచ్చాయి. అందుకని తొలిచూలు కోడెల్ని పెంచి పెద్దవిచేసి వ్యవసాయం చేస్తున్నారు. తర్వాత వాటి నన్నింటినీ ఒకటి రెండు ఏళ్లు పెంచి చిన్న సంసారం అయిన కారణంచేత అమ్మేసుకునేవారు. ఆవుల్నీ, గేదెల్నీ పంచడం విషయంలో రెడ్డి కేమీ ఇబ్బందిరాలేదు. ఇద్దఱూ చెఱొక ఆవునీ, చెఱొక గేదనీ తీసుకునేటట్టు నిశ్చయంచేశాడు. కాని వాటి చిన్నతనంనుండీ తాను ఎఱిగి ఉండడంవల్ల ఆ ఎడ్లజత పంచడం విషయంలోమాత్రం అతని మనస్సు చివుక్కు మన్నది. భూమిమీద పడ్డదిలగాయతు సుఖం వచ్చినా దుఃఖం వచ్చినా అవి రెండూ రామలక్ష్మణులలాగా కలిసి ఉన్నాయేగాని విడివడి ఉండలేదు. వీళ్ల తండ్రి అంకమ్మ బ్రతికి ఉన్నప్పుడు తానుగూడా ఆ ఎడ్ల

కట్టిన బండీ ఎక్కి చాలాసార్లు తిరిగాడు. వాటి చురుకూ, నెమ్మదీ, అన్యోన్యం అన్నీ తనకు బాగా తెలుసు. అటువంటి జతను విడదియ్యడ మేమీ బాగుండ దనిపించి 'ఒరే! గోపాలం! ఈ ఎడ్లజతను మాత్రం విడదియ్యబోకండి. ఎవరో ఒకరు దాన్ని తీసుకుని దానికి బదులు ముదరా ఇస్తే రెండోవాళ్లు మళ్లో జత కొనుక్కోవచ్చు' అన్నాడు రెడ్డి.

'ముదరా ఇవ్వడ మంటే సామాన్యమా ఏమిటి? ఇప్పుడు వాటి ఖరీదు ఎంత హీనపక్షమైనా ఎనిమిది వందలకు తక్కువ కావు. ఎక్కడినుంచి ఎత్తుకువస్తా డేమిటి ఎవడుమటుకు' అని విసుక్కున్నాడు గోపాలం.

ఈ మాటలు గోపాలం గట్టిగా అనేటప్పటికి ఎడ్లను పంచడం తప్పదన్న విషయం రాముడి మనస్సులో ముల్లుగుచ్చుకున్నట్టు గుచ్చుకుంది.

రాముడి కీపంపకం బొత్తిగా ఇష్టంలేదు. తండ్రి చనిపోయి ఇంకా నెలరోజులు కాలేదు. పరిస్థితు లిట్లా విషమించడం అతన్ని ఎంతో బాధపెట్టుతోంది. గోపాలం ఇట్లా ప్రవర్తిస్తాడని అతను అనుకోకపోలేదు. కాని ఇంత తొందర్లో ఈ అవసరం వస్తుందని అతను ఎన్నడూ అనుకోలేదు. ఈ పంపకం జరుగుతున్నంత సేపూ అతడు మనస్సులో యమయాతన పడుతున్నాడు. తన తండ్రిమర్యాద, తన కుటుంబంప్రతిష్ఠ అన్నీ గంగలో కలుస్తున్నట్టు అతని కళ్లఎదుట భీకరంగా కనపడుతున్నాయి. భావిజీవితంలో తమ గౌరవహీనమైన బ్రతుకులు అతనికి సాక్షాత్కరిస్తున్నాయి. తన కొక కొడుకున్నాడు. తన భార్య ఈ పంపకానికే పట్టుపడుతోంది. ఈ నెలరోజుల్లోనూ గోపాలం తన్నా, తన భార్యనూ అన్న మాటలు ఇన్నీ అన్నీ కావు. ఒకప్పుడు సమస్తమూ గోపాలానికి విడిచిపెట్టేసి తాను ఏదో కూలిచేసుకొని బతుకుదామనికూడా అనుకున్నాడు. కాని భార్య నిలవ వేసింది. కొడుకును చూపించింది. ఇటువంటి పరిస్థితుల్లో భార్యను సంతుష్టిపరిచి కొడుకును బాగు చేసుకోవడం తన విధి అని తోచింది. అందుచేత ఈ పంపకానికి ఒప్పుకోక తప్పనిసరి అయింది. అయినా ప్రతిదానికీ పేచీలు పడటం అతని స్వభావం కాదు. అందుకనే మొదటినుంచీ ముభావంగా ఉన్నాడు. కాని ఎడ్లజత విషయంలో అట్లా ఉండ లేకపోయాడు. వాటిని చిన్నప్పటినుంచీ తన చేతుల్తో తన బిడ్డలవలె పెంచడమే దానికి కారణం. వాటిని తానే తీసుకోవాలన్న సంకల్పం అతని మనస్సులో గాఢంగా ఉంది. అందుకని రెడ్డి ఇచ్చిన ఈ సలహా అందుకుని 'నేను ముదరా ఇస్తాను. నాకు ఇచ్చేసెయ్యి' అన్నాడు రాముడు.

'నీ కేమయ్యా! ఏదో తెగనమ్మి ఇస్తానే అనుకో. నీడబ్బు ఎవడికి కావాలి? అటువంటి ఎడ్లు నాకు దొరకద్దూ. ఏదో ఒకటన్నా ఉంటే రెండోది ఎక్కడన్నా సంపాదించుకుని తంటాలు పడవచ్చు' అన్నాడు గోపాలం.

రాముడు ఈ భావానికి తట్టుకోలేకపోయాడు. గొంతు నలిమితే రెక్కలు టపటపా కొట్టుకున్న పిట్టలా గిలగిలలాడింది అతని మనస్సు. కాని ఏం చెయ్యగలడు? ఉపాయ మేమీ తోచక చేతుల్తో తల పట్టుకు కూర్చున్నాడు.

ఈ విషయంలో పుల్లారెడ్డి మనస్సుకూడా బాగా నొచ్చుకుంది. ఏమిటిరా గతి! వీటిని విడదియ్య వలసివచ్చేటట్లే ఉందే అని కాసేపు ఆలోచించాడు. అంతలో అతని కో ఉపాయం తోచింది. 'ఒరే అబ్బాయిలూ! నే నేదో పెద్దవాణ్ణి. మీ ఇద్దరి మధ్యా పరిష్కారం చెయ్యడానికి వచ్చాను. ఇందులో నేను బావుకునేది ఏమీ లేదు గదా!' అని ఆగాడు.

ఈ మాటలు వినేటప్పటికి ఈ దుష్టపరిస్థితి తొలిగే ఉపాయం ఏమన్నా రెడ్డి చెప్పతాడేమో అన్న ఆశ రాముడికి కలిగింది. అందుచేత కొంచెం తల ఎత్తి రెడ్డివంక తిరిగి 'అదేమిటి తాతయ్యా అట్లా అంటావు! ఇందులో నీ కేమున్నది– పొద్దుటినుంచీ మామూలాన పడుతున్న బాధతప్ప' అన్నాడు.

'సరే దాని కేంలే. పెద్దవాళ్లమంటూ ఉన్నాక ఆమాత్రం అంటించుకోకపోతే ఎట్లా? అది కాదు

గాని మీఱు ఇద్దఱూ ఏమీ అనుకోకుండా ఉంటే నా కొకమాట చెప్పాలని ఉంది' అని మళ్లీ ఆగాడు రెడ్డి.

'ఏమిటో చెప్పవయ్యా నసక్క' అన్నాడు గోపాలం విసుగుతో.

'నువ్వు అలా విసుక్కుని కసిరితే నాకు ఎందుకు వచ్చిందీ బెడద. నాదారిని నే పోతాను. మీ ఇష్టం వచ్చినట్లు అఘోరించండి!' అంటూ లేచాడు పుల్లారెడ్డి.

'ఇంతదాకా వచ్చి నువ్వు కోపగించుకుని వెళ్లడం ఏమీ బాగా లేదు తాతయ్యా!' అన్నాడు రాముడు మెల్లగా.

ఈమాట విని రెడ్డి ఆగాడు. 'సరే! ఏమయితే అది అవుతుంది. నేను చెప్పాలిసిన మాట ఏమిటో చెప్పి మరీ వెళ్తాను. ఒరే గోపాలం! నువ్వుకూడా బాగా ఆలోచించు. వాటిని విడదియ్యడం నేనే కాదు- ఊళ్లో ఎవళ్లూకూడా అంగీకరించనివిషయం. అలా విడదీసి ఎవ్వరూ లాభం పొందలేరుసరిగదా దానివల్ల అనర్థాలుగూడా వస్తాయి. అందుకని నామాట విను. నువ్వు వాటిని తీసుకుని వాడికి ముదరా అన్నా ఇయ్యి. వాటిని వాడి కిచ్చి నువ్వన్నా డబ్బు తీసుకో. ఇది కాదంటావూ, నీ ఇష్టం వచ్చిన ధర చెప్పు. ఆపైకం నే నివాళి ఇస్తాను. ఇద్దరూ చెలిసగం తీసుకుని దానికి కొస్తో కూస్తో కలుపుకుని చెలోజత చిన్నజతలు కొనుక్కుని కాలక్షేపం చెయ్యండి.' అని సమాధానంకోసం గోపాలం వంక చూచాడు రెడ్డి.

గోపాలం ఛఱ్ఱుమని లేచి 'చాలుచాల్లేవయ్యా! నిన్నేమో పెద్దమనిషివని తీసుకువస్తే మాదగ్గఱ మంచి జత కాజెయ్యాలని చూస్తావు! నువ్వెంత ఇస్తావేమిటి? మహా ఇస్తే పదివందలు ఇస్తావేమో! పంచుకుంటే ఐదువందలు వచ్చె. లోక ఉంటే గొడ్డు తొంభై పలుకుతున్న ఈరోజుల్లో అయిదువందలికి అడ్డెడు గింజలు లాగే ఎద్దు రాదు' అంటూ ఎడ్ల దగ్గఱకు పోయి చిన్నఎద్దు మెడతాడు పట్టుకుని ఈవతలకు లాక్కువచ్చి గుంజకు కట్టివేస్తూ 'ఇలా జరగవలసిందేకాని మఱోరకంగా అయితే నే నసలు ఒప్పుకోను' అని ఎద్దుమీద చెయ్యివేసి విజయగర్వంతో నిలబడ్డాడు.

వెంటనే పుల్లారెడ్డి 'నే నేం చేస్తాను. మీకర్మం' అంటూ లేచిపోయాడు.

'సామాన్లు జేరవెయ్యడంఅయింది' అన్న అన్నపూర్ణమాటలు ఎవరూ వినిపించుకోలేదు.

కుడిచేత్తో బొమ్మ అదుముకొని ఎడంచేత్తో వాలిన తల నొక్కుకుంటూ లోపలికి వెళ్లాడు రాముడు.

౨

రెడ్డి వెళ్లిపోవడం, రాముడు ఇంట్లోకి పోవడం, సామాన్లన్నీ బైట పడిఉండడం చూచి గోపాలం మొదట్లో నిర్ఘాంతపోయాడు. కానీపు ఉండేటప్పటికి అతనికి తన్ను ఎవ్వరూ ఏమీ చెయ్యలేరన్న ధైర్యం వచ్చింది. వెంటనే గోపాలం సామాన్ల దగ్గఱికి పోయి తనకు నచ్చిన వన్నీ విడిగా తియ్యడం మొదలు పెట్టాడు. ఈ అలికిడి విని అన్నపూర్ణ భర్తను బైటికి పోయి చూడమన్నది. కాని రాముడు కదల్లేదు. తానే వీథిగుమ్మంలోకి పోయి నుంచున్నది. ఇంతలో నులకమంచంలో నిద్రపోతున్న పిల్లవాడు లేచి 'అమ్మా' అంటూ ఏడుపు మొదలుపెట్టాడు.

'వాడట్లా ఏడుస్తుంటే నువ్వు అక్కడ నుంచోవడమేమిటి!' అంటూ కేక వేశాడు రాముడు.

'అంతా ఆయన ఇష్టం వచ్చినట్టు అక్కడ తీసుకుంటున్నాడు. మీరిక్కడ మాట్లాడకుండా కూర్చున్నారు' అని విసుక్కుంటూ లోపలికి వచ్చింది అన్నపూర్ణ.

'నాకు చేతకాదు. నీకు చేతయితే వ్యవహారం చేసుకోపో!' అన్నాడు రాముడు కోపంతో.

'ఇంతవఱకూ పంపకం నన్ను ఉద్ధరించడానికే జరిగిం దన్నమాట' అని గొణుక్కుంటూ పిల్లవాణ్ణి ఎత్తుకుంది అన్నపూర్ణ.

రాముడు మాట్లాడకుండా కూర్చున్నాడు.

గోపాలం తనకు కావలసిన సామాన్లన్నీ విడిగా తీసి పాలేళ్లచేత పాకలో ఒకమూల పెట్టించాడు. గొడ్లపాకలో అటకమీద ఉన్న నాగళ్లూ, మేడికోళ్లూ, పలకట్లులూ, మైలారంజల్లలూ అన్నీ దింపించి తనకి కావలసినవి తాను తీసుకున్నాడు. ఆ పూటనుంచే వేఱింటి కాపరానికి ప్రయత్నాలు మాజోరుగా సాగించాడు. పాలేళ్లచేత గొడ్లపాకకు మధ్య కట్టలు కట్టించాడు. తన ఆవునీ, తన గేదెనీ, తన ఎద్దునీ తన భాగంలో కట్టేశాడు. ఇల్లు రెండుభాగాలయ్యేట్టుగా మధ్య ప్రస్తుతానికి తడికలు పెట్టించాడు. పాలేళ్లను వెంబడిపెట్టుకుపోయి వాములదొడ్లో గడ్డివాము రెండుభాగాలు చేసి తన వాటా వేఱే వాముగా వేసుకున్నాడు. చొప్పగూడు పగలగొట్టించి తన భాగం వేఱేగా కుప్ప వేయించాడు. ఆసాయంత్రమే బయలుదేరి భార్యను తీసుకురావడానికి అత్తవారింటికి వెళ్లాడు.

రాముడు వీటన్నింటిలో జోక్యం కలిగించుకోలేదు. తమ్ముడి ఔద్ధత్యం చూచి వాడి ఇష్టంవచ్చినట్లే జరగనిమ్మని ఊరుకున్నాడు! 'తండ్రి చనిపోయి నెలకాలేదు. అప్పుడే సంసారం ఇంత బట్టబయలు అయింది. ఇకముందు ఎంత యాతన పడాలో' అనే ఆ రాత్రల్లా ఆలోచించాడు. రాముడు కొంచెం పూర్వకాలపు మనిషి. పెద్దమనిషితరహాగా ఉంటాడు. తండ్రి బతికిఉన్నన్నాళ్లూ ఆయనఅడుగుజాడల్లో నడిచాడు. ఇప్పటికీ ఆయనలా బతకాలని అతని అభిలాష. తన తండ్రి ఎంత మంచివాడు! ప్రేమతో గ్రామం అంతా తనవశం చేసుకున్నాడు. తాను పెద్ద ఆస్తిపరుడు కాకపోయినా 'దేహి' అని అడిగిన ప్రతివాడికీ కాస్తో కూస్తో ఇచ్చి సంతృప్తిపరచేవాడు. వ్రాతా కోతా సాధించకపోయినా ఐహికానికీ, ఆముష్మికానికీ కావలసిన విజ్ఞానం పూర్తిగా సంపాదించాడు. గుళ్లో పురాణాల దగ్గఱనుంచీ గూడెంలో తోలుబొమ్మలాటలవఱకూ అంకమ్మ లేందే అయ్యేవి కావు. అంత బ్రతుకు బ్రతికిన తండ్రి కడుపున పుట్టి తా మిద్దఱూ ఇట్లా అయిపోవడ మేమిటా అని అతని మనస్సు నిమిషనిమిషానికీ బాధపడింది.

కాని గోపాలం చిన్నప్పటినుంచీ ఎడ్డెం అంటే తెడ్డెం అనేరకం. అతడు ఒకడితో కలిసి ఎప్పుడూ ఉండలేడు. ఈసహజప్రవృత్తికి తోడు జీవితరంగంలో అతడు పెరిగిన పరిస్థితులుకూడా అట్లాగే సమకూడాయి. అతడు తల్లిదండ్రుల అదుపాజ్ఞలలో పెరిగి పెద్దవాడు కాలేదు. పుట్టిన రెండేళ్లకే తల్లి చనిపోవడం వల్ల మేనమామల ఇంటనే పెరిగాడు. తన భార్యకు ఇష్టం లేకపోయినా వాళ్ల మేనమామ తనకు చేతనైనంతలో గోపాలాన్ని శ్రద్ధగా పెంచి పెద్దవాణ్ణి చేశాడు. చిట్టచివరకి తన కూతుర్నిచ్చి చెల్లెలిమీది అభిమానంతో గోపాలానికి పెళ్లికూడా చేశాడు. ఎంత చేస్తే ఏం. గోపాలం తన తండ్రిగౌరవమర్యాదల్లో పాలుపంచుకుని పెరగలేదు.

తెల్లవారింది. పలుదోముపుల్ల నములుకుంటూ పుల్లారెడ్డి రాముడిదగ్గఱకు వచ్చాడు. రెండువందల రూపాయలు లెక్కపెట్టి రాముడి కిచ్చాడు. తండ్రి చనిపోయినప్పుడు దినవారాల ఖర్చుకు చేతిలో పైకం లేక తమకున్న ఒక్క బండినీ పుల్లారెడ్డి కిచ్చివేసి అవసరానికి ఒక వందరూపాయలు తెచ్చాడు రాముడు. అది పోగా బండిఖరీదులో మిగిలిన సొమ్మది. రెడ్డినీ, ఆ సొమ్మునూ చూచేటప్పటికి రాముడికి వెనకటి దుఃఖం అంతా నెమరుకువచ్చింది. రెడ్డిని కౌగలించుకుని 'తాతా! మా అయ్యగౌరవం ఇట్లా నిలబెట్టుతున్నాం' అని వెక్కివెక్కి ఏడ్చాడు.

రాముడి తల తన చేత్తో నిమురుతూ 'ఓరి! వెఱ్ఱివాడా! దీనికి నువ్వేం చేస్తావు? అయినా ఇట్లా ఏడ్చి ప్రయోజన మేమిటి? నీ మానాన నువ్వు బతుకు. ఎవరి గౌరవం వారికే ఉంటుంది' అని ఓదారుస్తూ ధైర్యం చెప్పాడు.

రాముడు కొంచెం తేఱుకొని చేతులో నోట్ల వంక చూచి కర్తవ్యం జ్ఞాపకం చేసుకుని 'తాతా! నీతో ఒకమాట చెప్పాలి. ఇట్లా కూర్చో' అని అరుగు మీద కూర్చోపెట్టాడు.

'తాతా! నువ్వు అప్పుడిచ్చిన వందలోనూ ఏనభై దాదాపు చిన్నదివానికీ పెద్దదివానికీ ఖర్చయి పాయి. అయితే ఆ ఖర్చులో వంతులు పెట్టడం నా కిష్టంలేదు. అందుకని మిగిలిన ఈ పైకం అంతా వాడికే ఇచ్చివెయ్యి. నేనిస్తే నాతో ఏదో జగడమాడి అవీ ఇవీ కెలుకుతాడు. అది అంతా నేను సహించ లేను. నువ్వే వాడి చేతికి పైకం ఇస్తే మాటేమీ మాట్లాడడు. ఈ కాస్తపనీ నా కోసం చేసిపెట్టాలి' అని రెడ్డిచేతులు పట్టుకున్నాడు రాముడు.

'సరేలే! నీ ఇష్టం అట్లా ఉంటే అట్లాగే చేస్తాను' అని రెడ్డి లేచి, బయలుదేరాడు.

అప్పటికింకా జాముప్రొద్దు ఎక్కలేదు. రెడ్డి అలా వీథిలో అడుగుపెట్టేటప్పటికి గూడుబండ్లీ ఒకటి వాకిట్లో నిలబడింది. గోపాలమే! అయి ఉంటాడు, మనము ఎందుకు పలకరించాలని తనదారిని తాను వెళ్లిపోయాడు రెడ్డి. గోపాలం భార్యను లోపలికి పంపించి, పాలేరుచేత పెట్టె బేడా దింపిస్తూ, వెళ్లుతూ ఉన్న రెడ్డివంక చూస్తూ నిలబడ్డాడు.

పరిచయం చిన్నబావతో ఎక్కువ ఉన్నా సీతమ్మకు పెద్దబావమీద అభిమానం ఎక్కువ. తన్ను చిన్నప్పుడు చిన్నబావ ఎప్పుడూ మొట్టికాయలు మొట్టడమే కాని ఎత్తుకున్న పాపాన పోలేదు. పెద్ద బావ అట్లా కాదు. చిన్నతనంలో తన్ను ఎత్తుకొని ఏది కావాలంటే అది తెచ్చిపెట్టేవాడు. తాను గుమ్మంలో అడుగుపెట్టుతూనే, కుఱ్ఱవాణ్ని బుజాన వేసుకుని జోకొట్టుతూ అటూ ఇటూ పచార్లు చేస్తున్న రాముణ్ని చూచింది సీతమ్మ.

'బావా! రంగయ్య కులాసాగా ఉన్నాడా?' అని అంటూ చేతులు చాచింది.

అంతలో గోపాలం లోపలికి వచ్చి సీతమ్మను చూచి 'నీకు వాళ్లతో ఏం సంబంధం! అటు పో. లోపలికి పో' అని కేక వేశాడు.

సీతమ్మ చాచిన చేతు లట్లాగే ఉంచి నివ్వెఱ పోయింది.

రాముడు రాతిబొమ్మలా నిలబడిపోయాడు.

'ఇంకా కదలవేం? నీకు కాదూ చెప్పేది!' అని గట్టిగా అరుస్తూ కళ్లు ఎఱ్ఱజేశాడు గోపాలం.

సీతమ్మ వెళ్లగా, తడబడుతున్న శరీరంతో తమ భాగంలోకి వెళ్లింది.

కుఱ్ఱవాడు గొల్లున ఏడుపు మొదలెట్టాడు. రాముడు తల వంచుకుని లోపలికి వెళ్లాడు.

గోపాలం కొత్తకాపురం ఈ విధంగా మొదలు పెట్టాడు. అతని వెనకనే వచ్చిన పాలేరు పెట్టె మూటా అరుగుమీద పెట్టి, అమ్మగారు కనపడక పోవడంచేత, అయ్యగారితో చెప్పడానికి భయం వేసి ఎవరితోనూ చెప్పకుండా బండితోలుకు వెళ్లి పోయాడు.

మఱునాటికల్లా తామరపువ్వుల్తో కలకలలాడే నిండుచెఱువువంటి అంకమ్మ ఇల్లు తిమితిమింగిలాలతో తరంగసంక్షుభితమయ్యే మహాసముద్రంలాగా మారి పోయింది. 'కూడలికాపురం కులకులలా, వేఱింటి కాపురం వెలవెలలా' అన్నట్లయింది వారి పరిస్థితి. పాలేళ్లిద్దఱూ పని మానేస్తామని రాముడితో చెప్ప డానికి వచ్చారు. తండ్రి బతికిఉండగా స్వంతానికి తోడు కవులుపొలం వ్యవసాయంకూడా ఉండేది కాబట్టి వాళ్ల అవసరం ఉన్నది. తనకు ఇప్పుడవి అన్నీ పెట్టుకునే మనస్వాస్థ్యం లేకపోబట్టి 'సరే వెళ్లండి' అన్నాడు. దాంతో ఎవరిపని వాళ్లు స్వయంగా చేసుకోవలసివచ్చింది. తానూ, తనభార్యా కాపురానికి కొత్త కాబట్టి కొన్నాళ్లపాటు గోపాలం పాలేర్ని పెట్టుకుండా మనుకున్నాడుగాని తనదగ్గఱ పనిచెయ్యడానికి ఎవడూ ఒప్పుకోలేదు. అందుచేత గోపాలం మగపనీ ఆడపనీ తనే చేసుకోవలసివచ్చింది.

పంపకాలయి సరీగా రెండురోజులే అయింది. రాముడు వీథిలోకి రావడం మానివేశాడు. ఎప్పుడూ ఇంటిపట్టునే ఉండేవాడు. తోచకపోతే అటూఇటూ పిచ్చి ఎత్తినవాడిలా తిరుగుతూఉండేవాడు. గంటల తరబడి గొడ్లపాకలో కూర్చునేవాడు. లేచి ఇంట్లోకి రాబోతూ అప్పుడప్పుడు గోపాలంభాగంలోకి పొర

పాటున అడుగుపెట్టేవాడు. ఆసమయంలో గోపాలం ఇంట్లోలేకపోతే 'రా! బావా! లోపలికి రా!' అని కేక వేసేది సీతమ్మ. ఈ కేక విని పొరపాటు తెలిసి కొని చటుక్కున వెనక్కి తిరిగి తన భాగంలోకి వచ్చేవాడు. గోపాలం ఇంట్లో ఉంటే ఆ పొరపాటూ జరిగేది కాదు. ఒకవేళ జరిగిందో, ఎదురుమాట రాముడు ఎన్నడూ చెప్పకపోయినా, వీథినిపోయే ప్రతివారూ ఆగేటట్లు గోపాలం గట్టిగా కేకలు వేసేవాడు.

ఎంత తంటాలుపడ్డా రాముడు గృహాన్ని పాక్షికంగా చూడలేకపోయాడు. ఒక్క గృహ మేమిటి? తన్ను తన పూర్వులతోటీ, తన వంశంతోటీ ఏకం చేసుకుని పెరిగిన అతని మనస్సు తన్ను తానుగా చూచుకోలేకపోయేది. చెయ్యి శరీరాన్ని ధిక్కరించి తెగిపోవచ్చు. ఆ తెగిపోవడంవల్ల శరీరానికి చెయ్యి లేదన్న అప్రతిష్ఠే వస్తుందిగాని తాను స్వతంత్రంగా బతకలేదు. ఈ విధంగా అతని మనస్సు ఊహించి ఊహించి విడివడడంవల్ల తమకు వచ్చే ప్రళయం ప్రత్యణువులోనూ సాక్షాత్కరింపజేసేది. ఒక్కొక్కప్పుడు తాము విడిపోలే దన్నట్టుగానే అతడు అనుకునేవాడు. అటువంటి సందర్భాల్లో బాహిరమైన ప్రతిబంధకాలు పంపకంవిషయం జ్ఞాపకం చేసేవి.

ఒకొక్కప్పుడు బాధ భరించలేక దైవప్రార్థన చేసేవాడు. ఆ ప్రార్థనా సమయంలో అప్రయత్నంగా తన తండ్రి యావజ్జీవమూ ప్రతినిత్యమూ నమస్కరించిన దేవుడున్న గూడు దగ్గరకు వెళ్లబోయేవాడు. కాని దారిలో తడిక అడ్డుతగిలేది. చటుక్కున చతికిలబడి తన ఊపిరితిత్తులలో ఒకదాన్ని కోసివేసిన బాధలో కుంగిపోయేవాడు. మరికొన్ని సమయాల్లో అతని సర్వస్వాన్నీ తండ్రి ఆవేశించేవాడు. అటువంటి సమయాల్లో తన తండ్రి కూర్చున్న చోటూ, అతడు వాడిన చెంబూ, అతడు పట్టుకున్న కఱ్ఱా ఇట్లాంటి వాటికోసం తహతహలాడేవాడు. కాని అవి ఏవీ అతని భాగంలో లేవు. అతనికి దక్కింది తండ్రి హృదయం మాత్రమే. భౌతికమైన తండ్రి ఆకారాన్ని జ్ఞాపకంచేసి ఏతద్వియోగబాధ నపనయించే బాహ్య వస్తు వొక్కటీ అతని భాగంలో రాలేదు.

గోపాలానికి విచారం ఏమీ లేదు. కాని ఒక్కొక్కరోజు గడిచినకొద్దీ అతనికి సంసారం బరువు ఎక్కువకావడం మొదలుపెట్టింది. పాలేరు లేకపోయినా తనకు కావలసిన పనులన్నీ తనే చేసుకుంటున్నాడు. ఎంత చేసుకున్నా తన్ను అనుకూలించేవాళ్లు ఊళ్లో ఎవళ్లూ లేకపోవడం అతనికి కష్టం అయింది. రెడ్డి ఇచ్చిన పైకం చేతిలో ఉన్నది. ఉన్నా దాన్ని ఖర్చుపెట్టుకోవడానికి వీలులేని పరిస్థితులు వచ్చాయి. తన కాపురం కొత్తది. తానా ఊళ్లో నిలదొక్కుకోవాలి. ఇప్పుడే పైకం ఖర్చుపెట్టితే ముందేం అవసరం వస్తుందో అని దాన్ని దాచిపెట్టాడు. దీనికి తోడు తన భార్య ఎంతసేపూ అన్నపక్షాన వాదించడం కూడా అతనికి ఇష్టమయ్యేది కాదు.

ఉన్నవి ఉండగా పంపకమైన మూడోనాటి నుంచీ అతనికి ఒక కొత్త బెడద వచ్చిపడింది. ఎడ్లలో అతని ఎద్దు చిన్నది కావడంతో అది బెంగపెట్టుకుంది. జతగా మెయ్యడం అలవాటయిన గొడ్డు కాబట్టి ఈ మూడురోజులనుండీ ఒంటరిగా కట్టివేస్తూ ఉండడంవల్ల మేత మెయ్యడం మానివేసింది. కొత్త వదిలితే అదే మేస్తుందని ఒకటిరెండురోజులు ఉపేక్షచేశాడు కాని తర్వాత గూడా అది అట్లాగే ఉండిపోయింది. దిష్టితాడు వేయించీ, మదుంతాడు కట్టించీ తంటాలు పడ్డాడు గాని లాభం లేకపోయింది. తన ఎద్దు ఇలా తీసిపోతూ ఉంటే రాముడి ఎద్దు బాగానే ఉంది. దీన్ని అతడు సహించలేకపోయాడు. తాను దుక్కలాగా ఉంటే తన అన్న రోజురోజుకూ కుషిక్కుస్తున్నాడే అన్న విషయం అతనికి తోచలేదు. అది తెలిస్తే ఈ ఎడ్ల పరిస్థితి కూడా అర్థ మయ్యేది. రాముడి ఎద్దు అప్పుడప్పుడు జత విడిచి పొరుగూరు పోయి పనిచేసి వచ్చేది. అందుకని గోపాలంఎద్దుకు పట్టినంతగా దీనికి జతవిడవడందుఃఖం పట్టలేదు. మొదట్లో రెండుమూడుపూటలు తోడి ఎద్దుకు సాను

భూతి చూపిస్తూ రాముడి ఎద్దు మేత మానివేసినా తర్వాత మామూలుగా మేత మేస్తోంది. అందుచేత రాముడికి తన ఎద్దువిషయమైన ఆందోళన ఏమీ అవసరం లేకపోయింది. కాని గోపాలంఎద్దు పదిరోజులు గడిచేటప్పటికి సగానికి సగం తీసింది. అది ఎప్పుడూ రాముడి ఎద్దువంకే చూస్తూ నిలబడేది. అప్పుడో పరకా అప్పుడోపరకా నమిలినా మనఃపూర్తిగా తినని తిండి ఏం వంటబట్టుతుంది?

రాముడికి దుఃఖం కొంచెం వెనకపట్టింది. ఇప్పుడు ఇదివరకు మాదిరి ఎప్పుడూ ఇంట్లో కూర్చోక బైటికి వచ్చి ఆపనీ ఈపనీ చూచుకుంటున్నాడు. ఊళ్లో పరపతి గల మనిషి కాబట్టి వాములదొడ్డినుంచి మేత తేవడం, పచ్చగడ్డి మోటబావులకింద ఎక్కడైనా ఉంటే తెచ్చుకోవడం మొదలైన పనులన్నీ తాను చేసుకోకుండానే ఇతరులచేత చేయించుకుంటున్నాడు. పనిచేసుకోవడంలో అతని కేమీ కష్టం లేకపోయినా అతని దుఃఖాన్ని తిరగబెట్టే పరిస్థితులు అనుక్షణమూ తటస్థిస్తూనే ఉన్నాయి.

గోపాలంఎద్దు ఇలా శుష్కిస్తూ ఉండడం అతన్ని ఎంతో కష్టపెట్టింది. అది రోజల్లా పాత బొమ్మలా నిలబడి కళ్లవెంబడి నీరుకారుస్తూ ఉంటే చూడలేకపోయేవాడు. దాని ఎదురుగుండా తన పాకలో కూర్చుని తానుగూడా ఏడ్చేవాడు. గోపాలం ఏకారణంచేతనైనా ఇంట్లో లేకపోతే తన ఎద్దును కట్టు ఊడదీసి గోపాలంభాగంలోకి తోలి అక్కడే



"రాముడిఎద్దు అప్పుడప్పుడు జతవిడిచి పొరుగూరు పోయి పనిచేసి వచ్చేది."

(పుట 326)

మఱింత మేత పడవేసేవాడు. దీని జతన ఉన్నంత సేపూ గోపాలంఎద్దుకూడా మేత మేసేది. ఇటువంటి సమయంలో ఒకరోజున గోపాలం చూచాడు. అతనికి ఒళ్లు మండే కోపం వచ్చింది. చేతికఱ్ఱతో రాముడి ఎద్దును కొట్టుతూ 'గొడ్డుమేతకోసం అసుద్ధం తినక పోతే ఏం? దగ్గఱ ఉండి మేపుకున్నాడు పెద్దమనిషి' అని అంటూ పెద్ద గందరగోళం చేశాడు. రాముడు నోరుమూసుకొని కళ్లనీళ్లు గుక్కుకుంటూ దగ్గఱికి వచ్చిన ఎద్దువీపుమీద చేత్తో నిమిరి దానిమీద పడి భోరున ఏడ్చాడు. మఱొకమాటు గోపాలంఎద్దు తాడు తెంపుకుని రాముడి ఎద్దుతో కలిసి మేత మేస్తోంది. రాముడు దాన్ని చూచి మఱింత మేత వాటిముందు పడవేసి రెండు చేతుల్తో రెంటికీ అఱ్ఱు గోకుతూ కూర్చున్నాడు. ఇదీ గోపాలంకంట పడింది. 'బుద్ధి గడ్డి తినే వెధవలకు ఎన్నిసార్లు చెప్పితే ఏం లాభం! నా ఎద్దుని తీసుకువెళ్లి తన పాకలో ఎవడు మచ్చిక చేసుకోమన్నాడు' అంటూ తన ఎద్దును లాక్కుపోయి పెద్ద అల్లరి చేశాడు.

ఇటువంటి సంఘటనలు ప్రతినిత్యమూ రాముణ్ణి కుంగదీస్తూనే ఉన్నాయి. గోపాలంఎద్దు ఏమాత్రమూ కోలుకోక అట్లాగే ఉండిపోతోంది. రాముడు దాని దీనస్థితి చూచి భరించలేకపోయాడు. దాన్ని బాగు చేద్దామని తాను ఏమి చేసినా గోపాలం దానికి దురర్థం కల్పిస్తున్నాడు. తన ఎద్దును గోపాలానికి ఇచ్చేస్తే ఆ ఎద్దు తప్పకుండా బాగుపడుతుంది. కాని తాను

ఈ పని చెయ్యడం తన భార్యకు ఇష్టంలేదు. ఒకసారి తాను ఈ అభిప్రాయం బైటపెడితే 'ఇచ్చుకోండి. ఇద్దఱమూ కాడి బుజాన వేసుకుని పొలం దున్నదాము' అన్నది. ఆవిడఅభిప్రాయం ఎట్లా ఉన్నా తాను ఇవ్వడానికే సిద్ధపడ్డాడు. కాని ఈ ముక్క తానంటే గోపాలం ఏమంటాడో! దీనికి ఏమి అర్థం కల్పిస్తాడో! మొత్తానికి అతనికి భయంగానే ఉంది. అయినా ఒకరోజున ధైర్యంచేసి చెప్పుదామని నిశ్చయం చేసుకున్నాడు. అప్పుడు గోపాలం గొడ్లపాకలో అతని ఎద్దుదగ్గఱ నుంచుని ఉన్నాడు. ఆ ఎద్దు మేత మెయ్యకుండా రాముడి ఎద్దువంక చూస్తోంది. అటువంటి సమయంలో రాముడు తన ఎద్దుదగ్గఱకు పోయి దాని తలతాడు ఊడదీసి నడుంమీద వేసి బైటికి తోలుతూ 'గోపాలం! నీ ఎద్దు బొత్తిగా పాడై పోతోంది. దీని జతన ఉంటే అది బాగుపడుతుంది. నేను మఱొక జత కొనుక్కుంటాను. దీన్నిగూడా నువ్వు తీసుకో' అన్నాడు. వెంటనే మబ్బులేకుండానే ఉఱుములూ మెఱుములూ ఫెళఫెళార్భటులు చేశాయి. 'నీమూలాన, నీ ఎద్దుమూలాన అన్యాయంగా నా ఎద్దు పాడైంది. పెద్ద ఔదార్యం చూపించవచ్చావు. పుచ్చుకున్న మఱునాటినుంచీ ఊరంతా రెండు ఎద్లూ కాజేశానని నన్ను అనేందుకా! నాకు నీ ఎద్దేమీ అక్కర్లేదు. నేనే మఱో ఎద్దు కొనుక్కుంటాను' అని దూకుడుగా వెళ్లిపోయాడు. రాముడు ఏం చెయ్యగలడు? తన ఎద్దును మళ్లీ గుంజకు కట్టుకున్నాడు.

గోపాలంప్రవర్తన ఇంతటితో ఆగలేదు. అతడు చేసే ప్రతిపనీ, అనే ప్రతిమాటా రాముడి దుఃఖాన్ని మఱింత గాఢతరం చేస్తూనే వచ్చాయి. తన భార్యని అన్నగారి భాగంలోకి వెళ్లవద్దని కట్టుదిట్టం చేశాడు. భర్తకు భయపడి వెళ్లడం అతని ప్రత్యక్షంలో మానినా మేనత్తకొడుకన్న చనువుండడంచేత పెద్దబావపక్షాన ఎప్పుడూ వాదిస్తూనే ఉండేది. ఆ వాదనలు అప్పుడప్పుడు చాలా తీవ్రంగా నడిచేవి. ఆ తీవ్రతలో తరతమ భావాన్ని బట్టి గోపాలంప్రవర్తనకూడా ఉండేది. ఒకమాదిరిది అయితే అన్నను తిట్టిపొయ్యడం, కొంచెం ఎక్కువయితే భార్యనీ అన్ననీ కలిపి తిట్టి తిండి తినకుండా లేచిపోవడం, అంతకన్నా ఎక్కువయితే భార్యమీద చెయ్యిచేసుకోవడం- ఇదీ వరస. ఈ వరస రోజు కొకమాటన్నా అన్ని దశల్లోనూ జరుగుతూ ఉంటుంది. ఒక రోజున పొద్దుగుంకేవేళ గోపాలం ఇంటికి వచ్చాడు. అప్పుడు సీతమ్మ రాముడి భాగంలోనుంచి బైటికి వస్తోంది. అప్పటికి రెండు రోజులనుంచీ చంటివాడికి జ్వరం తగుల్తోంది. సీతమ్మ కవకాశం దొరకక వాణ్ని చూడనన్నా చూడలేదు. ఆ పూట పనిమీద గోపాలం పొరుగూరు వెళ్లాడుకదా అన్న ధైర్యంతో పెద్దబావభాగంలోకి వెళ్లింది. సాయంత్రానికి తిరిగివస్తాను, జాగ్రత అని గోపాలం చెప్పివెళ్లాడు. ఎప్పుడు వస్తాడో అని సీతమ్మ భయపడుతూనే ఉంది. తా నిలా బైట అడుగుపెట్టిందో లేదో గోపాలం చక్కా వచ్చాడు. సీతమ్మను చూడడంతోటే గోపాలానికి ఉప్పెనలా కోపం వచ్చింది. అట్లా నిలబడి కళ్లు పెద్దవిచేసి ముఖంకండలు ఉబ్బించి సీతమ్మవంక చూచాడు. తల వంచుకుని మెల్లగా తమ భాగంలోకి వెళ్లింది సీతమ్మ. దీంతో గోపాలంకోపం మఱీ ఎక్కువైంది. సరాసరి లోపలికి వెళ్లి కంచంలో అన్నం పెట్టడానికి వంగిఉన్న సీతమ్మజుట్టు పట్టుకుని పైకి ఎత్తి ఛడామడా రెండుచెంపలూ వాయించాడు. చెంపమీద చెయ్యి అంటిపోయి వాతలు కనబడ్డాయి. ఆ ముఖం చూడకుండానే గోపాలం గిఱ్ఱున వెనక్కి తిరిగి బైటికి పోయాడు. ఏదో అఘాయిత్యం జరగబోతుందని రాముడు అనుకుని కుఱ్ఱవాణ్ని జోకొట్టుతూ ఇవతలకు వద్దామని ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ఇంతలో దెబ్బ తగలడం, సీతమ్మ ఏడవడం, గోపాలం వెళ్లిపోవడం అన్నీ జరిగాయి. ఏడుస్తున్న కుఱ్ఱవాణ్ని మంచంమీద అట్లాగే ఉంచి రాముడు హడావిడిగా సీతమ్మదగ్గఱకు వెళ్లాడు. రాముణ్ని చూచి 'బావా! రాబోకు-వెళ్లిపో! వెళ్లిపో! నిన్నుగూడా కొట్టుతారు. నేను చూడలేను, వెళ్లిపో' అని బిగ్గఱగా అఱచింది. రాముడు మఱదలుతల నిమురుతూ కొంచెంసేపు ఓదార్చాడు. 'సీతా! వాడు ఎప్పుడూ ఇలాగే

ఉండడు. వాడి అంతట వాడే మానతాడు. ధైర్యం వహించాలిగాని నువ్వే ఇట్లా అయితే ఇక నేనేం కావాలి? నేను ఎంత బాధపడుతున్నానో నీకు తెలియదూ' అని అంటూ ఉండగానే ఏడుస్తున్న కుఱ్ఱవాణ్ని సముదాయించడానికి వచ్చిన అన్నపూర్ణ సాధింపుమాటలు వినపడ్డాయి. 'ఈ లెక్కన కుఱ్ఱవాడు గోలపెట్టుతూ ఉంటే వాడిదగ్గఱ కొంత కూర్చో కూడదూ? అటు వంటా, ఇటు పిడి సంరక్షణా అన్నీ నేనే చూచుకోవాలిసి ఉండె. అయినా ఎన్నిటికని నేనేడుస్తాను! అయినా వాళ్ల కాపేక్షలుండాలిగాని ఇటు చేసుకున్న పెళ్లామూ లెక్కలేకపోయె-కన్న కడుపు అని ఆపేక్షా లేకపోయె. ఇంతకూ మన అదృష్టం ఇట్లా తగలబడింది. ఏడవకురా వెధవా' అని విసుక్కుంటూ కుఱ్ఱవాడి పిఱ్ఱమీద రెండు అంటించి, వాడు కెవ్వుమనగా ఎత్తుకుని దూకుడుగా లోపలికి వెళ్లింది అన్నపూర్ణ. ఈ మాటలు రాముడి హృదయంలో శూలాల్లా గుచ్చుకున్నాయి. మాఱు మాట్లాడలేక స్తబ్ధుడై నిలబడిపోయాడు. కరపాత శిలా శకలాలనడుమ పడి నలుగుతున్న శిరీషపుష్పమువలె నైఅతని హృదయం చైతన్యం కోల్పోయింది. ఇంతలో గోపాలం వస్తూ ఉండడం చూచి ఏదో తప్పుచేసినవాడిలా అప్పుడే తెలివివచ్చిన రాముడు తన భాగంలోకి తూలుతూ తడుముకుంటూ వచ్చేశాడు.

ఈ విధంగా ఒకవంక తమ్ముడూ, మఱొకవంక భార్యా తన్ను అనే మాటల్తో జీవితంమీద అసహ్యం పుట్టి దుఃఖభారంతో ఎందుకు వచ్చిందిరా భగవంతుడా అన్నట్లు జీవయాత్ర సాగిస్తున్నాడు రాముడు. పట్టుదలగల గోపాలం ఎన్ని విషమపరిస్థితులు వచ్చినా అట్లాగే నెట్టుకురావాలని ప్రయత్నిస్తున్నాడు. ఎన్ని విషయాల్లో సర్దుకోగలిగినా ఎద్దువిషయంలో మాత్రం గోపాల మేమీ చెయ్యలేకపోయాడు. అది నానాటికి తీసిపోతోంది. ఇంకా కొన్నాళ్లు ఉపేక్షచేస్తే చచ్చిపోతుందేమో అనికూడా అనిపిస్తోంది. చిట్టచివఱకి గోపాలానికి ఎట్లాగైనా దాని సంగతి తేల్చుకోవాలన్న నిశ్చయం కలిగింది. దాని జతకు మఱొక ఎద్దును కొనడం తప్ప మఱే ఉపాయమూ తోచలేదు. ఎద్దును కొనడం అంటే సామాన్యమైన విషయంకాదు. అయిదువందలన్నా ఉండాలి. బంకిబాపతు రెడ్డి యిచ్చిన రెండువందలు తప్ప తన దగ్గిఱ దమ్మిడీ లేదు. ఏమిటి చెయ్యడం. భార్యనగ లమ్మడానికి తగిన స్వాతంత్ర్యం తన మేనమామదగ్గఱ తనకు లేదు. అందుకని వాటి జోలికి పోగూడదు. ఎదురుగుండా ఆవూ, గేదే కనబడుతున్నాయి. వాటి నమ్మితే కావలసిన పైకం వస్తుంది. కాని మజ్జిగచుక్కకు కరువు వస్తుంది. పల్లెటూళ్లల్లో చల్లచేసి కుడితితొట్లలో అన్నా పోస్తారుగాని ఊరికే అసలు పొయ్యరు. అయినా సరే ఇబ్బంది పడకతప్పదు. అమ్మితీరాలి. అమ్మకపోతే ఉన్న ఎద్దే పోతుందేమో అన్న భయముండె. అదిగూడా పోతే తాను ఎద్దు కొనాలేడు; వ్యవసాయం చెయ్యనూలేడు.

ఈ రోజుల్లో పాడిగొడ్డునీ, పంటపొలాన్నీ అమ్మజూపితే కొనం దెవరు? నిమిషాల్లో నూఱు దగ్గఱనుంచీ నూటఎనభైదాకా పెరిగింది ఆవుఖరీదు. పుల్లారెడ్డి తాను రాకుండా పాలేరును పంపించి 'రెండు వందలు ఇస్తాను ఇవ్వవలసిం'దని కబురుపంపించాడు. గోపాలం ఇంకా వస్తుందేమో అని ఒకరోజు చూచి, ఇంకా ఆశపడడం భావ్యం కాదని వాళ్ల పాలేర్నే కేకేసి తోలుకువెళ్లమన్నాడు. గేదె నమ్మితే నూట ఎనభైకంటే ఎక్కువరాలేదు. వచ్చిన సొమ్ముకు ఉన్న సొమ్ము కలిపి తన ఎద్దుకు సమానమైన ఎద్దు కొనాలని భగీరథప్రయత్నం చేశాడు. కాని సఫలం కాలేదు. చిట్టచివఱకు తన ఎద్దుకంటే ఒక గుప్పెడు ఎత్తు తక్కువున్న దాన్ని - నాలుగుకార్ల ఎద్దును కొనుక్కొని వచ్చి పాకలో తన ఎద్దుపక్క కట్టేశాడు.

ఇంత చేసినా పాప మా రొద్దు కెంగ వదలలేదు. తాను చిక్కినా అది కొత్తఎద్దువంక గౌరవంతోనూ చూచేదికాదు, ప్రేమతోనూ చూచేదికాదు. ఏదో అప్పుడప్పుడు మఱీ అంతగా కడుపులో ఎలికలు దూరితే ఒకపరక ఎంగిలిపడడమేగాని ఆప్యాయంగా తినడమే లేదు. మఱి అదేం కోలుకుంటుంది! యథా

ప్రకారంగా ఆ ఎద్దు తీసిపోవడంతప్ప అభివృద్ధి సూచన లేమీ కనపడడంలేదు.

3

ఇంతలో జ్యేష్ఠమాసం వెళ్లింది. ఆ నెలలో అప్పుడొకవానా అప్పుడొకవానా పడి నేల అంతా చక్కగా పచ్చికపట్టింది. అందుకని ఎడ్లనుగూడా పొలం తోలుతున్నారు. పొలంతోలడం మొదలుపెట్టిన దగ్గఱనుంచీ గోపాలంఎద్దుగూడా కొంచెం బాగు పడింది. ఈ మార్పుకు కారణం పొలంతోలడ మేమాత్రమూకాదు. కాని అందువల్ల దానికి రాముడి ఎద్దుతో పగలంతా కలిసిఉండే అవకాశం వచ్చింది. ఒక్క ఇరవైఏళ్లు జైలులో ఒంటిరిగా చీకటికొట్టులో జీవితం గడపిన వ్యక్తి బైటికి వచ్చినప్పుడు ఎంత ఆనందం అనుభవిస్తాడో అంత సుఖం అనుభవించింది పాప మా ఎద్దు. చిన్నప్పటినుంచీ తనతో ఎదిగిన ఎద్దు తన పక్కన లేకపోవడంవల్ల ఇన్నాళ్లబట్టీ ఎంత మథనపడిందోకాని పాపం తల్రతాడు ఊడదీసి పొలం తోలడానికి పాకలోనుంచి బైటికి పంపిన దగ్గఱనుంచీ తిరిగి ఇంటికి వచ్చేవఱకూ ఒక్కక్షణం రాముడి ఎద్దును విడిచి ఉండడంలేదు. ఎంతసేపూ దాని ప్రక్కనే నడుస్తుంది. తన శరీరం దాని శరీరాని కొరుసుకునేటట్లు నడుస్తుంది. నెమరువేసేటప్పుడు దాని కెదురుగుండా పడుకుని కళ్లల్లో కళ్లుపెట్టి చూస్తూ ఉంటుంది. ఇటువంటి పరిచయం వచ్చి చాలుగు రోజులు కాకపోయినా అది పోయిన బలం అంతా సంపాదించుకుంది. 'ఉత్సాహం సగం బలం' అన్న మాటలో ఎంత నిజముంది! ఆ జతను చూచిన వాళ్లందఱూ ఎటువంటి జతరా అని ఆశ్చర్యపడకుండా ఉండరు.

తన ఎద్దులో కలిగిన ఈ మార్పుకు గోపాలం సంతోషించకపోలేదు. వ్యవసాయపు దుక్కులు సాగించడానికి ఇంకా పదిరోజులు వ్యవధి ఉన్నది కదా, ఇంతలో ఇది హాయిగా బాగుపడుతుంది అని ఆశపెట్టుకున్నాడు. దాన్ని త్వరగా బాగుచెయ్యాలన్న ఉద్దేశంతో తెలగపిండీ, మడ్డికూడా పెట్టించాలనికూడా అనుకున్నాడు. కాని, తీరా తెప్పించి దాని ముందు పెట్టేటప్పటికి అది వాసనైనా చూడలేదు. పాప మాయెద్దుమనస్థితి ఏమిటోకాని ఇంటికి వచ్చాక ఏవిధమైన మేతా మెయ్యదు. పొలంలో ఆఎద్దుతో కలిసి ఏంమేస్తుందో అంతే. ఈవిషయం గోపాలానికి కొంత నిరుత్సాహం కలిగించింది. కాని ఏం చెయ్యగలడు? అట్లాగే సమాధానపరుచుకుని ఊరుకున్నాడు. కొత్త ఎద్దు రావడంవల్లనే తన ఎద్దు బాగుపడిందని అతని అభిప్రాయం. ఇంటిదగ్గఱ మేతమెయ్యక పోవడంబట్టి అది సరియైన అభిప్రాయం కాదని తెలుసుకోవలసిఉన్నా తనకు వ్యతిరేకమైన ఊహ రానిచ్చేవాడు కాడు. మొత్తంమీద ఎద్దులో కలిగిన మార్పుకు సంతోషిస్తూనే వచ్చాడు.

అది చెఱువుకింద పల్లాల ఊరు అవడంవల్ల పల్లపుదుక్కులు తొలకరిలోనే ఆరంభించినా చెఱువు నిండేవఱకూ వ్యవసాయపుపనులు ఉమ్మరంగా సాగవు. తొలకరించడంతోటే రాముడు పుల్లారెడ్డిదగ్గఱకు పోయి అతని పొలంలో ఒకరోజు పని చేసి అతని అరక అడిగితెచ్చుకుని తన పొలం దున్నుకున్నాడు. తన ఎకరంపొలానికీ కావలసిన నారుగూడా రెడ్డి పొలంలోనే పోసుకున్నాడు. సాధారణంగా పశువుల విషయమూ, ముఖ్యంగా తన ఎద్దువిషయమూ తెలిసిన వాడు కాబట్టి రాముడు తన ఎద్దుకు మఱోఎద్దుతో జతకలపడానికిగాని, దానిచేత పనిచేయించడానికిగాని పూనుకోలేదు.

గోపాలానికి ఊళ్లో తనకు అట్లాంటి సహాయం లభ్యమౌతుందన్న ఆశ లేదు. అందుచేత గత్యంతరం లేక తన ఎడ్లు రెంటినీ జతకలిపి దున్నుకోవలసిన అవసరం వచ్చింది. పూర్తిగా నాగలికట్టి దున్నడం మొదలుపెట్టకముందు రెంటినీ కాడిగట్టి అలవాటు చెయ్యాలని కఱ్ఱులేని నాగలితో ఒకరోజున ప్రయత్నం చేశాడు. కొత్త ఎద్దుజత గిట్టక గోపాలం ఎద్దు మారాం చెయ్యడం మొదలుపెట్టింది. కోపంవచ్చి నాలుగుదెబ్బలు వేస్తే రెండడుగులు వేసినా ఏమఱుపాటున ఎటో అటు

లాగివేసేది. నానాయాతనా పడి మళ్లీ స్వాధీనంలోకి తెచ్చుకుని ఎంత అరిచినా, ఎంత కొట్టినా, ముల్లుకర్ర పెట్టి ఎంత పొడిచినా అడుగుతీసి అడుగు పెట్టేది కాదు. వట్టికాడి బుజాన వేసి జతను తోలుకువస్తే అలవాటుఅవుతుందని ఇంటిపై పురుమళ్ల వేస్తే కొత్త ఎద్దును తనతో పాటు పరిగెత్తించి మేఘాలమీద ఎగిరిపోయి, ఏచెట్టుకో కాడి తగిల్చి, మెడతాడు తెంపుకుని భూప్రదక్షిణం చేసి అర్ధరాత్రి ఏవేళకో యింటికి వచ్చేది. దాంతో పౌరుషం వచ్చి ఎద్దు ఇంటికి రావడంతోటే గోపాలం దాన్ని కోపంతో కొట్టేవాడు. కసి తీర్చుకున్నా ననుకుని రేపు దుక్కిలో దింపితేసరి లాగ కేంజేస్తుందని ధైర్యం వహించేవాడు.

ఆరాత్రి బ్రహ్మాండంగా వర్షం కురిసింది. గట్లు తెగేటంతగా చెఱువులు నిండాయి. ఆబాల గోపాలం పల్లెటూళ్లో అందఱూ తమతమ అభీష్టాలు నెఱవేరినట్లు సంతోషిస్తున్నారు. సంస్కారవంతుడైన మానవుడు పరోపకార విషయకంగా ఆర్ద్రమనస్కుడైనట్లు భూమి సమస్తమూ బీజనిక్షేపానికి అనువైంది. నేల యీనినట్లు కర్షకజనం యావన్మందీ పంట పొలాల్లో పనిచేసుకోవడానికి బయలుదేరారు.

తెల్లవారకుండానే మధ్యాహ్నంలోపల తన ఎకరం పొలం ఊడ్చెయ్యాలని రాముడు రెడ్డిఅరక తోలుకుని పొలానికి వచ్చాడు. గోపాలంకూడా తన జతను వెంటబెట్టుకుని రెండుచాళ్లన్నా ఇవాళ దున్నుదామని బయలుదేరి వచ్చాడు. ఉన్న రెండెకరాల భూమికి రెండుజతల ఎడ్లతో వ్యవసాయం చేస్తున్న వీళ్లని చూచి ప్రకృతే నవ్వుతోందా అన్నట్లుగా ధళ్లున తెల్లవారింది.

గోపాలం తన జతతో దుక్కి సాగించడానికి తీవ్రప్రయత్నం చేస్తున్నాడు. కాని ఎంత చేసినా లాభంలేకపోతోంది. గోపాలంఎద్దు కొత్తఎద్దుతో ఏమాత్రమూ సహయోక్య కుదుర్చుకోలేదు. వట్టి నేలనైతే తన యిష్టం వచ్చినట్లు గంతులువెయ్యడానికి అవకాశం ఉండేది. వరిపొలంమడిలో దుక్కి అయిన కారణంచేత బురదనేల అవడంబట్టి అటూ ఇటూ పారిపోవడానికి వీలు చిక్కడం లేదు. గోపాలంఎద్దు ఒక కొత్తవిద్య నేర్చుకున్నది. కొత్తఎద్దుతో జతకలవక అది కాస్త ముందుకు లాగిందంటే ఇది చటుక్కున పడుకునేది. తోక మెలిపెట్టి, ముల్లుకర్రతో పొడిచీ, ఇంకా లేవకపోతే ఆ కర్రతోనే వీపుమీద నాలుగు వేసీ, వీటన్నింటికీ ఊతగా రాముణ్ని ఉద్దేశించిన తిట్లు కలిపి ఎంతో హైరాణపడగా ఒకసారి లేచేది. చాచో అని రెండడుగులు వేయించేటప్పటికి మళ్లీ పడుకునేది. తానిలా తన దుక్కిలో నానా తిప్పలూ పడుతూఉంటే తన పక్కనే రాముడు ఏ కష్టమూ లేకుండా పొలందుక్కి పూర్తిచేసుకో



"గోపాలంకూడా తనజతను వెంటబెట్టుకొని రెండుచాళ్లన్నా ఇవాళ దున్నుదామని బయలుదేరి వచ్చాడు."

వడం చూచి సహించలేక కోపం మరీ ఎక్కువై ఒళ్లు తెలియకుండా బాదడం సాగించాడు గోపాలం.

గోపాలంమనసులో ఒక పుట్టీపుట్టని ఊహ. తాను పడే కష్టమంతా చూస్తూ తనకంటే వ్యవసాయంలో ఎక్కువ అనుభవమున్న రాముడు తాను అడగకపోతేమాత్రం ఎందుకు సహాయం చెయ్యకూడదు! కాని యీ యూహ రూపుకట్టనివ్వకుండా అతని వ్యక్తిత్వం అడ్డునిలిచేది. వెంటనే వాడేమిటి, నాకు సహాయం చేసేదేమిటి అనే ధోరణి ప్రబలి' అంతా తనే చేసుకోవాలన్న పట్టుదల తోచి, నిర్వహించుకోవడానికి ఉపాయం తట్టక అసమర్థతా పారవశ్యదూషితమైన ఈ ప్రవర్తనలో పడిపోయాడు గోపాలం. గోపాలాన్ని చూస్తే రాముడికి జాలీ కలుగుతోంది, కోపమూ వస్తోంది. తమ్ముడికి సాయం చెయ్యాలన్న భావం అతని మనస్సులో ఎప్పుడూ గాఢంగా ఉంటుంది. కాని చెయ్యబోతే అతడు దానికి ఏ అర్థం చెప్పి తన్ను దూషిస్తాడో అన్న భయంమాత్రం వెంబడిస్తుంది. అందుచేత జంకుతాడే కాని అసలు చెయ్యకపోవడం అతని స్వభావంలో లేదు. ఇప్పుడు గోపాలం ఎద్దువల్ల పడుతున్న యాతన చూచినదానికంటే గోపాలం ఎద్దును పెట్టుతున్న యాతన చూచి అణుమాత్రం సహించలేకపోయాడు రాముడు. ఈసారి గోపాలం ఉగ్రం చూస్తే ఎద్దునెత్తురు కళ్లచూస్తాడా అనిపించింది. రాముడి గుండె దడదడలాడింది. చటుక్కున కఱ్ఱు లోతుగా గ్రుచ్చి, దుక్కి ఆపివేసి వెనక్కి తిరిగాడు. గోపాలం ఇంకా కొట్టుతూనేఉన్నాడు. ముల్లుకఱ్ఱ చేత్తో పుచ్చుకుని చకాచకా నాలు గడుగులు వేసి ఎద్దుదగ్గఱకు పోయాడు రాముడు. గోపాలం ఎత్తిన కఱ్ఱ ఎత్తినట్లే ఆగిపోయాడు. రాముడిలా వస్తాడని అతెన్నడూ అనుకోలేదు. రాముడు సరాసరి ఎద్దుదగ్గఱకు పోయి దాని వీపుమీద రాస్తూ, ముఖంలో ముఖం పెట్టి చూచి కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. ఒళ్లంతా వాతలు తేలిఉంది. వానిమీద చెయ్యి వేసి, దాని కళ్లల్లో చూస్తే తన శరీరంలో ప్రతినరమూ ఉలికి వాతలు తేలి కలుక్కుమన్నట్టయింది. ఆ బాధ భరించలేకపోయాడు. ఒక్కమాటు దాని ముఖంమీద ముఖం పెట్టి ఏడ్చాడు. దాని మెడమీద పెట్టిన తన చేతికి కాడికట్టు తగిలింది. అప్పుడు తెలివివచ్చి మెడతాడు వదిలించి కాడి ఊడదీసి గట్టున పెట్టాడు. గోపాలం ఏం చెయ్యడానికీ తోచక ఎత్తిన కఱ్ఱ దించి కానేపు నుంచున్నాడు. రాముడు ఎద్దును నంచోపెట్టాలని తోకమీద నిమిరి జబ్బ చరుస్తున్నాడు. అది లేవడం లేదుగాని కలత నిద్రలో మనిషి ఉలిక్కిపడ్డట్టు కదులుతోంది. రాముడికికూడా ఏం చెయ్యడానికీ తోచలేదు. చెఱువుకట్ట అంచున మొలిచిన పచ్చిగడ్డిపరకలు కోసితెచ్చి అరచేతుల్లో పెట్టుకుని దాని కెదురుగా కూర్చున్నాడు. గోపాలం ఒకచోట నిలబడలేకపోయాడు. రాము డక్కడుండగా ఎద్దుదగ్గఱకు పోలేకపోయాడు. చిరాకెత్తి ఒళ్లుతెలియనివానిలాగా పొలంగట్ల వెంబడి చకచకా నడవడం మొదలుపెట్టాడు.

అప్పటికి ఝాముపొద్దెక్కింది. ఎఱ్ఱగుడ్డ కట్టిన కూడుదుత్త నెత్తిన పెట్టుకుని పొలంకాపునకు అన్నం తెచ్చిపెట్టే కాపుపడుచువలె సూర్యుడు చెఱువుకట్టపైకి వచ్చాడు. బాలసూర్యకిరణచిత్రితవర్ణసమాక్రాంతములైన శాద్వలభూములు సత్యకాలంలో కృషీవలుడు స్వయంకృషిచేత సంపాదించిన మంచి బంగారపు మేలిమికాంతుల భ్రాంతిమాత్రమే కల్పిస్తున్నాయి. కాని యిది సత్యమునం దసత్యభ్రాంతియేమో అని అనిపిస్తోంది. ఆ కాంతులవెంబడి రాత్రి చల్లదనము సర్వస్వమూ తొలికోడికూతలో కోల్పోయిన ఎద్దుమెడలోని కంచుగంట సుస్పష్టశ్రావ్యనినాదములు వినవచ్చినవి. చెఱువుతొట్టులోకట్టున మేత మెయ్యడానికి ఊళ్లో గొడ్లన్నీ అప్పుడప్పుడే వస్తున్నాయి. రాముడి ఆవూ, గేదేకూడా వచ్చాయి. ఆవు చెఱువుకట్ట ఎక్కి మడిలో పడుకున్న ఎద్దునూ, ఎద్దుదగ్గఱ కూర్చున్న రాముణ్ణీ చూచి అరిచింది. ఆ అరుపుకు గోపాలంఎద్దు ప్రతిధ్వని చేసింది. అటూ ఇటూ తిరుగుతున్న గోపాలం ఒకసారి ఆవువంకా,

ఒకసారి తనఎద్దువంకా చూచి ఆగాడు. అంతలో మళ్లీ పచార్లు మొదలుపెట్టాడు. ఆవు చెరువుకట్ట దిగి మడిలోకి రాబోతోంది. గోపాలానికి చిరాకు ఎక్కువైంది. దూకుడుతో అటూ ఇటూ నడవడంలో రాముడి మడిలో మెడమీది కాడితో బురదనేలలో దిక్కులు చూస్తూ దవడలు ఆడిస్తున్న రెడ్డిగారి ఎడ్ల జత గోపాలంకంట బడింది. అతడు సరాసరి దాని దగ్గఱకు పోయాడు. అనాలోచితంగా మెడకట్లు వదిలించి కాడి ఊడదీసి గట్టున పెట్టాడు. ఎడ్లు రెండూ రెండడుగులు వేసి మడిదాటి రోడ్డుమీదకి వచ్చాయి. గోపాలం వాటివెంబడే వెళ్లాడు. ఎదురుగుండా రాముడి ఎద్దు వస్తూ వీటిని చూచి అరిచింది. అది దూకుడుగా చెఱువుకట్టమీదికి వెళ్తోంది. గోపాలం ఎడ్లను తోలుకుని ఊళ్లోకి వెళ్లిపోతున్నాడు.

చెఱువుకట్ట ఎక్కి రాముడి ఎద్దు మడిలో గోపాలంఎద్దును చూచి గట్టిగా అంభా అని అరిచింది. గోపాలంఎద్దుకూడా దీనివంక చూచి అంభా అని మళ్లీ అరిచింది. రాముడి ఎద్దు ఒక్క అంగలో మడిలోకి ఉరికింది. గోపాలం ఎద్దు ఒక త్రుటిలో లేచి నిలుచుంది. త్రవ్వుతున్న భావిలో జల పొడిచినట్లు రాముడి మనస్సులో ఉత్సాహం పరవళ్లుత్రొక్కింది. రెండెడ్లూ ఒకదాని మూతి మఱొకదానికి ఆన్చుకుని దీర్ఘకాలవియోగదుఃఖ మలినకథాప్రసంగములతో ఓదార్పుపొందాయి. ఒకదాన్ని ఒకటి వెంబడించి గట్లనున్న గడ్డిపరకలు కొరికాయి. ఒక్కొక్క క్షణం ఆగి ఒడళ్లు ఒరుసుకోగా గాఢపరిష్వంగసౌఖ్యం అనుభవించాయి. రాముడు వాటివంకనే అనిమీలిత దృక్కులు ప్రసరిస్తూ ఆనందతన్మయుడై నిలబడ్డాడు.

అరగంట గడిచింది. ఎడ్లు మేత మాని మువ్వలు లేని బోసుపట్టెడ మ్రోగగా దవడలు ఆడిస్తూ నిలబడ్డాయి. రాముడు కాడి తీసి వాటి బుజాన వేశాడు. అప్పటికింకా ప్రొద్దు నడినెత్తికి రాలేదు. ఇంకా గజంనీడ పడుతూనే ఉంది. వేసవికాలం కాబట్టి ఇళ్లకు పోవలసిన సమయం. ఎండవేడి ఎక్కువగానే ఉంది. కాని కాడి బుజాన వేసుకుని ఎడ్లు ఊరికే నుంచోక నడక సాగిస్తూ ఉండడం చూచి రాముడు అనాలోచితంగానే మేడికోలు కాడికి బిగించి నాగలి కొమ్ము చేతబుచ్చుకున్నాడు. దుక్కి సాగిపోతోంది. అరఘడియలో చాలదుక్కి పూర్తిఅయింది. ఎడ్లు మహదావేశంతో ముందు నడుస్తున్నాయి. రాముడు ఉత్సాహంతో దుక్కి పగ్గం పట్టుకు నడిపిస్తున్నాడు. దుక్కి రెండుచాళ్లూ కలపడం అయిపోయింది. ఎడ్లు వాటి అంతట అవే ఆగిపోయాయి. రాముడు తల యెత్తి చూచాడు. ప్రొద్దు నడినెత్తికి వచ్చింది.

కాని కాలం వేళమించిపోయింది. ఇక ఉండడానికి వీల్లేదు. రాముడు వెంటనే కాడి ఊడదీసి ఎడ్లను విడిచిపెట్టాడు. ఎడ్లు జంటవిడవకుండా ముందునడవడం మొదలుపెట్టాయి. రాముడు తన మడిలో ఎడ్లకోసం చూచాడు. ఎడ్లను ఊడదీసి గోపాలం తోలుకువెళ్లడం రాముడు గమనించనేలేదు. ఇప్పు డక్కడ ఎడ్లు కనబడకపోవడంతో అతడు ఒక్కక్షణం నిర్ఘాంతపోయాడు. తన తమ్ముడి ప్రవర్తన ఇంతలో ఇట్లా మారుతుందని అతడు అనుకోలేదు. రాముని స్వభావంలో మాలిన్యం లేకపోయినా తమ్ముని ప్రవర్తన అతని మనస్సులో తెచ్చిపెట్టిన కష్టంవల్ల గోపాలం ఈపని చెయ్యడం ఇంకెందుకైనా యేమో అన్న అనుమానం రాకపోలేదు. కాని అతని సహజ సుస్వభావం తలయెత్తి ఈ ఊహను నిలవనియ్యలేదు. ఎడ్లు ఉల్లాసంతో జతగూడి నడుస్తున్నందుకు సంతోషమూ, గోపాలంప్రవర్తన అర్థం కాక అభావమూ పునఃపునః పర్యాప్తములై అతని మనస్సుమీద రాజ్యం చేస్తున్నాయి. మండుటెండలో పండువెన్నెలలోవలె ఎడ్లవెంబడి రాముడు ఊళ్లోకి నడక సాగించాడు.

గోపాలం రెడ్డిగారి ఎడ్లను ఆయన కప్పచెప్పి ఇంటికి చిరాకుతో వచ్చాడు. భర్తచిరాకూ, విసుగూ చూచి సీతమ్మకు నోట మాటరాలేదు. ఏమనడానికీ తోచక చల్లని నీళ్లుమాత్రం తెచ్చి ఎదురుగుండా పెట్టి లోపలికి వెళ్లిపోయింది. అన్నపూర్ణ ఉదయంనుండీ వంట ఇంట్లో పనులు ఒకదానివెంబడి ఒకటి తలపెట్టు

కోవడంవల్ల తీరక యాతనపడుతోంది. కుఱ్ఱవాడు రంగయ్య ఆలస్యంగా పడుకోడంవల్ల చాలాసేపే నిద్రపోయాడు. కాని పదిగంటలయేటప్పటికి నిద్రలేచి అప్పుడప్పుడు గుక్కపెట్టి ఏడవడం మొదలుపెట్టాడు. సీతమ్మ పిలువాచుకుని అన్నపూర్ణకు తెలియకుండానే పిల్లవాణ్ణి తీసుకుందామని ప్రయత్నం చేస్తోందేకాని ఆమెకు కూడా తీరలేదు. ఇంతలో గోపాలం రానే వచ్చాడు. గోపాలాన్ని చూడ్డంతోటే సీతమ్మకు ఈ ఊహ కాదుగదా ఏ ఊహా తోచలేదు. కాని అంతలో పిల్లవాడు గోలపెట్టడం మరీ ఎక్కువైంది. ఆ ఏడుపు వినబడడంతోటే ఎన్నడూ కదలని గోపాలం కూడా మనసులో ఒక కదలిక పొందాడు. అమాంతంగా లేచినుంచున్న భర్తను చూచి సీతమ్మ హడిలిపోయింది. కాని గోపాలం చరాచరా అటూఇటూ ఒకసారి నడిచి 'ఆలెక్కన ఏడుస్తుంటే వినపడటం లేదూ? కదలవేం' అని అంటూ సీతమ్మను చూచి కళ్లు పెద్దవి చేశాడు. సీతమ్మకు ఈ విధమైన భర్తప్రవర్తన ఏమీ అర్థంకాలేదు. ఆమాటల్లో ఎంత నిజమో, ఎంత అబద్ధమో తోచలేదు. వెళ్లడానికీ, ఉండడానికీ కూడా భయం వేసింది. 'నీకు కాదూ చెప్పేది' అని అంటూ గోపాలం మధ్యనున్న తడికను ఒక తన్ను తన్నాడు. తన్నుతా తెలియని పారవశ్యంలో క్రిందబడ్డ తడికను తొక్కుకుంటూ సీతమ్మ పరుగెత్తుకునిపోయి పిల్లవాణ్ని తీసుకుంది. అన్నపూర్ణ తడికపడ్డ చప్పుడు విని బైటికి వచ్చి ఆశ్చర్యపడి నిలబడింది.

తల లాడిస్తూ, బొణుగుల చప్పుడు ఒయ్యారంగా చేసుకుంటూ కలిసిమెలిసి పెరిగిన అన్నదమ్ముల వలె ఎడ్లజత లోపల అడుగుపెట్టింది. గోపాలం ఆ రెండెడ్లనూ తలపగ్గాలు లాగి ఒకచోట కట్టి మేత వేశాడు.

బుజంమీది కాడితో రాముడు వచ్చి ఎడ్లను కట్టుకున్న తమ్ముణ్ని చూచి విస్తుపోయి నిలబడ్డాడు. ఎడ్లను కట్టిన గోపాలం వెనక్కితిరిగి అన్నను చూచి 'రెండు ఝాము లయేదాకా పొలంలో ఏం చేస్తున్నట్టన్నయ్యా! ఎండ మండిపోవడం లేదూ?' అని అన్నాడు.

తండ్రి పోయిన ఇన్నాళ్లకు రాముడి ముఖంలో సౌభ్రాత్ర సౌఖ్యసూచక మందస్మితము వికసించింది.

చోర - మీమాంస*

❀

= శ్రీ రామకృష్ణశాస్త్రి =

తల్లికడుపు చలువను మానవుడు భూమిమీద పడి పదికాలాలూ బ్రదికి బట్ట కట్టేందుకు దేవతలు దీవించి మనసారా యిచ్చిన మొదటివరం దొంగతనం.

లోకమంతా తనది - సృష్టిలో రకరకాల సింగారాలూ, విలాసాలూ, విజృంభణాలు తనకూ, తన జాతికి అంతటికీని అనుకుంటూ మననేర్చిన మానవుడికి...తనకు ఎక్కువగా మక్కువ నిలిచిన ఏవస్తువుమీదనైనా చూపు సూటిగా నిలిచి, అది తన ఒక్కడి సొత్తే అయితే బాగుండునని ఏనాడైతే అనుకున్నాడో, ఆక్షణంలో దొంగతనానికి అంకురార్పణ జరిగింది: తనది అనుకున్నదానిమీద పరాయివాడికి కూడా ఎప్పుడైతే మమత మిక్కుటమైందో - వీలుకొద్దీ, దొంగతనం జరిగింది.

'దొంగా మనిషివంటివాడే!' - దొంగతనమనేది తాత్కాలిక మానసిక అవస్థనూ, నిర్వహణాన్నీ సూచించేదేకాని - శాశ్వతమైన వైకల్యాన్ని నిరూపించ దన్నమాట కదా: దొంగతనం చేయకపూర్వం దొంగ మామూలు మనిషే; కానా?

దొంగతనం, సూతకంలాగా, వెల్లడి అయిన క్షణాన అమలులోకి వచ్చేదే కాని, దానికి ప్రత్యేక సత్తా లేదు: 'దొంగతనం చేసినందుకు కాదు తమరు నాకు ఈశిక్ష విధించుతూన్నది: దొంగతనం చేసి నిభాయించుకోలేక, పట్టుపడినందుకు!' అని వెనుకటికి ఒక చోరాచార్యుడు న్యాయాధికారికి తత్వం ఉపదేశించ లేదూ?

పండితుడివలె, వనితవలె, లతవలె - ఆశ్రయం లేనిదే, దొంగతనానికి - రాణింపు సంగతి దేవుడెరుగును కాని - అసలు ఉనికే లేదు: దొంగతనం చేశాడని రుజువుచేసి, ఒక మనిషిని ఎటూ మెసిలేందుకు వీలులేకుండా తీసుకువెళ్లి ఒకచోట ఎంతో కొంత కాలము నిర్బంధించి ఉంచితే - వాని కనీసపు పౌర - హక్కు అయిన చౌర్యధర్మానికి స్వాతంత్ర్యం అరికట్టినట్లు అవుతుంది - దొంగ తన్ను తానే దొంగిలించుకో లేడు గనుక:

దొంగతనం స్వరూప నిర్ణయం యుగధర్మాన్ని అనుసరించి మారుతూ ఉంటుంది. అందువల్లనే ఒక్కొక్క తరుణంలో, పండిత సదస్సూ, సంప్రదాయమూ దొంగతనమని నిర్ధారించినదానిని, కర్త అలా అంగీకరించని సందర్భంలో ధర్మగ్లాని సంభవించే ప్రమాదం

* చోరసంహితా భూమిక.

ఉత్పన్నమౌతుంది. కనుక దొంగతనం నిర్వచనము సర్వకాలములకు రూఢికాదు: ఎవడి చేతనైనట్టు వాడు దొంగతనం చేయడానికి అధికారం లేదు. కారణం - దొంగమొగం, దొంగ చూపులు అనే సమాసాలు వ్యాకరణదుష్టములు కాకపోయినా పూర్వపదాలకి అర్థం సాధించడం అసాధ్యం. ఎవడూ 'దొంగ' లాగా ఉండడు: దొంగతనంచేసి పొరబాటున పట్టుబడ్డ ఏ ఎల్లయ్యలాగానో, పుల్లయ్యలాగానో కనుముక్కుతీరు ఒకవేళ ఉంటే ఉండునుగాక.

దొంగలకు పాపభీతి అనవసరం: మాన ప్రాణధనములు మూడుకూడా ఐహికానికి చెందినవేకాని ఆముష్మికం దాకా మెట్లు కట్టేవి ఎంత మాత్రమున్నూ కావు: ప్రాకృతులలో కొందరికి మానమే ధనము: కొందరికి ధనమే ప్రాణము: ఈ త్రికంలో ధనమే కడగొట్టుది. అయితే మానం పోయినా, ప్రాణం పోయినా ధనం పోదు: కాని, ధనం పోతే ప్రాణం పోవడం బహుళమని కనబడుతూన్నది: మానానికీ, ప్రాణానికీ కన్న ప్రాణానికీ, ధనానికీ మెక్కువ లంకె. ధనం దొంగిలించినందువల్ల యాదృచ్ఛికంగా ప్రాణం పోవడమంటూ జరిగినా, దొంగకు ఆ పాపం అంటదు.

దొంగఅంతటి లోకకల్యాణ - చింతనుడు మరిఒకడు సృష్టిలో ఉండబోడు. లోకులందరూ మోయలేనంత ధన భారంతో అలసి - సొలసి, ఆదమరచి, ప్రమత్తులుగా ఉండాలని ప్రార్థించుతూ ఉంటాడు.

దొంగతనానికీ, సంధ్యావందనానికీ చాలా సంబంధం ఉంది: 'అహరహస్సంధ్యా ముపాసీత' అనేదే దొంగలకూ బ్రహ్మోపదేశం. సంధ్యావందనం మల్లేనే మానేస్తే ప్రత్యవాయదోషం ప్రాప్తించటం కద్దు: అది కేవలమున్నూ గాలిలోనే నిలిచి పోకుండా, తత్క్షణం వంటపట్టి వ్యాధిరూపేణ పీడించడమున్నూ కద్దు: తల్లి బంగారము కదా అని దొంగిలించకుండా ఊరుకున్న అగసాలెబత్తుణ్ణి ఆ దోషం కడుపునొప్పై పట్టి పల్లార్చిందని లోకవిదితము. కనుక, భక్తి ఏమాత్రము తప్పినా, ఫలం తప్పడం ఒకటేకాకుండా, లేనిపోని పీడ మెడకు చుట్టుకుంటుంది.

దొంగతనం శాస్త్రమా, కళా? అనే విచికిత్స క్రీస్తుపుట్టక పూర్వంనుంచీ ప్రవర్తిల్లుతూన్నది: పూర్వాచార్యులు కొందరు దీనికి శాస్త్రగౌరవాన్ని మాత్రమే ఇచ్చారు. దీనికి ప్రవర్తకుడైన కుమారస్వామి ఎన్నడూ ఈకళను వినియోగించినట్లు నిదర్శనం లేదు గనుక. అంతమాత్రాన యిదే సిద్ధాంతం అనడానికి వీల్లేదు. కేవలం శాస్త్రంగానే, గ్రంథాల్లోనూ కొందరు మహానుభావుల వ్యాదకూల్లోనూ నిలిచిపోయి ఉంటే లోకానికి ఉపయోగకారి కాలేకపోయేది. మనోవికాసానికి.....ఆత్మవికాసానికి తోడ్పడే బ్రహ్మవిద్యల ఛాయాలో జేరి కాలక్రమేణ చిదంబరరహస్యంగా తయారయేది.

కనుక దొంగతనం కేవలం శాస్త్రమే కాదు: అది ఒక కళ - అనేవాదం బయలుదేరడం సమంజసమేకదా: అయితే, పరిగణ

నియములైన అరవై నాలిగింటిలోనూ దీనిని పూజ్యపాదులు ఎందుకు జేర్చలేదూ అని పూర్వపక్షంవారు అనవచ్చును. ఆ జాబితాలో చేరలేదు గనుక దీన్ని కళ అనేందుకు వీలులేదని వారు వాదించ వచ్చును. దీనికి ఆచార్యులు చెప్పిన సమాధానం ఏమంటే - ఆ అరవైనాలుగున్నూ కేవలం లలిత-కళలు: దొంగతన మనేది అంత నీరసమైనది కాదు: యిది ప్రచండమైన కళ: దీనికి స్థాయి శృంగారంకాదు - అదే కారణం అని. ఈ సమాధానం సబబౌను: దొంగతనం ఉత్కృష్టమైన కళ: అధికారి సామర్థ్యమును బట్టి - నిర్వహణము ననుసరించి ఎప్పటికప్పుడు క్రొత్త పూతలు విరిసే కల్పశాఖ.

దొంగతనం లోక కల్యాణంకోసం వెలసిన కళ: - లోకాన్నంతా ఏకాపోశనం పట్టి ఎవరికీ అందులో రేజా చేజిక్కకుండా దాచుకోమని, మానవుణ్ణి, స్వార్థం ఎప్పుడూ ప్రేరేపించుతూ ఉంటుంది: దానికి ఘాటైన విరుగుడు దొంగతనం:

రామరాజ్యం - అలా దొంగలూ తోడుబోతులూ లేకుండా కలకాలం వర్ధిల్లినా ఊరూ పేరూ లేకుండా కాల గర్భాన కలసిపోతుందని, రావణుడు, రాముడిమీద దయతలచి అసలుకే ఎసరు పెడితేగాని వెష్టపుట్టదని రాముడి పెళ్లాన్నే దొంగిలించాడు:

దేవతలందరూ క్షేమంగా ఉండాలని విష్ణువు టెక్కుచేసి అమృతాన్ని దొంగిలించాడు: వీళ్లందరూ లోకంయోగక్షేమం కోసం చేసిన పనులేకా ఇవి:

వెనుకటికి యూలిసిస్ తాతగారు అంత గజ-దొంగకాకుండా ఉండి, ఆమహానుభావుడు మనుమడిని ఒళ్లో కూర్చోపెట్టుకుని ముద్దూ మురిపెంగా, ఒడుపుగా చేద్దెబ్బకొట్టడం నేర్పకపోయినట్లయితే ప్రతిపక్షులు ఎన్ని సంవత్సరాలు తలక్రిందులుగా తపస్సు చేసినా, ట్రోజన్ వీరుల సిగపూ వాడేదా? ట్రాయ్‌నగరం నేలపాలయేదా?

దొంగతనం కళ అని సిసలుగా నిర్ధారించాము కనుక - దొంగలను గురించి మీమాంస చేద్దాము ఇక:

ఉత్తమ - మధ్యమ - అధమ అధికారిభేదముచేత దొంగలు మూడు దర్జాలుగా ఏర్పడుతూన్నారు.

దొంగలకు ఆర్షేయ పౌరుషేయములు ఉన్నవి: వర్ణ ఆశ్రమధర్మములు ఉన్నవి. ఇంటిదొంగకు ఈశ్వరుని కన్ను మొరగే చాకచక్యము ఉన్నా, కన్నానపోయి కన్నాన రానేర్చిన గజదొంగకన్న కులంలో తక్కువవాడౌతాడు.

దొంగలకు కక్కుర్తి అనేది ఉండకూడదు. ' ఏమయ్యా పట్టపగలే, దొంగతనము చేస్తున్నావు ' అంటే ' నాకక్కుర్తి నీకేం తెలుస్తుంది ' అని జవాబు చెప్పే ఘటికుణ్ణి ధీరుడుగా పరిగణించేందుకు వలను పడదు - మర్యాదాతిక్రమణం చేస్తూన్నాడు కనుక:

దొంగ మామూలు మనిషికన్న.... గృహస్థుకన్న...ఎన్నోరెట్లు ఎక్కువవాడు- ఘాయాలో, తాహతులో: అందుకనే ప్రతి

దొంగా మనిషి కావడానికి వీలున్నది కాని, ప్రతిమనిషీ దొంగ అయేందుకు ఆస్కారము ఎంతమాత్రమున్నూ లేదు అని అభియుక్తు లంటారు: ఈ వెలుగులో ' దొంగా మనిషి వంటి వాడే ' అనే లోకోక్తిని సమన్వయిం చుకోవాలి.

పట్టపవలు దొంగతనం చేసేవాడికి కులంలో వెలి: గుహ్యమ్ - గుహ్యతమమ్ అయిన చోరతంత్రము అజ్ఞులబారి పడి పాటవము చెడిపోకుండా ఉండాలని, తన చేతులు ఏకలాపములో ఉన్నదీ, తన కన్ను లకే కానరాని కటికచీకటిలో ఉత్తమచో రుడు తంత్రాంగము నెరపవలెనని దేవి ఆది కాలమునాడు అనుశాసించింది.

దొంగలందరూ శైవులు: దుర్గ వారికి ఇలవేల్పు: కుమారస్వామి కులపు - పెద్ద: కొలిచినవారికి కొంగు బంగారమయే ఆతల్లి వాళ్లకు, గాలిబరపిడికైనా సడీ చప్పుడూ అలికిడికానీయని అడుగులూ, చీకటిలో పట్ట పవల్లే చూసే చూపులూ, అణిమా - గరి మాశక్తి ప్రసాదించిన వరములు: దొంగ లంటే దేవికి కన్నబిడ్డలంత మక్కువ: కార్యరంగానికి బయలుదేరేటప్పుడు మొక్కు లందుకుని దీవెనలిచ్చి పంపుతుంది: దిగ్వి జయం చేసివచ్చి, వాళ్లు కొల్లలాడి తెచ్చిన దానిలో దేవికి ముడుపు చెల్లించి మరీ పోతారు: కనుక అమ్మవారి సొమ్మంతా.... నిరాక్షేపంగా దొంగసొత్తు: కుమారయ్య తల్లిచాటు బిడ్డడు; ఆమెఆస్తికి ఉత్తరత్ర వారసుడు కనుక ఆతనికి వేరేవాటా అంటూ పెట్టే ఆచారం లేదు:

దొంగల నిజాయితీ జగత్ప్రసిద్ధం. పాలు - పంపిణీలు తెగక తర్జనభర్జనపడటం కాని, అత్యాశకు పోవడంకాని, తన వాటాకు వచ్చేదానికన్న ఒక్కపైసా ఎక్కువ కోరడంకాని సద్వంశసంజాతులైన దొంగల విషయంలో ఉండదు: అలా జరిగి నట్లు చరిత్రలో దృష్టాంతములున్నూ లేవు: సిసలైన దొంగ ఎప్పుడూ ఒక్కటే మాటకు కట్టుబడి ఉంటాడు.

అయితే, యీపట్టున కొందరికి యీ అనుమానం తోచవచ్చును: దొంగఎన్నడూ అబద్ధాలు ఆడడా? అని: దీనికి నిష్కర్షగా జవాబు - ఆడడు.

ఈసిద్ధాంతాన్ని రెండు రకాలుగా సాధించవచ్చును. ఆ రెండు మతములున్నూ విపులంగా క్రింద ఉదాహృతములు అవు తూన్నవి.

' దొంగాబద్ధాలు ' అనే ప్రయోగం లోకంలో కనబడుతూన్నది.

దొంగ (యొక్క) అబద్ధాలు.

దొంగ (వైన) అబద్ధాలు.

మనకు - అంటే ప్రాకృతులకు సం బంధించినంతవరకూ, దొంగ - యొక్క - అబద్ధం=నిజం. దొంగ - వైన - అబద్ధాలు = నిజాలు: కనుక, మనకు సత్యసాక్షాత్కారం చేసేందుకు ఆతని వాక్కు వినియోగపడు తూన్నది.

" దొంగ, ' అబద్ధీకుడు ' " అని కూడా లోకంలో వాడుకలో ఉన్నదే కదా!

దొంగ=' అబద్ధీకుడు ' అని కొందరు అంటారు.

దొంగ (యు), అబద్ధీకుడు (న్నూ) అని మరికొందరు అంటారు.

దొంగ అబద్ధాలకోరు అని రూఢి అయిపోయినట్లయితే, పునరుక్తి ఎందుకు? - అలా కాదు, దొంగమాత్రమే కాకుండా అబద్ధీకుడున్నూ అని అంటారా, ఈ రెంటికీ సాపత్యం ఏమిటి, ఈయిద్దరినీ ఒకే గణంలో ఎందుకు పారవేశారు? - అనే రాద్ధాంతం వస్తుంది: పశువును, వేశ్యను మనువు జత గూర్చలేదా, ఆపద్ధతే యిక్కడా వర్తిస్తుంది అంటారా, పరస్పరాశ్రితమైన సమానధర్మం అంటూ ఒకటి ఉండి తీరాలి: లేదు గనుక అలా అన్వయించుకోవడం ఇక్కడపొసగదు.

కొంచెం డొంకతిరుగుడుగా ఉన్నా రెండుమతాలూ చివరకు ఒకటేసిద్ధాంతానికి వస్తూన్నవి: ఏతావతా తేలిందేమంటే, యీ ద్రావిడ ప్రాణాయామంలో, దొంగ అంటే అబద్ధీకుడు అని సర్వకాల సర్వావస్థల యందున్నూ రూఢిగా అర్థంచేసుకునేందుకు శాస్త్రం అనుమతించదు అని:

దొంగశబ్దము ఆంధ్ర గీర్వాణరూపాలలో కొన్ని తరుణాల్లో ప్రకరణాన్నిబట్టి, లక్షణార్థంగా, శ్రేష్ఠవాచకము. 'అమ్మ దొంగ!', చోర-సురతము ఇత్యాదులు ఉదాహరణములు—అంటున్నారు వాగనుశాసనులు కొందరు: అయితే, ఇక్కడ కొంత తికమకఉంది: 'దొంగకు కన్నెర్ర' అనే భయంలో, ప్రాణపదంగా కాపాడుకుంటూన్న వాటిని తన చాతుర్యం మెరయించి కాజేయగలిగిననాడే దొంగ అన్వర్థాభిధానుడు ఔతున్నాడు కాని, 'వచ్చి, మహారాజులాగా ముచ్చిలించుకుపొమ్మని పరులు ఆదరంతో బొట్టూ కాటుకా పెట్టి పిలిచినప్పుడు-వాటిని కట్టబెట్టుకుపోవడం దొంగతనం ఎలా అవుతుంది?-చేజిక్కనివాటిని చిక్కించుకునే నేర్పే దొంగతనం: తదితరములు కావు—ఇంకా పూర్వపక్షాలు చాలా ఉన్నవికాని, అవన్నీ అప్రస్తుతములు:

దొంగ, దొర వ్యతిరేకార్థకములని మన సంప్రదాయము: అది ఎంతవరకూ నిజమని, ఉద్యోగమునుంచి విరమించి ప్రస్తుతం ఉపకారవేతనంతో కాలక్షేపం చేస్తూన్న ఒక చోరవృద్ధుణ్ని ఆ నడుమ ఎవరో ఒక పత్రికావిలేఖరి ప్రశ్నించగా ఆ అనుభవజ్ఞుడు యిచ్చిన సమాధానం ఇది—

'దొంగ కానివాడు దొర అని లోకం అంటూన్నది కేవలమూ పొరబాటు: యథార్థస్థితి అందుకు పూర్తిగా వ్యతిరేకము: దొంగ కానివాడు దొర కావడం అసంభవము: ఎందుచేతనంటే, దొంగ ముదిరితేనేకాని దొర కాలేడు.'— ఇందులో తత్వం మనకు అర్థంకావడం కష్టం, కాని సత్యాన్ని కాదనలేముకదా!

దొంగను పట్టుకునేందుకు దొంగనే నియోగించమని రాజనీతి: అయితే యీ సూత్రం అక్కరమాలిన దని సంప్రదాయజ్ఞుల అభిప్రాయము. ఎందువల్లనంటే, యిందులో అనన్వయదోషం ఉన్నది,-ఇద్దరు దొంగలనూ నిర్ణయించుతూన్నది లోకమే కాబట్టి; సిసలైన దొంగకు అ-దొంగలంటే తగని నిరసన: అందుచేత, పనికట్టుకుని వచ్చి, 'నేను నికరమైన దొంగనయ్యా'

అని తన కులగోత్రాలు ఎన్నటికీ తెలుపుకోవడం అంటూ సంభవించదు. కనుక, ఒక దొంగచేత మరో దొంగను పట్టించే అవకాశం లోకానికి ఎన్నటికీ ఒనగూడదు.

అయితే ‘ఏమయ్యా, దొంగలు ఉన్నారని నిర్ధారించగలిగిన లోకం వాళ్లను పసిపట్టలేదా?’ అని ఎవరన్నా ఆక్షేపించవచ్చును. నిజమే: ఇక్కడ ప్రత్యక్ష ప్రమాణానికి వీలుంటే అలా అనడం చెల్లుతుంది. కాని, అనుమానమే ప్రమాణమాయెను! స్పర్శనుబట్టి వాయువుఉనికి ఎలా అనుమానిస్తున్నామో, సృష్టివికాసాన్ని చూస్తూ పరమేశ్వరుని స్థితిని ఎలా అనుమానిస్తున్నామో అలానే, దొంగతనాన్నిబట్టి దాని కారకుడి స్థితిని అనుమానిస్తున్నామేకాని, స్వరూపాన్నిబట్టి దొంగ ఇలా ఉంటాడు అనేందుకు దొంగ-రూపం ఫలానా అని లేకపోవడం సృష్టిలో లోపం: తస్మాత్, దొంగ ఎవరు, ఎట్టివాడు అనే ఆకాంక్షయందు సిద్ధించేదేమంటే - దొంగ ఎవ్వరైనా కావచ్చును, తానుగాక: కనుక దొంగశబ్దానికి ఉత్తమపురుష చెల్లదు.

దొంగను పట్టుకోవాలంటే దొంగకే చెల్లుతుంది - అనే న్యాయం సర్వసమ్మతం కాకపోవడానికి, బలవత్తరమైన మరో హేతువు ఉన్నది. ఒకవేళ, కర్మం చాలక, ఎవరన్నా ఓ ఆసామి, దొంగను పట్టుకోవడమంటూ సంభవించినా, ‘నేను దొంగను గనుకనే వాడిని పట్టుకోగలిగాను’ అని రొమ్ముమీద చెయ్యివేసి చెప్పుకోగలడా?- ఊహు... అదీగాకుండా తాత్వికంగా చూస్తే గట్టిచిక్కు ఒకటి ప్రాపించుతూన్నది: తాను దొంగ ఔనో కాదో, కాగల యోగ్యత ఏకోశానైనా ఉన్నదో లేదో, గ్రహించగల యోగ్యత యీ కలికాలంలో బొత్తిగా మృగ్యమైపోయింది. అందుచేత ‘దొంగ’ శబ్దప్రయోగానికి వ్యావహారికంలో పరువు ఛప్పగా క్షీణించిపోయింది: ఎగతాళికో ఏకసక్కెముగానో, కసితోనో, మానవుడు సాటిమానవుణ్ణి ఈపదంతో సంబోధించి తన అక్కసు తీర్చుకుంటున్నాడేకాని, ఆశబ్దం విలువను గుర్తించడం లేదు: కొన్నాళ్లు పోతే ‘దొంగ’ ఆర్షప్రయోగాల్లో చేరిపోతుందేమోనని భయంగా ఉంది.

దొంగలందరూ సాక్షాత్ మహేశ్వర స్వరూపులు.

‘రుద్రుడు లీలావిలాసానికి చోరాది రూపములను తాల్చుతున్నాడు. లేదా, రుద్రుడు జగత్తునంతటినీ వ్యాపించి ఉన్న కారణంచేత, చోరులుకూడా రుద్రునివలెనే పూజింపతగినవారు...’ ఈమాదిరిగా రుద్రాధ్యాయం వివరణంలో మహీధరుడు అంటున్నాడు. రకరకాల చాకచక్యములూ, ప్రత్యేకతలూ ఉన్న దొంగలకు శివునిపేరిట పరి-పరి విధాల మ్రొక్కడం నమకం పఠించే సమయాన, ఎంత మడిగట్టుకుని కూర్చున్న వారికైనా తప్పనిసరి.

ప్రతియుగంలోనూ, ప్రతిదేశంలోనూ దొంగలు అడపాదడపా ఉద్భవిల్లుతూనే వచ్చారు. దొంగ లేని యుగం అంధయుగము. దొంగలను కననేరని జాతికి చరిత్రగాని, తదితర సభ్యజాతుల్లో స్థానం కాని లేదు.

జన్మకాల శోధనపద్ధతుల విలువ

= శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు =

జన్మకాలమును శుద్ధముగావించు విషయమున జాతక తంత్రవేత్తలు గోప్యముగా నుంచుకొని వాడుచున్న పద్ధతులు కొన్ని కలవు. వానిలో 'శుక్రనాడి' అను ప్రాచీన గ్రంథమునఁ జెప్పఁబడిన దనియు, మిక్కిలి విలువగల గణితమార్గ మనియు ప్రతీతి గల పద్ధతి యొకటి యున్నది. దీని ప్రయోగవిధాన మిది :

సూర్యోదయాదిగా జన్మకాల ఘటీవిఘటికలను మొత్తపు విఘడియలుగా మార్చి, ఆ సంఖ్యను 4 తో గుణించి 27 తో భాగించఁగా, వచ్చిన శేషమును అశ్విన్యాదిగా లెక్కించినచో, ఒక నక్షత్రము వచ్చును. మరల ఆమొత్తపు విఘడియల సంఖ్యనే 3 తో గుణించి 7 తో భాగించఁగా, వచ్చిన శేషమును భానువారాదిగా లెక్కించినచో, ఒక వారము వచ్చును. ఈ విధముగా సాధించిన నక్షత్రవారములు జన్మదినమునాఁటి నక్షత్ర వారములే కావలెను. అట్లు సరిపోనియెడల, జన్మకాల మశుద్ధమని నిర్ధరించి, వలసినంత వెనుకకో, ముందునకో జన్మకాలమును జరిపి సరిపుచ్చవలయును. అట్లు సరిపోయినదే శుద్ధకాలము అని.

ఈ పద్ధతికి నిదాన మేమో, ఏ తత్త్వముపై నిది యాధారపడినదో తెలియదు. నాడీగ్రంథముల పరిచయము సామాన్యముగా లభించునట్టిది కాదు. వానిని ముద్రించు భాగ్యమునకు ముద్రాయంత్రము లింకను నోచుకొనలేదు. ఆ గ్రంథముల తాళపత్రప్రతులను దాఁచిన నిధులవలె తండ్రులు కుమారులకు చూపిపోవుటయు, వానిలోని భాగములను కుమారులు పితృస్వముతోపాటు దాయభాగరూపమున పంచుకొనుటయు అందందు కలదఁట ! నాడీగ్రంథము లనఁగా, దివ్యదృష్టి కల ప్రాచీనమహర్షిపుంగవులు లోకకల్యాణమునకై మునుముందుగా నానాభాషలలో వ్రాసియుంచిన వ్యక్తిజాతకముల సంపుటము లనియు, అగ్రంథములను దాఁచి సంరక్షించుచున్న మహాశీయుల నాశ్రయించి, అంతో యింతో ముడుపు చెల్లించి, వారి యనుగ్రహమున నా గ్రంథభాగములను చదివించుకొని విని, గతజీవితమందలి తమతమ యనుభవములకు సరిపడు వ్యక్తిజాతకము లందు లభించెనేని, వాని ప్రతిని వ్రాయించుకొని వచ్చు వాడుక యున్నదనియు వినుచున్నాము. అంతే కాని, జాతకములను గణించు మార్గములు, వానికి సంబంధించు గణితసూత్రములు, గ్రహదృష్టి స్వభావాదుల మూలతత్త్వములను గూర్చిన విధులు ఇత్యాదులు వానిలో నున్నట్లు వినము. ఒక వేళ, ఇవన్నియు సమగ్రముగా నుండి ప్రకాశమునకు రాకుండా దాఁచఁబడి యున్నవేమో ? ద్రవ్యార్జనమునకు సాధనముగా నిట్టి గ్రంథముల నుపయోగించుచుండువారికి తత్సూత్రములను ప్రకటించు నుదారహృదయ ముండదు. ఈ నాడీగ్రంథముల నుండి ధన మార్జించుటే వృత్తిగా కలవారిలో ననేకులకు జ్యోతిషశాస్త్రమున సామాన్యజ్ఞానము నయితము లేదందురు. అగుటచే, ఏ పరమప్రయోజనము నుద్దేశించి మహర్షులీ గ్రంథరాజములను రచించిరో, అది జనసామాన్యమున కందరాని పండగుటలో నాశ్చర్యము లేదు.

"వ్యయతో వృద్ధి మాయాంతి
క్షయ మాయాంతి సంచయాత్."

అను న్యాయమును మరచి, విద్యాధనము నిట్లు గుప్తము కావించి త్రుప్పుపట్టించు నలవాటు వచ్చుటం జేసి మన దేశమున కెంతో విజ్ఞానదారిద్ర్య మీ వరకే వాటిల్లినది, ఇంకను వాటిల్ల నున్నది. మహారాజులో, జమీందారులో, ఎవరైన నిట్టి గుప్తధన మున్న భాగ్యశాలురను కనిపెట్టి, ఆ గ్రంథమును సంపాదించి ప్రజాహితమునకై దానిని ప్రకటించవలసిన బాధ్యత కలదు. అట్టి భాగ్య మెన్నటికైన రాఁగలదా? దాకి రేవులకో, స్నానమందిరములకో, ఖండాంతరములలో లక్షలకొలఁదిగ ద్రవ్యమును ధారాళముగా వెచ్చబెట్టు మహోదారులు మనదేశమున లేకపోలేదు. కాని, వారి కృపాకటాక్ష మీశాస్త్రములవైపు ప్రసరించకుండుట మన— లేక, మన ప్రాచీననాడీగ్రంథప్రణేతల— అభాగ్యపు ఫలము !

మహదాశ్రయము లేని విద్యలు నశించక మఱి యేమగును? అది యట్లుండె.

సామాన్యదృష్టితో విమర్శించినచో, ప్రశంసలో నున్న పద్ధతి కీక్రింది ఫలితము కానరాఁ గలదు. జన్మదిన మేదైన నేమి, జన్మస్థల మేదయిన నేమి, శేషవిఘటికలకు అశ్విన్యాదిగా నక్షత్రములను, భానువారాదిగా వారములను లెక్కించవలె నను నియమ ముండుటచే, ఇట్టి నక్షత్రవార సంయోగము నియమితకాలమందే ప్రతిదినమందును సంభవించక తప్పదు. ఒక్కొక్కనక్షత్రముతో ఒక్కొక్కవారముచొప్పున 27 నక్షత్రములతో ప్రత్యేకముగ 7 వారములు జతపడుటకు కనీసము (27×7) 189 విఘడియల కాలము కావలసియుండును. అగుటంబట్టి, సూర్యోదయాదిగా నేదో యొక విఘడియలో ఇష్ట నక్షత్రవార సంయోగము కలిగెనేని, ఆ విఘడియకు తరువాత ప్రతి 189-వ విఘడియ సయితము అట్టి నక్షత్రవారసంయోగమును చూపుచునే యుండఁ గలదు. కావున సూర్యోదయాదిగా నొక దినమందలి మొత్తపు విఘడియలు (60×60) 3600 టిలో ఇష్ట నక్షత్రవారసంయోగమును పై పద్ధతితో చూపఁగల విశిష్ట విఘటికలు 19 ఉండు ననుట. అగుటచే, ఈ సూత్రమునకు వాస్తవముగా విలువ యుండు నేని, ఏదినమందయినా శిశుజన్మములు పరస్పరము 189 విఘడియల (3 ఘడియలు 9 విఘడియల) అంతరము గల 19 కాలములలో మాత్రమే సంభవించు నని తేలఁగలదు.

ఉదాహరణార్థమై పూర్వఫల్గునీ నక్షత్రమున బుధవారమునాఁడు కలిగిన జనన మొకటి కల దనుకొందము. అశ్విన్యాదిగా పూర్వఫల్గుని 11-వ నక్షత్రము. భానువారాదిగా బుధవారము 4-వ వారము. ప్రశంసలోనున్న సూత్రము ననుసరించి యీ రెండును చేరఁగల విఘడియ సూర్యోదయాదిగా 104-వ దగుచున్నది. దాని తరువాత వచ్చు ప్రతి 189-వ విఘడియ సయితము పై సూత్రముతో సమన్వయపడఁగలదు. అగుటచే, మొత్తముమీఁద ఈక్రింద కనుపరచిన 19 ధ్రువకాలములందు మాత్రమే ఆ దినమున—అనఁగా పూర్వఫల్గునీయుత బుధవారమున శిశుజన్మములు కలుగు నని సిద్ధించును:

	గ.	విఘ.		గ.	విఘ.
(1)	1	44	(3)	8	2
(2)	4	53	(4)	11	11
(5)	14	20	(13)	39	12
(6)	17	29	(14)	42	41
(7)	20	38	(15)	45	50
(8)	23	47	(16)	48	59
(9)	26	56	(17)	52	8
(10)	30	5	(18)	55	17
(11)	33	14	(19)	58	26
(12)	36	23			

పై దినమున ఉదయాదిగా 35 గడియలలో జనన మని యొక జాతక ముండె ననుకొందము. ఈ సూత్ర ప్రక్రియ ననుసరించి జన్మకాలమును 33-14 గడియలకో, లేక 36-23 గడియలకో సవరించవలసియుండును. ఈ పద్ధతిలో గరిష్ఠపక్షము 1 గడియ 34½ విగడియలు ఇష్ట కాలమును వెనుకకో ముందునకో త్రోయవలసి వచ్చుట సంభవించును. తత్ఫలితముగా లగ్నము, పదివిగడియల కొక్క భాగవంతున రమారమి 9, 10 భాగల దూరము (అనఁగా, మూఁడు నవాంశల వఱకు) జరుగవలసి వచ్చుచున్నది. అందాజుకాలపు జాతకముల మాట యట్లుండ, జన్మక్షణమును గమనించి గ్రంథస్థము కావించిన సందర్భములలో సయితము, ఇంత దూరము కాలము సవరించుటకు మన కధికార మున్నదా యనుట నా దృష్టిలో సందేహాస్పదమగు సమస్య.

లగ్నశుద్ధికై యిట్లు సవరించుటచేఁ గలుగు నష్టమేమి అనువా రుందురేమో? ధ్రువకాలములు 19 టిలో తప్ప ఇతర సమయములలో మానవజన్మములు కలుగవని ప్రప్రథమున మనము నమ్మవలసి యుండును. అనుభవముతో నీ సూత్ర మెంతమాత్రము సమన్వయపడునో, హోరా శాస్త్రజ్ఞులే కాక, ప్రసూతితంత్రవేత్తలు సయితము నిర్ధరించవలసిన మాట; కాకతాళీయముగా, ఏవో కొన్ని జాతకములు—ధ్రువకాలములకు సన్నిహితముగా జన్మకాలముండునవి—కానరావచ్చును. కాని, అట్టి దృష్టాంతములీ సూత్రమునందలి యాథార్థ్యమును స్థాపించ నేరవు. నా యనుభవములో నేమో, ఈ సూత్రమునకు మంచి విలువ కానరాలేదని విధిలేక విన్నవించవలసియున్నది. రేడియో కాలమునకు సవరించుకొని స్పష్టపరచుకొన్న నికరమైన గడియారము నరచేత నుంచుకొని, మంత్రసానుల మాటపై నాధారపడకుండుటకై, సూతికాగృహద్వారప్రాంత మందే

జాగరూకతతో కాలనిరీక్షణము చేయుచుండి, శిశురోదన క్షణమును గురుతువేసుకొన్న సుప్రసవదృష్టాంతములలో నయితము నా కీ సూత్రము ఫలించలేదు. ఇట్టి సందర్భము లలో కూడ జన్మకాలము గడియకు పైఁగా సవరించవలె నన్నచో ఈ సూత్రముపై విశ్వాసము వచ్చు టెట్లు?

మఱి యొక్క మాట: ఈ పద్ధతి ననుసరించి సవరించిన లగ్నబిందువు వాస్తవముగా విశ్వసనీయ మగునేని, లగ్నదశల నాధారముగాఁ గల దశలలో జీవితమందలి పరిణామములయొక్క శుభాశుభములను సూచింపవలయును గదా? దినవర్షపద్ధతితో కాని, ఏకాంశవర్షపద్ధతితోకాని చలింపఁజేసిన లగ్నదశమకేంద్రములు గ్రహదృష్టియోగముల వశమున జీవితమందలి మంచిచెడుగులను తెలుపఁ జాలనిచో, ఈ సూత్రమువలన సాధించిన లగ్నము (అనఁగా, జన్మకాలము) అశుద్ధ మనియే తీర్మానించవలసి యుండును. ఇంతే కాదు; అట్లు సవరించిన కాలము నుపకరణముగాఁ గొని నక్షత్రకాలాంతరధ్రువమును సాధించి, తన్మూలముగా జీవితమందలి ప్రధానపరిణామములు సంభవించిన దినములకు దైనికజాతకములను గుణించినచో, ఫలములతో సరిపడు గ్రహసంయోగములను దైనిక కేంద్రములు చూపవలసి యుండును. ఈ రెండుమార్గములతో సాక్ష్యము తృప్తికరముగా వచ్చినఁగాని, పై సూత్రమును విశ్వసించుట కష్టము. జీవితముతో సరిపడని కాలము నిచ్చు సూత్రము శుక్రనాడిలోని దైననేమి, శివనాడిలోనిదైన నేమి?

ఒక జాతకము నుదాహరణముగాఁగొని పైసూత్రము నన్వయించి జీవితదశ లెట్లు సాక్ష్య మిచ్చునో విమర్శింతము. ఆ జాతకపు సామగ్రి యిది:

జన్మదినము	(తేదీ) 5-4-1885			
జన్మస్థానపు అక్షాంశలు		భా 12	కల 16	
జన్మస్థానపు రేఖాంశాకాలము	గ 5	వి 6	సెక 40	
స్థానిక మధ్యమ సూర్యోదయకాలము (L.M.T.)	5	57	28	A. M.
ఇష్టకాలము (ఉదయాదిగా 4 ఘడియలు)	1	36	0	
జన్మకాలము (L.M.T.)	7	33	28	A. M.

జన్మకాలము 4 గడియ లనుటచే పాదచ్ఛాయల మూలముగా గణింపఁబడిన అందాజా కాల మిది యని మన మూహించవలసియున్నది. అగుటచే శుద్ధకాలము కనుఁ గొనుట యత్యవసరము.

జ్యేష్ఠానక్షత్రముతో కూడిన బుధవారము జననము ఈ రెంటింటి సంయోగము చూపఁగల సన్నిహితకాలము ఉదయాదిగా 153-వ విఘడియయో, 342-వ విఘడియయో అగుచున్నది. * అగుటచే, ఈ శుక్రనాడీసూత్రానుసారము 2—33 గడియలకు జన్మకాలము సవరించవలసి యుండును. లేదా, 5—42 గడియలవరకు దానిని పెంచవలసియుండును.

ఇది యిట్లుండ, 'ఆధానకాలపద్ధతి' ననుసరించి పాశ్చాత్యమతానుసారముగా శుద్ధము గావించిన కాలము వేరొకటి కలదు. అది ఉదయాదిగా 5 గడియలు 20 విగడియ లగును. పాఠకమహాశయుల సౌకర్యార్థము పై మూఁడు వేళలకు సరియగు స్థానిక మధ్యమకాలమును (L. M. T.) ఈక్రింద చూపుచున్నాము:

ఉదయాదిగా:—	గ.	ని.	సెక.
1. 2—33 గడియలు	6	58	40
2. 5—42 గడియలు	8	14	16
3. 5—20 గడియలు	8	5	21

పై మూఁడు కాలములలో కడపటిదానికి సాధించిన సాయన గ్రహభావకుండలి యీ క్రిందనున్నది. తక్కిన రెండువేళలకు ప్రత్యేకముగా కుండలుల నీయలేదు. కాల వ్యత్యాసము స్వల్ప మగుటచే గ్రహస్థితులలో విశేషభేద

* ఇష్ట నక్షత్రవార సంయోగము వచ్చు విగడియ నీక్రింది మార్గమున కనుఁగొనవచ్చును:

అశ్విన్యాదిగా జన్మనక్షత్రపు సంఖ్య 4 తో నిశ్శేషముగా భాగము పోదేని, దానికి 27, లేక 54, లేక 81 కాని చేర్చి, నిశ్శేషమగునట్లుగా భాగించవలెను. అట్లు భాగింపఁగా వచ్చిన లబ్ధసంఖ్యను 3 తో గుణించి 7 తో భాగింపఁగా వచ్చు శేషమును భానువారాదిగా లెక్కించినయెడల నొక వారము వచ్చును. ఆ వారమే జన్మవార మగునేని, ఆ లబ్ధి సంఖ్యయే ఇష్ట విఘటిక యగును. ఆ వారము జన్మవారము కాదేని ఆ వారము మొదలుకొని జన్మవారమువరకు లెక్కింపఁగా వచ్చు సంఖ్య 2 అయినచో 54; 3 అయినచో 108; 4 అయినచో 162; 5 అయినచో 27; 6 అయినచో 81; 7 అయినచో 135. ఈ ప్రకారముగా పై లబ్ధిసంఖ్యకు చేర్చవలెను. వచ్చిన మొత్తమే ఇష్ట విఘటిక యగును. దానికి తరువాత ప్రతి 189-వ విగడియ నయితము ఇష్ట నక్షత్రవారసంయోగమును తెలుపఁగలదు.

ముండదు కాన గ్రంథవిస్తరభీతిచే మానితిని. లగ్నాది కేంద్రములలో వ్యత్యాస మధికముగా వచ్చుటంజేసి, అవి యీ మూఁడుకాలములకును ప్రత్యేకముగా నిచట చూపఁ బడినవి :

		లగ్నము	దశమము
1. మొదటికాలము		వృషభరాశి 3½ భాగ	మకరము 26½ భాగ
2. రెండవ కాలము		వృషభము 23¾ భాగ	కుంభము 14¾ భాగ
3. మూఁడవ కాలము		వృషభము 21¼ భాగ	కుంభము 12½ భాగ

ఆ సాయనకుండలి యిది:—

	కే4-15 శు4-19 కు7-47 ర15-49	బు4-18 I 21-15 ఇ 21-40	శ19-17
X 12-23	(అయనాంశలు 22 భాగలు 14 కలలు)		
			గు26-16 (వ)
చ18-15		వ 0-16(వ) రా4-15	

ఉపజ్ఞాసూచక మగు వృషభరాశి 21-వ భాగ లగ్నమగుట, అసాధారణశక్తిమంత మగు ఇంద్రగ్రహ మచట ఉదయించుట, సౌహార్ద్రప్రియుఁ డగు శుక్రుఁడు లగ్నాధిపతియై స్థానాధిపతియగు కుజుని చేరి,

"కుసుమస్తబక స్యేవ
ద్వయీ వృత్తి ర్మనస్వినః,
మూర్ధ్ని వా సర్వలోకస్య,
శీర్యతే వన ఏవ వా."

అను సూక్తికిఁ దగిన సుమనస్కతను సూచించు మేషరాశి 8—వ భాగయం దుండుట, మనఃకారకుఁడు విక్రమాధిపతియు నగు చంద్రుఁడు, ధర్మకర్మాధిపత్యముచే రాజయోగకారకుఁ డగు శని- ఏ రిరువురు పరస్పరపూర్ణ దృష్టితో ధనుర్మిథునములలో కార్యతారతమ్యము దెలుపు 18, 19 భాగలలో నుండుట, పితృకారకుఁడగు రవి పరమోచ్చాసన్నప్రాంతమందు విప్లవసూచక మగు మేషరాశి 15-16 భాగలో ప్రకాశించుట, బృహస్పతి సింహరాశిలో ఉత్తమ శ్లోకతను, హోరాశాస్త్రనైపుణ్యమును, సూచించు 26-వ భాగలో నుండి పుష్పవంతులపై నత్యంత శుభకోణదృష్టిని ప్రసరింపఁ జేయుట, ఉపజ్ఞాయుత మగు సంకల్పశక్తిని ఉత్సాహయుక్త మగు స్వాతంత్ర్యప్రీతిని సూచించు వరుణ గ్రహము సప్తమాధిపతి యగు కుజునితో సమసప్తకమున రాహువుతో నుండుట—ఇవి యీ జాతకమందలి ప్రధానవిశేషములు. హోరాతంత్రవిశారదుఁడు జాతకుఁడు. అతని జాతకయోగములకు ఫలముల నిచట చెప్పఁబూనితి నేని, పరిహాసభాజన మగుదును. ఉపదిష్టకాలమును మార్చినందుకై మన్నన నర్థించుచు, ప్రశంసావిషయమున ఉదాహరణముగామాత్ర మీ జాతకము నిచట ఉపయోగించుచున్నాము.

జాతకునికి 12 సంవత్సరముల ప్రాయమున (1897) వివాహము, 35 వయస్సున (1920) పితృకర్మ, 47-వ ఏఁట కళత్రవియోగము, 58 యేఁడున (1943) మాతృక్లేశము సంభవించినవి. దినవర్షదశాపద్ధతిలో చలించిన లగ్న దశమకేంద్రము లాయా పరిణామములకు తగిన గ్రహదృష్ట్యాది యోగము లెట్లు సూచించునో పరీక్షింతము. ప్రశంసలోనున్న కాలత్రయమునకు ప్రత్యేకముగ లగ్న దశమకేంద్రముల చలితస్థానములు పటకమున చూపఁబడినవి. (అనుబంధము 1 చూడుడు.)

1. ప్రథమ కాలము:—

1897-వ సంవత్సరమునకు దశమకేంద్రము జన్మశుక్రుని అర్ధకోణదృష్టి నార్జించినది. పరిణయసులభమగు వయస్సు నిది సూచించుట సత్యమే. కాని, ఇది కాకతాళీయ న్యాయమువంటిది. ఏలన, పితృకర్మను సంపాదించి యిచ్చిన 1920-వ సంవత్సరమునకు తగిన దశ ఏ కాలము చూపలేదు. కళత్రవియోగము కల్గిన 1932-వ సంవత్సరమునకైనా సరిపడు దశాకాల మిందు కానరాదు. 1943-వ సంవత్సరపు మాతృకర్మకుమాత్ర మెట్లో దశమకేంద్రమునకు చలితశనినుండి కేంద్రవేధ వచ్చినది. ఇది మాతృక్లేశమును సూచింపఁజాలినదే యనవచ్చును. నాల్గు ప్రధానఘట్టములలో రెండింటిని మాత్రము చూపఁగలిగిన యీ కాలము జాతకుని దగునా?

2. ద్వితీయ కాలము:—

వివాహము జరిగిన వయస్సునకు లగ్నము జన్మ శుక్రుని అర్ధకోణదృష్టికి వచ్చుటంజేసి, అనుభవముతో దశ సమన్వయపడిన దనవచ్చును. అయిననేమి, 1920 లో పితృమారకము కాని, 1932 లో కళత్రవియోగవిపత్తును కాని సూచించు దశ యేదియు ఇచట నయితము కానరాదు. మాతృదీక్ష నొసంగిన 1943-వ సంవత్సరమునకు దశమము జన్మరవిసంయోగము నందినది. మాతృకర్మకంటె పితృ కర్మకే ముఖ్యముగా తగిన దీదశ. అనుభవములో దశకు అతుకు కుదిరినదా యను విషయమున సహృదయులే ప్రమాణము.

3. తృతీయ కాలము:—

జన్మకుజుఁడు సప్తమ (కళత్ర) స్థానాధిపతి. అతని నుండి అర్ధకోణ శుభదృష్టిని 1897 లో లగ్న మభిలషించు చున్నది. అనఁగా, కళత్రస్థానమునకు కళత్రాధిపతినుండి పూర్ణ త్రి కో ణ శు భ దృ ష్టి యనుట: ఇంతకంటె చక్కని యోగము బాల్యమున జరుగు వైవాహికమంగళమునకు లభించునా ?

"లగ్నా త్పుత్రకళత్రభే శుభ పతి
  ప్రాప్తే భవా లోకితే
చంద్రా ద్వా యది సంప దస్తి హి తయోర్
  జ్ఞేయో న్యథా సంభవః" (బృహజ్జాతకము)

అను వరాహమిహిరాచార్యుని సూత్రమును స్మరింపుఁడు. ఇది కాక చలిత రాహుకేతువుల శుభదృష్టి లగ్న సప్తమముల కిపుడే వచ్చినది. ఇఁక, దశమకేంద్రము పితృసూచకము కదా? 1920-వ సంవత్సరములో ఏకేంద్రము జన్మచంద్రుని కేంద్రవేధ పాలయినదనుట చదువరులు గమనించి యుందురు. ఆ చంద్రుఁ డుండునది అష్టమస్థాన మనుట గమనించితిమేని దశ యెట్లు పరిణమించినదో వ్యక్త మగును. ఈ జాతకమున పితృకారకుఁ డగు రవి తన పరమోచ్చాసన్నస్థానమందు, మేషరాశిలోని సింహ నవాంశలో చాల ప్రబలుఁడుగ నున్నాఁడు.

"శాస్త్రార్థ కృతి కలాభిః
  ఖ్యాతో యుద్ధప్రియః ప్రచండశ్చ,
ఉద్యుక్తో భ్రమణరుచిః
  దృఢాస్థిబంధః క్రియే శ్రేష్ఠః."

అను 'సారావళి' వర్ణనమునకు జాతకుని పితృస్థానము రమ్యమగు నుదాహరణము. చతుశ్శాస్త్ర పారంగతుఁడై, నానారాజాస్థాన పూజితుఁడై, ఘంటాశతకాది గ్రంథరచనా దక్షుఁడై, బాలసరస్వత్యా ద్యనేకబిరుదాంకితుఁడైన మహా మహుఁ డీ జాతకుని జనకుఁడు. ఇట్టి వ్యక్తిని సూచించు రవి చలనవశమున వృషభరాశి 19½ భాగకు 1920-వ సంవత్సరమందే వచ్చుటచే, వ్యయాధిపతి యగు కుజునినుండి అర్ధకేంద్రశత్రుదృష్టిపాలు కావలసి వచ్చినది. పితృకారకుఁడును, పితృ (దశమ) స్థానమును పాపదృష్టివేధచే చెడిన సంవత్సరమందే పితృకర్మ సిద్ధించుట యుక్తము కదా ?

జాతకునకు దుస్సహకళత్రవియోగము నొసంగిన 1932-వ సంవత్సరము నాఁటి దశలం జాతము: లగ్నమునకు ఇంద్రుని అర్ధకేంద్రదృష్టి: అనఁగా, కళత్రస్థానము చలించి ఇంద్రునితో సార్ధకేంద్రశత్రుదృష్టివేధను పొందినదనుట: దశమమునకు చలితకేతుసంయోగము: పత్నీకళత్ర వియోగశోకముచే జాతకుఁడు మనశ్శాంతిని గోలుపోయి ముగ్ధుఁ డైనాఁడు. లగ్నసప్తమాధిపతులగు శుక్రకుజుల సంయోగము మేషరాశిలోఁ గల జాతకున కీ వియోగభర మెంత దుర్భరమో మన మూహించుకోఁ గలము. దశమ కేతుసంయోగము సమయమునకు సరిగా వచ్చి చక్కని విరక్తి నిచ్చినది. ఈ కేతువునకు సప్తమాధిపతిసంబంధ మున్నది కదా ? మేషరాశి 4-వ భాగ రసనేంద్రియధర్మమగు 'రుచి'కి సంబంధించిన దఁట. అదే రాశిలోని 2-వ భాగ 'విరక్తి'ని సూచించునది. మఱియు, ఆహారవిషయమున సామాన్యాధికారము మేషరాశి 15-వ భాగ కున్నదని పాశ్చాత్యుల మతము. ఆ భాగలో నున్న రవి ఆహారవిషయమున రాజసమర్యాదను తెలుపఁజాలువాఁడు. అట్టి రవి కళత్రవియోగపు వయస్సునకు చలనవశమున మిథున రాశిలో 2-వ భాగకు వచ్చుటయు, చలితకేతువు మేషరాశిలో 2-వ భాగకు పోవుటయు సంభవించుటంజేసి, ఆ రెండు గ్రహములకు పరస్పరానుకూల్యము వచ్చినది. ఆ కారణమున, జీవితపద్ధతులనే మార్చుకొని, విరక్తుఁడై, ఆహార విషయమం దత్యంతనిగ్రహబుద్ధితో నియమముల నలవరచుకొని, జాతకుఁడు సరివారిలో నాదర్శప్రాయుఁ డైనాఁడు. దశావిశేషము జీవితపరిణామముల నెంత రమ్యముగాఁ దెలుపుచున్నదో, సహృదయు లగు పాఠకమహాశయులే ఊహింపఁజాలరు చుకోఁగలరు.

1942-వ సంవత్సరపు టంత్యభాగమున చలితలగ్నము కర్కాటకరాశిలో 15½ భాగలో చరించుచు జన్మరవినుండి పూర్ణకేంద్రప్రాతికూల్యదృష్టి ననుభవించి వచ్చినది. భాగ్య

ర 20-12 బు 1-21		శు 4-36	చ 7-35 ఇ 17-34 కు 24-54
రా 13-31	వివాహము		
	(సాయనము)		కే 13-31
శ0-46	వ 29-1		గు 3-21

భావమునకు విందు కేంద్రమం దున్న జన్మరవి, భాగ్యభావ బిందున కెదురుగా వచ్చి నిలిచియున్న చలితలగ్నముపై నయితము కేంద్రప్రాతికూల్యదృష్టిని ప్రసరింపఁజేసిన విష మవయ స్సిది :

"అహో ! విధౌ విపర్యస్తే న విపర్యపితిహ కిం?"

అను రీతిగా, ఇది చాల క్లిష్టదశ యనుటకు సందియ ముండదు. వెనువెంటనే, దశమమునకు చలితగురువు (సింహరాశి 28½ భాగ) నుండి సార్ధకేంద్రవేధ (అనఁగా, చతుర్థకేంద్రమునకు అర్ధకేంద్రవేధ) దాపరించినది. వృషభ లగ్న జాతకమునకు గురువు మృత్యుస్థానాధిపతి యగుటచే పాపి గదా ? ఆ గ్రహమునుండి చతుర్థ స్థానమునకు వచ్చిన క్రూరదృష్టి వలని ఫలము మాతృక్లేశమును సూచించుటలో వింత లేదు.

ప్రశంసలో నున్న కాలత్రయములో, జాతకుని జీవిత పరిణామములతో బాగుగా సమన్వయపడు దశల నిచ్చునది ఏ కాలమో పాఠకమహాశయులకు వేరుగా విన్నవించుట యనవసర మనుకొందును.

దశాపద్ధతినుండి వచ్చిన సాక్ష్యసామగ్రిని పరిశీలించి తిమి. విషయనిర్ణయమున కింతే చాలును. కాని, దైవిక జాతకము లేమనుచున్నవో ఇంచుక పరిశీలింతము. ప్రశంసలో నున్న విశేషదినములు నాల్గింటికిని దైవిక కేంద్రములు వేరుపత్రకమున చూపఁబడినవి. (అనుబంధము 2 చూడుఁడు)

జాతకునకు వివాహమహోత్సవము జరిగిన 10-3-1897 నాఁటికి దైవికకుండలి యిది:

ప్రథమకాలము ననుసరించి సాధించిన దశమ కేంద్రము పెండ్లినాఁడు చలితకేతుసంయోగమునం దున్నది: కాషాయవస్త్రకమండలు ధారణమున కీ యోగము తగినది కావచ్చు నేమో కాని, కన్యాపాణిగ్రహణమునకు యోగ్య మైనదని చెప్పుట సాహసకార్య మనుకొందును. కద కర్థున సన్యాసమున కైనా, 12 సంవత్సరముల పెండ్లికుమారుఁడు తగియుండఁ గలఁడా ? రెండవకాలము కేంద్రములకు గ్రహ సంబంధ మేమియుఁ జూపక ఔదాసీన్యము వహించినది. మఱి, మూఁడవకాలపు దైవికలగ్న మే మనుచున్నదో తిలకింపుఁడు. 1897-వ సంవత్సరమునకు చలితశుక్రుఁడు మేషరాశి 23-వ భాగయం దుండఁగా, ఆ నాఁ టికేంద్రము నెమ్మదిగా చలితశుక్రునిపై నున్నది. కళత్రకారకుఁడు మాత్రము కాక, ఈ శుక్రుఁడు జాతకునికి లగ్నాధిపతికూడ: ఇంతకన్న వివాహమంగళము సూచించుటకు మంచియోగ మేమి రాఁగలదు ? ఆ సంవత్సరమున, ఆ దినమున తప్ప వేరుదినములలో నిట్టి యోగము లభించ దనుట గమనించితి మేని, ఈ యోగము నా దినమున సంపాదింపఁగల జన్మ కాలము విశ్వసనీయ మనుటలో నాశ్చర్య ముండదు.

1920-వ సంవత్సరమున మార్చినెల 3 వ తేదీన మహనీయుఁడు జాతకుని జనకుఁ డిహలోకయాత్ర చాలించెను. ఈ క్రిందిదే నాఁటి దైవికకుండలి:—

ర 12-37 వ 2-18	బు 0-45	కే 19-4	
శు 11-26	పితృనిర్యాణము		
	(సాయనము)		ఇ9-19(వ) గు9-39(వ) చ 24-58
	కు 9-19 రా 19-4	•	శ 7-56(వ)

మొదటి రెండు కాలములకు సంబంధించిన దైవిక కేంద్రము లానాఁడు మౌనముద్రలో నుండుట పాఠకమహా

శయులు గమనించియుందురు. జాతకుని జన్మకాలము లివి అయినచో, అతని జీవితములో నతిముఖ్యమైన ఘట్టమున కేంద్రముల కీ మౌన మేల ? ఇఁక, మూఁడవకాలము సాధించియిచ్చు దైనికలగ్నముం జూడుఁడు : అది యానాఁడు జన్మరవి (పితృకారకుని) సంయోగములోనే యున్నది. దశలో వ్యయాధిపతితో చలితరవి వేధితుఁ డయిన సంవత్సర మది. అట్టి పరిస్థితులలో నీ దైనికలగ్నరవిసంయోగము పితృక్లేశమును దెలుపుట వింత కాదు. మఱియొక విశేషము : ఈ కాలమువలన సాధించిన పితృసహామ బిందువు కర్కాటకరాశిలో 25 భాగలు, 3 కలలలో నున్నది. ఏకాంశవర్షపద్ధతితో ఈ వయస్సున కా బిందువు చలించి కన్యారాశ్యారంభభాగలో నుండినది. అగుటంబట్టి జన్మరవి స్థానమునుండి ఈ చలితసహామస్థానము సార్ధకేంద్ర విషమ దృష్టికి లోనయి యుండినది. కావనే, జన్మరవివ్యాప్తి దైనిక కేంద్రమునకు వచ్చిననాఁడు జాతకునికి పితృనిర్యాణక్లేశము సంభవించుట : ఇతరకాలముల కిట్టి సమన్వయశక్తి రానేరదు.

జాతకునకు కళత్రవియోగ దుఃఖము సంభవించినది 19-4-1932-వ తేదీనాఁడు. నాఁటి దైనికచక్ర మిట్లుండును:-

రా 24-29	శు 12-33 బు 14-36 వ 19-55 ర 29-13		కు 14-49
శ 14-15	కళత్రవియోగము (సాయనము)		
			న 12-47
		చ 9-22	ఇ 5-23(వ) కే 24-49

చూడుఁడు : జాతకునకు సంభవించిన యీ దుర్భర క్లేశమును సూచించు విషయమున ప్రశంసలోనున్న మొదటి రెండు కాలములు కం కి మ్మనక ఎ ట్లూరకున్నవో ?

కేంద్రము లొక్కటి అయినా క్రూరగ్రహసంయోగముచే చెడిన పాపమునఁ బోలేదు. కాని, మూఁడవ కాలము సాధించియిచ్చిన దశమకేంద్రము నొక్కసారి కటాక్షింపుఁడు : చలితగురువు సింహరాశి 27¼ భాగకు వచ్చుటచే దైనికదశమకేంద్రమునకు నిందు సమసప్తకమున నున్నాఁడు. అనఁగా, దైనికచతుర్థ కేంద్రములో నున్నాఁ డనుట : అష్టమాధిపత్యపాపి ఈ బృహస్పతి యని యెఱుఁగుదుము. ఇట్టి గ్రహము గృహస్థానమును (చతుర్థమును) వేధించిన నాఁడే దైనికలగ్నమునకు చలితశుక్రసంయోగము వచ్చినది. ఈ వివత్కాలమున లగ్నమునకు శుక్రుఁ డేల వచ్చినాఁ డని ఎవరైన సందేహింతురేమో ? ఇం దొక విశేష మున్నది. చలితశుక్రుఁ డీ వయస్సునకు మిథునరాశి 6-వ భాగయందుండుటచే ఇంద్రుని కేంద్రవేధకు, వరుణుని అర్ధకేంద్ర వేధకు ఏకకాలమునందే గురిఅయి చెడినాఁడు. ఆ దినమున తాత్కాలిక శుక్రుఁడు నయితము తాత్కాలికరవి కర్మ కేంద్రమందే నిలుచుట చూడనగును. వివాహసహామ బిందువు మకరరాశిలో 4 భాగలు, 43 కలలలో నుండునది ఏకాంశవర్షపద్ధతిలో చలనవశమున నిపుడు జన్మకాలమందలి ఇంద్రునితో పూర్ణకేంద్ర ప్రాతికూల్యదృష్టి నార్జించినది. ప్రశంసలో నున్న కాలపు జన్మలగ్నమునకు 'దారారూఢ' మును సాధించినచో, అది సింహరాశిలో 17 భాగలు, 23 కలలకు వచ్చును. ఏకాంశవర్షసంప్రదాయమున 47 సంవత్సరముల వయస్సున కీ పదము చలించి తులారాశిలో 4½ భాగకు వచ్చును. అనఁగా, సప్తమవ్యయాధిపతి యగు కుజుని సమసప్తకవేధకు లోనయిన దనుట : ఇన్ని విధ

			వ 0-52 శ 5-47
కే 26-22 శు 17-40 బు6-45(వ) ర 1-35	మాతృకర్మ (సాయనము)		న 18-42
			చ 13-0 రా 26-22
కు 26-54		ఇ 1-58	

ములుగా, కళత్రభావము, కళత్రకారకుఁడు, కళత్రాధిపతి, కళత్రపదము ప్రబలదోషమును సూచించు కాలమున శుక్రుఁడు దైనికలగ్నమం దుండుట కళత్రవియోగక్లేశము జాతకుని కలిగివైచిన దని తెలుపుటలో విశేషము లేదు.

1942-వ సంవత్సరమున జనవరి 22-వ తేదీనాఁడు జాతకుని మాతృనిర్యాణము. నాఁటి దైనికకుండలిని ముందు పుటలో రెండవకాలము అడుగున చూడుఁడు.

ఇచ్చట సంయితము మొదటి రెండు కాలములు తాటస్థ్యభావము వహించినవని చదువరులు గమనించియే యుందురు. మూఁడవ కాలమునుండి గణించిన కేంద్రములు మాత్రము స్పష్టముగా ఫలమును చూపుచునే యున్నవి. లగ్నమునకు చలితగురువు (అష్టమాధిపతి) నుండి సమసప్తకవేధ: దశమకేంద్రమున కెదురుగా, అనఁగా దైనిక చతుర్థమందే (మాతృస్థానమున) శనిమహాశయుని సాక్షాత్కారము: మాతృనిర్యాణము నివి సూచింపఁజాలవా? మఱియొక విశేషము. మాతృసహమబిందువు కుంభరాశి 1 వ భాగ, 43 కలలలో నున్నది. ఏకాంశవర్షపద్ధతిలో నిది చలించి మాతృదీక్షాకాలమునకు వరుణుని సమసప్తకవేధచే నాకర్షింపఁబడినది. ఇది సంయితము మూఁడవ కాలము నుండియే సాధ్యము.

సాక్ష్య మిచ్చుటకు సిద్ధముగానున్న మఱికొన్ని దశావిశేషములు, దైనికజాతకములును గలవు. గ్రంథవిస్తరభీతిచే నవి ఇచట నుదాహరింపఁబడలేదు.

శుక్రనాడీప్రోక్త మని వారుకలో నున్న లగ్నశోధన పద్ధతిని గూర్చి నా యూహలను మనవిచేసితిని. కాని, ఈ పద్ధతి నిర్మూలమని, నిరుపయోగమని నా ఆశయము కాదు. ఆ సూత్రము ననుసరించి వారనక్షత్రయోగమునకు సరిపడు గడియలలో జనించినవారి జాతకములు మాత్రమే నాడీ గ్రంథములో వ్రాయఁబడియుండు ననుకొన్నచో, బాధక ముండ దనుకొందును. ఇదమిత్థ మని సిద్ధాంతీకరించుట విమర్శకులగు పండితోత్తముల పని. పరిస్థితు లిట్లుండఁగా, ఈ సూత్రము ననుసరించి,

"గతానుగతికో లోకో,న లోకః పారమార్థికః."

అను న్యాయమున అన్ని జాతకముల కాలములను సవరించుట ప్రమాదకారి యని నా విన్నపము. శుక్రనాడీ పద్ధతిలో జీవితపరిణామములకు దినవర్షాదిదశాకాలమును సమన్వయపరచుట సాధ్య మని కానవచ్చెనేని, వెంటనే నా యభిప్రాయమును సప్రశ్రయముగా మార్చుకొనుటకు వెనుదీయువాఁడను గాను.

ఈ వ్యాసమున ఉదాహరణముగా నుపయోగించిన జాతకము నా మిత్రునిది. ఇతని జీవితమున ప్రసిద్ధము లయిన విశేషదినములు తెలిసియుండుటయు, జాతకుఁడు సహృదయుఁ డగు సుప్రసిద్ధపండితుఁడు, రసికుఁడు, విమర్శకుఁడు మాత్రమే కాక, జ్యోతిషశాస్త్రపారంగతుఁ డగుటయు, అన్నింటికి పైఁగా నాపై సవ్యాజాభిమానము కలవాఁడగుటయు నే నతని జాతక ముపయోగించుటకు కారణములు. నా యూహలు సయుక్తికము లయ్యెనేని అతఁడు శాస్త్రదృష్టితో నాదరించు ననియు, నిస్సారములయ్యెనేని స్నేహదృష్టితో మన్నించు ననియు నమ్మిక.

"ఆపరితోషా ద్విదుషాం
న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానం,
బలవ దపి శిక్షితానా
మాత్మ న్యప్రత్యయం చేతః."

అనుబంధము – 1

చలిత కేంద్ర స్థానములు

	జన్మకాలము	విశేషపరిణామములు	లగ్నము రాశి	లగ్నము భాగ	దశమము రాశి	దశమము భాగ	గ్రహదృష్టియోగములు
I	2–33 గడియలకాలమునకు	(1) వివాహము (1897)	వృషభ	16$\frac{1}{4}$	కుంభ	7$\frac{3}{4}$	దశమమునకు జన్మ శుక్రుని అర్ధకోణదృష్టి.
		(2) పితృకర్మ (1920)	మిథున	9$\frac{1}{4}$	మీన	$\frac{1}{2}$	....
		(3) కళత్రవియోగము (1932)	మిథున	20$\frac{1}{2}$	మీన	13	....
		(4) మాతృకర్మ (1943)	కటక	$\frac{1}{2}$	మీన	25	దశమమునకు చలిత శని కేంద్రదృష్టి.
II	5–42 గడియలకాలమునకు	(1) వివాహము (1897)	మిథున	5$\frac{3}{4}$	కుంభ	26$\frac{3}{4}$	లగ్నమునకు జన్మ శుక్రునితో అర్ధకోణదృష్టి.
		(2) పితృకర్మ (1920)	మిథున	27	మీన	20$\frac{3}{4}$	....
		(3) కళత్రవియోగము (1932)	కటక	8	మేష	3$\frac{1}{2}$	....
		(4) మాతృకర్మ (1943)	కటక	18	మేష	15$\frac{1}{2}$	దశమమునకు జన్మ రవి సంయోగము.
III	5–20 గడియలకాలమునకు	(1) వివాహము (1897)	మిథున	3$\frac{1}{2}$	కుంభ	24$\frac{1}{2}$	లగ్నమునకు జన్మ కుజుని అర్ధకోణదృష్టి. చలిత రాహుకేతువుల శుభదృష్టి.
		(2) పితృకర్మ (1920)	మిథున	25	మీన	18$\frac{1}{4}$	దశమమునకు జన్మ చంద్రుని కేంద్ర వేధ.
		(3) కళత్రవియోగము (1932)	కటక	6$\frac{1}{2}$	మేష	2	లగ్నమునకు ఇంద్రుని అర్ధకేంద్రవేధ; దశమమునకు చలిత కేతు సంయోగము.
		(4) మాతృకర్మ (1943)	కటక	16	మేష	13$\frac{1}{4}$	దశమమునకు చలిత గురువునుండి సార్ధకేంద్ర వేధ.

అనుబంధము - 2

దైనిక కేంద్రములు


	జన్మకాలము	విశేషఫలము	తేదీ	దైనికలగ్నము రాశి	దైనికలగ్నము భాగ	దైనికదశమము రాశి	దైనికదశమము భాగ	గ్రహదృష్టి యోగములు
I	2—33 గడియలకాలమునుండి	వివాహము	10—3—97	మకర	2½	మేష	3½	దశమమునకు చలిత కేతుసంయోగము
		పితృకర్మ	3—3—20	మీన	25¼	ధనుస్సు	26¾	....
		కళత్రవియోగము	19—4—32	వృషభ	20½	కుంభ	10¼	....
		మాతృకర్మ	22—1—43	కుంభ	8¼	వృశ్చిక	18¾	....
II	5—42 గడియలకాలమునుండి	వివాహము	10—3—97	మేష	26½	మకర	20	....
		పితృకర్మ	3—3—20	మేష	18¾	మకర	14	....
		కళత్రవియోగము	19—4—32	మిథున	10¼	కుంభ	29¾	....
		మాతృకర్మ	22—1—43	మీన	30	ధనుస్సు	7	....
III	5—20 గడియలకాలమునుండి	వివాహము	10—3—97	మేష	23	మకర	20	లగ్నమునకు చలిత శుక్రసంయోగము.
		పితృకర్మ	3—3—20	మేష	15½	మకర	12	లగ్నమునకు జన్మ రవి సంయోగము.
		కళత్రవియోగము	19—4—32	మిథున	6	కుంభ	27¼	లగ్నమునకు చలిత శుక్ర సంయోగము; దశమమునకు చలిత గురుసమసప్తకవేధ.
		మాతృకర్మ	22—1—43	కుంభ	28¼	ధనుస్సు	5	లగ్నమునకు చలిత గురుసమసప్తకవేధ; దశమమునకు శని సమసప్తకవేధ.

పునర్వసు ★

శ్రీ గొబ్బూరు
వెంకటానందరాఘవరావు

ఆకాశరంగమున మిణుకుమిణుకు మని మెఱయు చుక్కల గుంపులలో పునర్వసు మిక్కిలి రమణీయమైనది. బహుప్రాచీనకాలమునుండి ఈ గుంపు నక్షత్రపరిశోధకుల దృష్టి నాకర్షించియున్నది. యంత్రసాయము లేని కనులకు మామూలుగా చూచినపుడు ఈ చుక్కలగుంపు ఇక్కడి పటములో చూపినట్లు కనబడును. ఇందు తేజోవిషయమున నగ్రగణ్యము లని నిర్ణయింపబడిన (First Magnitude Stars) ఇరువదింటిలో మూడు చూడనగును. వీటిని ఈ పటములో వరుసగా ౧-౨-౩ అంకెలు వేసి చూపితిమి. ౧-౩ గుర్తులు గల చుక్కలమధ్య, కూడి వక్ర రేఖలో మరి నాలుగు చిన్న చుక్కలు చూడవచ్చును.

చంద్రుడు, అంగారకుడు, గురుడు, శని మొదలగు గ్రహములు ఆకాశమున ఒక స్పష్టమైన మార్గముమీదుగా పోవును కాని ఇష్టమువచ్చినట్లు సంచరింపవు. ఈ గ్రహములు ఏ మార్గము ననుసరించి పోవునో ఆ మార్గమునకే జ్యోతిశ్శాస్త్రములో క్రాంతి వృత్త మని పేరు. పునర్వసు చుక్కలు ఈ క్రాంతి వృత్తమునకు రెండు ప్రక్కలను ఉన్నవి. అశ్విని, భరణి మొదలైన ఇరువదియేడు చుక్కల గుంపులు ఈ క్రాంతి వృత్తములో స్టేషనుల వలెను, మైలురాళ్లవలెను ఉన్నవి. పునర్వసు ఈ యిరువదియేడింటిలో ఒకటి. ౧-వ పటములో క్రా ౧ క్రా ౨ క్రా ౩ క్రా ౪ అను అక్షర సంజ్ఞలతో చూపిన రేఖ ఈ క్రాంతివృత్తమే. ఈ రేఖవలన క్రాంతివృత్తమునకును, పునర్వసు చుక్కలకును గల సంబంధము స్పష్టమగుచున్నది.



దివ్యమైన తేజస్సు, చక్కని సామీప్యము గల ఇందలి ౧-౨ గుర్తు గల చుక్కలను చూచి అనాది కాలమునుండి అన్ని దేశములవారును మిక్కిలి సంతోషము పొందుచుండిరి. ఈ జంట చుక్కలను కొందరు అన్నదమ్ములుగాను, కొందరు భార్యాభర్తలుగాను భావించుకొనిరి.

జనకునింట నున్న శివధనుర్భంగమునకు ముందు రామలక్ష్మణులు మిథిలానగరప్రవేశము చేయు ఘట్టము వర్ణించుచు కాళిదాస మహాకవి రఘువంశము XI ౩౬ లో ఇట్లు వ్రాసియున్నాడు:

"తౌ విదేహ నగరీ నివాసినాం
గాంగతా వివ దివః పునర్వసూ
మన్యతేస్మ పిబతాం విలోచనైః
పక్ష్మపాతమపి వంచనాంమనః"

ఈ శ్లోకములో 'గాంగతా' అనగా 'భువం గతా'. భూమిమీదకు దిగిన పునర్వసుచుక్కలజంట వలె రామలక్ష్మణ సోదరులు మెఱయుట చూచి రెప్ప వేయక ఆ పట్టణములో పౌరులు వారిని చూచుచుండిరట !

వేదములో అశ్విని దేవతలు "త్రిపదస్థులు", అనగా మూడు స్థానములు గలవారని వర్ణన లున్నవి. ఈ పునర్వసు జంటచుక్కలు ఒకప్పుడు అశ్వినుల మూడు స్థానములలో ఒకటి యైనట్లు కనబడుచున్నది. పునర్వసు తరువాత నున్న పుష్యమి పొట్లపూవువంటి చుక్కమబ్బు. అది యొక పెండికంచ మనియు, అందులో గాడిదలు తిండి తినువనియు పడమటి దేశములవారి గాథలున్నవి. అశ్వినులు గర్దభవాహనులని వేదవాఙ్మయములో పెక్కుచోట్ల గలదు. దిగువ పుష్యమిప్రక్క గర్దభములును, ఎగువ పునర్వసుజంట చుక్కల రూపమున అశ్వను లిద్దరును ఉండుట గమనింప తగును. అశ్వను లను సోదరు లిద్దరికిని పునర్వసు చుక్కల జంటతో సంబంధ మగుపడుచున్నది.

పాశ్చాత్య రోమనుగాథలలో ఈ చుక్కలు **Castor and Pollux** అను సోదరులు.

పునర్వసు మిథునరాశిలోనిది. ఇంగ్లీషులో ఈ రాశిని **Gemini** అందురు. ప్రాచీనకాలములలో మెసొపొటేమియా దేశప్రాంతములలో నుండిన అకేడియా, అసీరియా జాతులవారు ఈ రాశికి "శివన్" అని పేరుపెట్టి, ఇటుకలపైని ఆ అక్షరములే వ్రాసిరి. ఇటీవల ఆ యిటుకలను భూగర్భమునుండి త్రవ్వియెత్తి ఆ లిపి చదువగలుగుటచేత మన కీసంగతులు తెలిసినవి.

బహుకాలమునుండి మన శాస్త్రప్రకారము పునర్వసుచుక్కలు మిథునరాశిలోనివే. మిథున మనగా పార్వతీ పరమేశ్వర మిథునము-వృషభ(రాశి) మీది మిథునము. మన శివాలయములలో నందు లీ ఖగోళ వృషభరాశిచిహ్నములు. ఆ వృషభముపై నధిరోహించు పార్వతీపరమేశ్వరులే మిథునరాశి.

ఋగ్వేదములో రెండు కుక్కలు వర్ణింపబడినవి: ౧. శ్వానము, ౨. పూర్వశ్వానము. శ్వానము పాశ్చాత్య జ్యోతిశ్శాస్త్రములో "పెద్దకుక్క" (**Canis Major**) అని చెప్పబడినది. రెండవది చిన్నకుక్క (**Canis Minor**). చిన్నకుక్క ముందును, పెద్దకుక్క వెనుకను కనబడును. కాబట్టి చిన్నకుక్క 'పూర్వశ్వాన' మని వ్యవహరింపబడినది. పాశ్చాత్యు లీ చిన్నకుక్కను ప్రోశ్యాన్ (**Procyon**) అని చెప్పుచున్నారు. ప్రోశ్యాన్ శబ్దము స్పష్టముగా పూర్వశ్వాన శబ్దవికృతి.

Canis Major లో ముఖ్యమైన చుక్కకు సిరియస్ (**Sirius**) అని పేరున్నది. ఈ చుక్కనే మనవారు మృగవ్యాధరుద్రు డనిరి.

ఏ చుక్కలు పునర్వసు ?

పునర్వసు చుక్కలను అనేకు లనేకవిధములుగా వర్ణించినారు.

"పునర్వసు ధనురాకారం పంచ"—విల్లువంటి ఆకారము గల అయిదు చుక్కలు అని వరరుచి.

"నౌకాకారం పంచ"—పడవవలె ఐదుచుక్కలని మరొకరు.

"పునర్వసు మహామీనమ్"— పునర్వసు పెద్ద చేపవలె ఉన్నదని వాల్మీకి.

"ఈ చుక్కలన్నీ **Double-Convex lens** లాగ ఉన్నవి" అన్నారు ఈ నాడు సైన్సు చదువుకొనుచున్న విద్యార్థు లనేకులు.

పై పటములో చుక్కల రూపమునకు పై వర్ణనలు ఒక మోస్తరుగా సరిపోవచ్చును. కాని ఈ ఉపమానములు చప్పిడిగా ఉన్నవి. చుక్కలకు స్వతస్సిద్ధమైన తళుకు వీనిలో కనబడదు. ఈ యుపమానము లా చుక్కల తేటు లేక నిర్జీవముగా ఉన్నవి. శ్రీనాథకవి సార్వభౌముని పునర్వసువర్ణనలో ఈ చుక్కల లావణ్యము సహజముగా స్ఫురించుచున్నది.

> "ఒకచో పునర్వసు ఊగ వృక్షము కొమ్మ
> నుడివడ్డ ముత్యాల సొబగువోలె."

మేరుపర్వతముమీద ఈర్ష్యచేత వింధ్యపర్వతము పెరిగి నక్షత్రమండలము నంటి నిలిచినపుడు ఎక్కడి చుక్కలు అక్కడనే నిలిచిపోయినవి. మన పునర్వసు చుక్కలు ఒక చెట్టుకు తగులుకొని చిక్కబడిన ముత్యాల హారములాగున ఊగిన వని శ్రీనాథుని వర్ణన.

ఎంత సహజమైన దీవర్ణన! పునర్వసు నక్షత్రముల తళుకు మిణుకులను ముత్యాల హారములో మిల


మిథునము
GEMINI

మిలలాడు ముత్యముల లావణ్యముతో సరిపోల్చి వర్ణించినాడు. రసవంతము, సజీవము, ఉజ్జ్వలము అయిన వర్ణన ఇది. పునర్వసు అను నీ ముత్యాల హారమునకు ౩ సంఖ్యగల నక్షత్రము నాయకమణియై మెఱయుచున్నది.

ఓ శ్రీనాథకవి సార్వభౌమా! ఉద్భట వివాద ప్రౌఢిలో గౌడడిండిమభట్టుకంచుఢక్కా పగుల గొట్టించినావు! కనకాభిషేకము గావించుకొనినావు! కవిసార్వభౌముడ వైనావు! అదెంత నీకు? దేవతలందరకును తల్లి అదితి. అదితిదేవి అధిదేవతగా గల పునర్వసు! శ్రీరామచంద్రుని జన్మనక్షత్రమైన పునర్వసు! అటువంటి చక్కని చుక్కల పునర్వసు వర్ణనను గూర్చిన యీ పాటీపరీక్షలో ఆదికవి వాల్మీకిని చిత్తుచేసి గెలుపుగొని నీ కవిసార్వభౌమత్వమును సుస్థిరము చేసికొనినావు.

ధన్యుడవు! ముమ్మాటికి ధన్యుడవు! కడుపార నిన్ను కొడుకుగా కన్న తెనుగు తల్లి బహు ధన్యురాలు.

పునర్వసు నక్షత్ర సమూహములో ముఖ్యమైన చుక్కలు నాలుగని కొందరు, అయిదని కొందరు జ్యోతిశ్శాస్త్రవేత్తలు వ్రాసినారు. అయిదు చుక్కలని చెప్పువారిలో కూడ అభిప్రాయభేదము లున్నవి. ఓఢ్ర సిద్ధాంతులు మృగవ్యాధ రుద్రు డని మనవారును, సిరియస్ (**Sirius**) అని పాశ్చాత్యులును వ్యవహరించు పెద్దచుక్క ఈ పునర్వసులోనిదే నని చెప్పుచున్నట్లు నా మిత్రులు శ్రీ పురిపండా అప్పలస్వామిగారు తెలియజేయుచున్నారు. పై పటములో ౧- ౨- ౩- చుక్కలకు మృగవ్యాధనక్షత్రమును చేర్చి చూచినను ధనురాకారము చెడదు సరేకదా ఆకాశరంగమున నది మిక్కిలి పెద్దధనురాకారముతో ప్రకాశించు నని అప్పలస్వామిగారి అభిప్రాయము. పెద్ద వింటిరూపము కనబడుట నిజమే కాని క్రాంతివృత్తమునకు మిక్కిలి దూరములో నున్న మృగవ్యాధు డీవింటిలో చేరునా అని నా సందేహము.

పై పటములో అ-లాం-బీ-ఫై అను అక్షరములను, ౪,౫ అంకెను వేసి చుక్కలను చూపియున్నాను. వీని యర్థము వివరింపవలసియున్నది. పునర్వసు చుక్కలు పాశ్చాత్యుల జెమినై (**Gemini**) అను మిథునరాశిలోనివి. ఒక గుంపులో మిక్కిలి తేజోవంతమైన నక్షత్రమును గ్రీకు అక్షరమాలలో మొదటిదగు ఆల్ఫాగుర్తుచేతను, తరువాత తేజోవంతమైన నక్షత్రమును బీటా అని ఇలాగున తెలుపుట పాశ్చాత్య పద్ధతి. పై పటములో అ-అనునది అయోటా అను గ్రీకు అక్షరసంజ్ఞ గల చుక్క. లాం-అనునది లాంబ్డా అక్షరసంజ్ఞ కలది. ఫై-అనునది ఆ అక్షరసంజ్ఞ గల చుక్క. అక్షరములు కాగా మిగిలిన చుక్కలకు అంకెలు వేయుదురు. ౪,౫ అనునది అక్షరముల తరువాత అంకెలలో ౪,౫ గుర్తు గల చుక్క. (౧-౨-అని నేను పైపటములో చూపినవి ఆల్ఫాబీటా చుక్కలు. సదుపాయము నిమిత్తము, వెంటనే తెలియుటకు ౧-౨ అంకెలు వేసిచూపితిని.)

మరొక్క విషయము వ్రాసి ఈ వ్యాసము ముగింతును. ఇదివరకు నేను భారతిలో ఒకప్పుడు పునర్వసును గూర్చి వ్రాసినపుడు "ఒకచో పునర్వసు పూగవృక్షము..."అని శ్రీనాథుని వర్ణనము క్రింద వ్రాసియుంటిని. పోకచెట్టుకొమ్మకు తగిలిన ముత్యాలహారమని అర్థము వ్రాసితిని. మిత్రులు శ్రీ పురిపండా అప్పలస్వామిగారు పూగవృక్ష మనుటలో యతిభంగమున్నదనియు, "ఊగ" అనినచో ఆ దోషము ఉండదనియు నాకు దయతో తెలిపిరి. నక్షత్రవిషయమే ప్రధానముగా పనిచేయుచున్న నాకు యతిభంగవిషయము స్ఫురించలేదు. అప్పలస్వామిగారు దోషము చూపి సవరించినారు. నా అశ్రద్ధచేత శ్రీనాథకవి సార్వభౌముని పద్యమునకు వాటిల్లిన యతిభంగదోషము సరిచేసినందుకు వారికి మిక్కిలి కృతజ్ఞుడను.

* * *

కృష్ణయజుర్వేదములో అదితి పునర్వసు నక్షత్రమునకు అధిదేవత యని చెప్పబడినది. ఆనాటి యజ్ఞయాగాది కర్మలు అదితిదేవిపూజతో ఆరంభమై, అదితిపూజతో సమాప్తియగుచుండెడివి. అదితి రెండుముఖములుగల దేవతగా భావింపబడుచుండెను. కాలక్రమమున నీ ప్రథమపూజా గౌరవము పార్వతీపరమేశ్వర పుత్రుడైన గజముఖునకు లభించినది. ఇట్లగుటకు గల కారణములు జ్యోతిశ్శాస్త్రరీత్యా వేరొక సందర్భములో చర్చించుకొందము.

తోటలో డాబా*

[కథానిక]

= శ్రీ అజ్జరపు వెంకటరమణరావు =

ఏడెనిమిది యేళ్ల క్రితం. ఆరోగ్యం బాగుపడా లని నే వాపూరు వెళ్లాను. ఆ వూరికి మధ్య పొలాలలో ధనవంతు లందరికీ యిళ్లు వున్నాయి. చాలామంది శెలవులకి అక్కడికి వస్తుండేవారు. నేను వున్న యిల్లు చాలా పెద్దది. ఎంతో విశాలంగా వుండేది. ఒక పెద్ద సావడి. దానిలో నాలుగుపక్కల స్తంభాలు. మధ్య వెలుతురు వచ్చేలాగ ఒక మండువా. నే నేమీ తోచక అలాగే అక్కడ దివాసీమీద పడుకొని ఆలోచిస్తోండే వాణ్ణి. లేకపోతే ఆ పెద్దపెద్ద కిటికీలలోంచి చుట్టూ వున్న పొలాలనీ, తోటలనీ, దూరంలో క్రిందకు వంగుతోన్న ఆకాశాన్నీ అలా చూస్తో కూర్చునే వాణ్ణి. ఆ యింటి యజమానికొడుకు సుందరంకూడా నాతో పాటే అక్కడ వుండేవాడు. అతను పొద్దున్నే లేచేవాడు. స్నానం చేసేవాడు. పట్నంలో వున్నప్పటిలాగే హాటు తగిలించి వూరంతా తిరిగి వచ్చేవాడు. ఇంట్లో కాఫీ తాగేవాడు. అస్తమానూ ఏదో చిరుతిండి తింటూవుండేవాడు. ఇవన్నీ గాక తన కేమీ తోచడం లేదని నన్ను బాధిస్తోండేవాడు. అతనితో, అతని భావాలతో ఏకీభవించి, ఆఖరికి అభిమానం చూపించి మాట్లాడే మనిషి అయినా అక్కడ లేడే అని అతనికి విచారం. నేనుమటుకు—నాకు పనేమి వుంది? ఆ సావిడిలో అలాగే పడుకొనివుండేవాణ్ణి. పెద్దగా వర్షం వస్తే, యిల్లంతా కూలిపోతూన్నట్లు చప్పుడయ్యేది. గాలిహోరుకి కిటికీల తలుపులు అదే పనిగా అటూ యిటూ కొట్టుకొని చప్పుడు చేసేవి. ఒక్కొక్కసారి ఆ ఉరుములవెనక అన్ని కిటికీలలో నుంచీ మెరుపులు ఆ చీకటిలోనుంచి తళుక్కున మెరిస్తే, నా గుండెలు ఝల్లుమనేవి. నా కెంతో భయంగా వుండేది.

ఒకనాడు సాయంత్రం నేను యింటికి తిరిగి వస్తుంటే ఒక పెద్ద ప్రహారీగోడ, లోపల ఏదో పెద్ద యిల్లు వున్నట్లు కనిపించాయి. సూర్యు డప్పుడే అస్త మిస్తున్నాడు. పొడుగాటి నీడలు పండిన వరిపొలాల మీద పాకుతున్నాయి. గేటుదగ్గరనుంచి లోపలికి ఏపుగా పెరిగిన మొక్కలు బారులుతీసి నాటబడి వున్నాయి. నేను ఒక పక్కనుంచి వెళ్లి చూద్దామని వాటి వెనకాలనుంచి నడుస్తుంటే, కాళ్లల్లో ముళ్లు గుచ్చుకుంటున్నాయి. చీకటిపడుతోంది. చెట్ల ఆకులలో అల్లుకొన్న సాలిగూడులు వర్షపు జల్లులలో నుంచి కనిపించే సూర్యరశ్మిలోని ఇంద్రధనుస్సు రంగుల్లో మెరుపుల్లా అక్కడక్కడ తళుక్కున మెరుస్తున్నాయి; బంగారపు వగిషీతో అల్లిన చిన్న చిన్న అలంకారాలలాగ. కొబ్బరిచెట్లలోనుంచి నీరుకారుతోంది. ఏదో విసుగ్గా, ఘాటుగా వాసన వేస్తోంది. నేను కుడివైపు నిమ్మచెట్లకేసి మళ్లాను. నా కాళ్ల క్రింద ఎండి రాలిపోయిన ఆకులు నలిగి నశించిపోయాయి. ఎడమవైపు ఏదో చెట్టుకొమ్మలలోనుంచి ఒక పక్షి ఓపికలేని కంఠంతో, నీరసంగా ఏదో పాడుతోంది. అది బాగా ముసలిపక్షి కాబోలు అని అనుకున్నాను. ఇంతట్లోకే ఆ నిమ్మచెట్లవరుస ఆఖరు అయిపోయింది. ఏవో పూలతీగలు మీదికి పాకుతోన్న తెల్లని పెద్ద

* **Anthony chekov** కు కృతజ్ఞతలతో.

డాబాముందరభాగానికి నేను వచ్చాను. ముందర నీటిని జల్లుతోన్న యంత్రంతో చక్కని బొమ్మ వుంది. దాని చుట్టూ పెద్ద తిన్నె. దాంట్లోనుంచి పొడుగాటి స్తంభం. దానికి తెల్లటిరంగు. అస్తమించిన సూర్యుడి కిరణాలలోని పసిమినీడలు ఆ డాబామీద పాకే తీగలమీదా, ఆ ముందటి స్తంభంమీదా పడు తున్నాయి. పవలు పోతూ, రాత్రి రాబోతూన్న ఆ సంధ్యాసందిగ్ధంలో యీ సన్నని సూర్యకిరణాల బంగారుపసిమిరేఖలు ఎంతో అందంగా లోకంమీద పాకుతున్నాయి. నా కాప్రదేశం అంటే ఎన్నిదినాల నుంచో ఎంతో బాగా పరిచయంవున్నట్టు అనిపించింది. అక్కడ అలా నిలుచుని వుండిపోతే ఎంత బావుంటుంది అనుకున్నాను.

ఇంతల్లోకే సింహాలు చెక్కిన ఆ తెల్లని రాతి స్తంభపుగేటుదగ్గర ఇద్దరు అమ్మాయిలు కనిపించారు. పెద్దపిల్ల సన్నగా, ఎర్రగా, పొడుగ్గా వుంది. ఆమె చక్కదనంలో ఒక ఆకర్షణ, దాని వెనకాలే గర్వం కలిసివున్నట్లు కనిపిస్తోంది. ఆమె నన్ను చూచీ చూడ నట్లునటించింది. రెండవపిల్ల అంతకంటే చిన్నది. ఆమె కూడా సన్నగా, పచ్చగా, పొడుగుగానే వుంది. ఆమె పెద్దకళ్లు ఎంతో అందంగా వున్నాయి. ఆమె ఎర్రని మెత్తని పెదవులు ఎంతో చక్కగా కనిపిస్తున్నాయి. ఆమెకు బహుశా పదునేడు, లేక పదునెనిమిది ఏండ్లు వుంటాయి. ఆమె అమాయికంగా, పవిత్రతనంగా కనిపించింది. నాకేసి, నేను బాగా కనిపెట్టేటంత బాగా పరకాయించి చూచింది. నాకళ్లు ఆమెకళ్లతో కలిసేసరికి కొంచెం కంగారుపడింది. నన్నుగురించి అప్పగారితో ఏదో చెప్పింది. మళ్లీ నాకేసి చూసింది. నాకు వాళ్లని చాలాకాలంనుంచి ఎరిగున్నట్లే అనిపించింది. ఏదో చాలా సరదాగా వున్న కలలోనుంచి చటుక్కున మెలకువ వచ్చినట్లు తోచింది.

ఒకసారి నేనూ, సుందరం మాయింటిముందు పచారుచేస్తుంటే గుర్రపుబగ్గీ ఒకటి మాగేటులోనుంచి లోపలికి రావడం జరిగింది. అందులోనుంచి నే నిదివరకు చూచిన యిద్దరిలోనూ పెద్దపిల్ల దిగివచ్చింది. ఆ క్రితందినం పల్లెగూడెంలో అంటుకున్న యిళ్ల నష్టానికి పరిహారంగా చందా వసూలుచేయడానికి ఆమె వచ్చింది. ఎన్నియిళ్లు పోయినాయో, ఎంతమంది మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలూ బాధపడుతున్నారో, వాళ్లందరికీ తాను పనిచేస్తున్న కమిటీ ఏమేమి ఏర్పాటులుచేసిందో,యివన్నీ మా మొహంకేసి అయినా చూడకుండా గబగబా చెప్పేసింది. మా చేతికి చందా పుస్తకం యిచ్చింది. మా పేర్లు రాయగానే, అది తీసికొని మళ్లీ బండిలో పెట్టేసింది. వెళ్లిపోతూ, "నువ్వు నన్నుమళ్లీ పూర్తిగామరిచిపోయావు సుందరం! ఎప్పుడయినా వీలయినప్పుడు మాయింటికి ఒకసారి రా! నీతోపాటు మీ స్నేహితులు కూడా రాగలిగితే చాలాసంతోషం. వారి చిత్రాలు చూచి అభినందించే మాలాంటి మిత్రుల ఆహ్వానాన్ని అంగీకరించడానికి వారికి అభ్యంతరం లేకపోతేను." అంది.

నేను నమస్కారం చేశాను. ఆమె వెళ్లిపోయింది. "నీకు యీ అమ్మాయి ఎవరో తెలుసా" అన్నాడు సుందరం. "ఊహు" అన్నాను.

"ఈ పిల్లపేరు శాంత. వీళ్లది అసలు యీవూరే. వీళ్ల తండ్రి శేషగిరిరావుగారు హైకోర్టులో ప్రాక్టీసు చేస్తుండేవారు. ఆయన పోయినప్పటినుంచి యీ అమ్మాయి, తల్లి, చెల్లెలూ అంతా యిక్కడే కొన్నాళ్లనుంచి వుంటున్నారు. వీళ్ల తోటయిల్లు 'ఉదయప్రభాస'. అది మనం సాయంత్రం షికారు పోయే దారికేసి వుంది. ఈ అమ్మాయి బి. ఏ. పాసయింది. ఈ వూళ్లోనే స్కూలులో పనిచేస్తోంది. పాతికరూపాయలు జీతం. ఆమెకోసం అయ్యే ఖర్చు ఆమెసంపాదనలోనే యిమిడి వుండాలని ఆమె ఆశయం. సంఘసేవ చేయడం అంటే ఆమెకు అభిమానం. వాళ్లది మంచి సరదా అయిన కుటుంబం. నువ్వు కూడా వస్తే వాళ్లు చాలా సంతోషిస్తారు. మనం యిద్దరం ఎప్పుడయినా వెడదాం" అన్నాడు.

ఒక ఆదివారం మధ్యాహ్నం నేనూ, సుందరం 'ఉదయప్రభాస'కి వెళ్లాం. వాళ్లు అంతా యింట్లోనే

వున్నారు. వాళ్ల తల్లి రాజ్యలక్ష్మమ్మగారు యిది వరకు చాలా అందమయిన మనిషిగా వుండినట్లు కనిపిస్తుంది. ఇప్పుడు తన వయసుకుమించిన దేహం పెరిగిపోయింది. మనిషి లావుగా, బద్ధకంగా, మందమతిగా కనిపిస్తోంది. నే గీసిన బొమ్మలనిగురించి మాట్లాడడం మొదలుపెట్టింది. శాంత నే వస్తానని చెప్పగానే, ఆవిడ పట్నంలోనూ అక్కడా ఎగ్జిబిషన్లలో చూచిన చిత్రాలని జ్ఞాపకంతెచ్చుకొని, వాటిమీద నా అభిప్రాయాలు ఏమిటో ప్రశ్నించాలని ప్రారంభించింది. శాంత నా కేసి చూచీచూడనట్లు కూర్చుంది. సుందరంతోటే మాట్లాడుతోంది. వాళ్ల కమిటీ సంఘసౌకర్యానికి చేస్తావున్న పనులు, దాంట్లో తనయొక్క భాగం చెబుతూ "నువ్వు ఒక్కసారి అయినా మా మీటింగులకి ఎందుకు రాలేదు" అని అడుగుతోంది. "ఇది నీకు న్యాయంకాదు సుందరం! చాలా అన్యాయం. నువ్వు సిగ్గుపడవలసిన విషయం" అంటోంది అతన్ని తీవ్రంగా చూస్తో.

"నిజమే శాంతా! నిజమే" అంది రాజ్యలక్ష్మమ్మగారు. "ఇప్పుడు యీ వూరికి అధికారం అంతా వేంకటరెడ్డి చేతుల్లో వుంది. మన స్కూలులో, పంచాయితీలో, యితర గొడవల్లో యింకెవరికీ లోక్యం లేకుండా, తన అల్లుళ్లనీ, బావమరదులనీ దూరుస్తాడు. ఇది మనం అంతా తీవ్రంగా ప్రతిఘటించవలసిన విషయం. దీనికి యువకులు అంతా సిద్ధపడాలి. ముందుకు ఉరకాలి! కార్యరంగంలోకి దుమికి అహోరాత్రాలూ పనిచేయాలి" అంటోంది. "నీలాటి యువకులు యిళ్లల్లోనుంచి కదలకపోవడం ఎంత అవమానకరమయిన విషయం? ఆలోచించు ఒక్కసారి సుందరం!" అంది మళ్లాను.

ఈ సంఘసేవదీక్షనిగురించి జరిగే వాగ్ధోరణికి అడ్డురాకుండా లీల అలాగే కూర్చుంది. ఆమెకు యింత పెద్దపెద్దవిషయాలనిగురించి ఆలోచించే వయస్సు లేదని అభిప్రాయం ఆ యింట్లో. అలాంటివి ఆమెకు అనవసరం అని వాళ్ల వుద్దేశ్యం. ఆమెను పసిపాపలా చూస్తారు వాళ్లు. చిన్నప్పుడు ఆమెను 'బేబీ' అని పిలిచే అలవాటు యిప్పటికీ అలాగే నిలిచిపోయింది. ఆమె నాకేసి చిత్రంగా చూస్తోంది. నాతో మాట్లాడడానికి కుతూహలంగా వున్నట్లు కనిపించింది. ఆమె ఒడిలో ఒక ఫోటో ఆల్బమ్ పెట్టుకొని కూర్చొనివుంది. నేను ఆ ఆల్బమ్ కేసి చూసేసరికి నా దగ్గరగా జరిగింది. అది తీసి తన వేళ్లతో "ఇది మా నాన్న ఫోటో; ఇది మా బామ్మది; ఇది మా అక్కయ్య" అని చెబుతూంటే ఆమెనున్నని, గుండ్రటి, మెత్తటి భుజాలు నా ఒంటికి సుఖంగా తాకుతున్న మృదుస్పర్శలో నేను పులకించాను. ఆమెఅమాయికత నాకెంతో సుఖంగా, స్వప్నవీథిలా వుంది. నేను ఆమె తెల్లని, చక్కని చేతులు, ఆమె సన్నని పమిటలో, లేత గులాబీబ్లాజులలో పెరుగుతూ, దాగుడుమూతలాడే పొంగుతోన్న వయసుపొంగులు, లేతకంఠం, సన్నని నడుము– ఒకటొకటే పరిశీలిస్తూ నన్ను నేనే మరిచిపోతూన్నాను.

ఆమె రివ్వున లేచి కారమ్‌బోర్డు పట్టుకొచ్చింది. మే మిద్దరం కాస్సేపు ఆడుకొన్నాం. మమ్మల్ని టిఫినుకు హాలులోనికి రమ్మన్నారని నౌకరీ కుర్రాడు వచ్చి చెప్పాడు. మేము వెళ్లాం. అక్కడ శాంత, రాజ్యలక్ష్మమ్మగారు, సుందరం కూర్చున్నారు. మే మంతా కలిసి టిఫిను తీసికొంటున్నాం. శాంత ఆవూరి వేంకటరెడ్డినిగురించి, పల్లెవాళ్ల సౌఖ్యాన్ని గురించి, సదుపాయాలనుగురించి, స్కూల్లో పెట్టవలసిన లైబ్రరీనిగురించీ మాట్లాడుతోంది సుందరంతో. ఆమె గట్టిగా మాట్లాడినా, బాగానే మాట్లాడుతుంది. ఆమెకు ఆ విషయాలంటే అపరిమితమయిన యిష్టం వుంది. ఇక సుందరానికి, ఏ విషయం అయినా తెగూ తెంపూ లేకుండా రోజులకొద్దీ అలాగే మాట్లాడడం అలవాటు. అది కాలేజీలో చదువుకుంటున్న రోజుల నుంచీ వుం దతనికి. ఈ వేళ పోతుందా! ఆ కంగారులో తెల్లని టేబిలుగుడ్డమీద ప్లేటులో వేసిన చట్నీ సుందరం వలకబోశాడు. దానిపైకి తన ప్లేటు లాగి తినడం ప్రారంభించాడు. శాంత చూచీ చూడనట్లు ఊరుకొంది.

మేము యింటికేసి బయలుదేరాం. అప్పటి కప్పుడే చీకటిపడుతోంది. "పెద్దకుటుంబాలు, చదువుకున్న పిల్లలు అంటే అలా వుంటుంది. తను అంతసేపు నాకంటె బాగా మాట్లాడినా, ఏ ప్లేటూ పలకబోసి గుడ్డ పాడుచెయ్యకపోవడమే కాకుండా, నే నలా చేసినా తను ఎరుగనట్లు వూరుకొంది. నాకు అలాంటి వాళ్లు అంటే ఎంతో యిష్టం! వాళ్ల కుటుంబం చాలా గౌరవమయింది. నాకు ఎప్పుడూ అలాంటి కంపెనీలో వుండాలని వుంటుంది. కాని నాకు ఎన్ని యితర వ్యవహారాలు! తీరిక ఎక్కడ?" అంటూ వస్తున్నాడు సుందరం.

'వీడు శుద్ధచవట దద్దమ్మ' అని నేను లోపల అనుకున్నాను. వీడికి టైములేదూ? పనిలో మునిగి తేలి ఛస్తున్నాడా! జేబులో వున్న వుత్తరాలు మూడువారాలయినా పోస్టు బాక్సులో పడేయడే!

"నాకు తీరుబడి ఎక్కడ! అయినా నేచేసే పనికి గౌరవం వుంది. అభినందించే ప్రజ వున్నారు. పాపం, నీ మాట ఆలోచించు. నువ్విలా చిత్రాలు గీస్తూనేవుంటావు. ఎవరు చూచి ఆనందించను! నిన్ను అభినందించేవాళ్లు ఎవరున్నారు?" అంటూ నా పక్కనే నడుస్తూవచ్చాడు. ఎవరు అడిగారని యీ అభిప్రాయం!

౨

నే నప్పటినుంచి 'ఉదయప్రభాస'కి తరుచు వెడుతూండేవాణ్ణి. వెళ్లినపుడల్లా వరండాచీడీలమీద కూర్చునేవాణ్ణి. నా కేదో అసంతృప్తి. ఏదో ఆవేదన. నా జీవితం అంతా వ్యర్థంగా గడిచిపోతున్నట్లు భయం. నాలోనుంచి నాగుండెలని పీకుకొని పైకి పారవేయాలన్నంత కోపం. పైన డాబామీద మనుష్యుల మాటలు, చీరల గరగర, పేజీలు తిప్పిన చప్పుడు! నాకు శాంతతో షికారులు, జబ్బుచేసిన వాళ్లకి పరిచర్య, యియ్యవలసిన పుస్తకాల సంగతి చెబుతూంటే వినడం అలవాటయింది. ఒక్కొక్కసారి వర్షం వస్తే, ఆమెగొడుగులోనే వాళ్ల యింటికి తీసి కొనివెళ్లేది. ఆమెకు అంత దగ్గరగా నడుస్తుంటే ఆమె ఎర్రని పెదవులు, నాకు తగిలే మెత్తటి భుజాలు, ఆమె అందమయిన మొహం నన్ను కంగారుపెట్టి బాధించేవి. ఆమె ఏదో విషయాన్ని గురించి చెప్పబోతూ, "ఇది మీకు యిష్టంవుండదు. క్షమించండి" అని ఆగిపోయేది. నేను ఆమెఆశయాలకి అంతగా అభిమానం చూపించడం లేదని ఆమెకి లోపల నామీద కోపం. అదీగాక నేను చిత్రకారుణ్ణి. కేవలం నదులను, ఆకాశాన్ని, సూర్యాస్తమయాలను, సూర్యోదయాలనూ గురించి నే గీసే బొమ్మలు ఆ అమ్మాయికి ఎలా నచ్చుతాయి? వాటిలో ఆకలితో కృశించి నశించిపోయే మనుష్యులు వుండరు. జబ్బుచేసి మందుకోసం డబ్బులేక ఏడ్చే రోగులు కనిపించరు. పుస్తకాలకోసం దేవుళ్లాడే వ్యక్తులు అందులో వుండరు. ఇవి అన్నీ ఆమెకు యిష్టం. ఇవి నాబొమ్మల్లో ఎక్కడా వుండవు. అందుచేతనే ఆమెఆశయాలంటే నాకు గౌరవం లేదని ఆమె నమ్మకం.

చేబ్రీకి యిలాంటి బాధ లేవీ లేవు. నాలాగే ఆమె సుఖంగా కాలం గడపగలదు. పొద్దున్నే లేవగానే ఏదో పుస్తకం పట్టుకొంటుంది. ఆ పుస్తకం పుచ్చుకొని డాబామీదికి వెళ్లి అక్కడ కుర్చీలో కాళ్లు కిందకి ఆనకుండా కూర్చొని చదవడం మొదలు పెడుతుంది. లేకపోతే ఆ పుస్తకంతో నిమ్మచెట్లకేసి పోయి కూర్చొంటుంది. లేకపోతే గేటుదగ్గరనించి లోపలిదాకా చదువుతూ తిరుగుతూ వుంటుంది. చాలా ఓపికతో పొద్దున్నమంచి సాయంత్రందాకా అలా చదువుతూనే వుంటుంది. నన్ను చూడగానే కొంచెం సిగ్గుపడుతుంది. ఆ పుస్తకం ఎక్కడో పెట్టేసి నాదగ్గరగా వచ్చి తన పెద్దకళ్లతో నాకేసి ఆశ్చర్యంగా చూస్తో కూర్చొంటుంది. కొంతసేపు అయినాక, యీవేళ మా నౌకరు చెట్టుఆకులు కోస్తూ కాలుజారి క్రిందపడినాడనో, లేక వీధిలో నిన్న పల్లెవాళ్లకి చాలా పెద్దచేపలు దొరికాయనో చెబుతూంటుంది. ఆమే, నేనూ లేచి జామచెట్లకేసి పోయేవాళ్లం. ఆమె చక్కని చేతులని పైకి ఎత్తి జారిపోయే

పమిటకోసం కంగారుపడుతలా పళ్లుకోస్తుంటే, నేను ఆమెను చూస్తూ అలా నిలబడేవాణ్ణి. ఆమె పళ్లన్నీ పోగుచేసి నాదగ్గరికి తెచ్చేసరికి, నేను ఆమె స్కెచ్ గీస్తుంటే ఆమె వూపిరి పీల్చకుండా, నిశ్శబ్దంగా నావెనకాల నుంచుని అలా చూస్తూండేది. నేను వెనక్కి తిరిగేసరికి పకాలున నవ్వేది. ఆ బొమ్మలు ఆమె కిచ్చేవాణ్ణి.

నాకు పనీ పాటా ఏముంది? ఒకసారి పొద్దున్నే వాళ్ల యింటికి వెళ్లాను. నౌకరు "అమ్మగారూ, అమ్మాయిలూ అంతా డాబామీద వున్నారు. కాఫీ తాగేదాకా అక్కడే వుంటా"రని చెప్పాడు. నేనూ పైకి వెడదామని అనుకుంటున్నాను. నాకలాంటి సమయాలలో సరదాగా గడపడం అంటే ఎంతో యిష్టం. చుట్టూ అందంగా పూలతోట. మంచు బిందువులు ఆకులమీదనుంచి సూర్యకిరణాలకు కరగి కిందకి రాలి చిరుచప్పుడు చేస్తున్నాయి. లేతఎండలోని వేడిమి శరీరానికి సులువెచ్చగా తాకుతోంది. డాబామీద తీగలలోనుంచి కమ్మని జాజివాసన మత్తుగా వీస్తోంది. పైన మాటలు వినిపిస్తున్నాయి. వాళ్లు రోజూ అంతా అలాగే కబుర్లు చెబుతూ, ఏమీ పనిలేకుండా కాలక్షేపం చేసేయగలరు. వాళ్లకి యింకేమీ పనిలేదు. నాకూ లేదు. అలాంటప్పుడు అలాంటివాళ్లతో కలిసి సుఖంగా కాలంగడుపుతూ బతుకున్నాళ్లూ అలా వుండిపోతే బాగుంటుందని అనిపించదూ! నేను తోటలో అటూ యిటూ పచారు చేస్తున్నాను. ఒక పూలసజ్జ పట్టుకొని లీల పరుగెత్తుకొనివచ్చింది. నన్ను చూసింది. నవ్వింది. నేను దగ్గరగా వెళ్లాను. "పువ్వులు కోసుకొందాం వస్తారా మరి" అంది. మే మిద్దరం కావలసినన్ని పూవులు కోశాం. సజ్జ పట్టలేదు. "లీలా, నీ కొంగు పట్టు. నే కోసి అందులో వేస్తా"నన్నాను. ఆమె నా కతిదగ్గరగా తిరుగుతోంది. క్షణక్షణం ఆమె లేతబుజాల మెత్తదనం నా వంటికి ఏదో అపూర్వమయిన సుఖం కలిగిస్తోంది. ఆమె నన్ను ఏవో ప్రశ్నలు వేస్తోంది. నేను మాట్లాడుతోంటే నా ముందర నిలుచుని, నాకేసి తన నిగనిగలాడే కళ్లతో వింతగా చూసేది.

"నిన్న మా వూళ్లో ఒక తమాషా జరిగింది. ఎన్నాళ్లనుంచో జబ్బుతగ్గని ముసలమ్మకి ఎవరో ఒకడు మంత్రం వేస్తే చటుక్కున తగ్గిపోయిందట. ఎంత విచిత్రంగా వుందో చూశారా!" అంది.

"దాంట్లో బ్రహ్మాండం ఏముంది! నువ్వు విచిత్రమయిన విషయాలు చూడడానికి రోగిష్ఠి వాళ్లదగ్గరకి ఎందుకు వెడతావు? మనం అంతా ఆరోగ్యంగా వుండడం ఒక విచిత్రం కాదూ! మన జీవితం ఎంత విచిత్రమయింది! విచిత్రం అంటే మనకు అర్థంకాని విషయం అని ఎందుకు అనుకోవడం?"

"అయితే మరి మన కర్థంకాని విషయాలని గురించి మీరు భయపడరా?"

"ఊహూ! నేను నా కర్థంకాని విషయాలని ఎదుర్కొని చూడాలని అనుకుంటాను. నేను వాటికంటె గొప్పవాడిని. మనిషి సింహాలకంటె, పులులకంటె, నక్షత్రాలకంటె గొప్పవాడు. సృష్టిలో ప్రతి యితరవిషయానికీ అతడు అతీతుడు. నువ్వు అనుకునే విచిత్రమయిన విషయాలకంటె అతనే గొప్పవాడు. లేకపోతే చుంచులో చప్పుడయితే భయపడే ప్రతివాడూ మనిషి ఎలా అవగలడు?"

లీల నేను చిత్రకారుణ్ణి అవడమేకాకుండా యింకా యితరసంగతులు ఎన్నో తెలిసినవాణ్ణి అని అనుకొంది. నాకు సృష్టిలోని సౌందర్యం, ఆనందం, సత్యం, అమరత్వం అన్నీ తెలుసుననీ, తనకీ ఎలాగయినా అర్థం అయ్యేలాగ చేయమనీ నన్ను అడిగేది. నే నొక్కణ్ణే యిటువంటి సంగతులనిగురించి మాట్లాడగలిగినవాణ్ణని ఆమెకు నమ్మకం. నేను 'అది నిజమే' అన్నట్లుగా "మానవులకి అమరత్వం సహజలక్షణం. మనం ఎన్నడూ నశించని ఒక దివ్యజ్యోతిలోని అణువులం" అని చెబుతూండేవాణ్ణి. ఆమె నే చెప్పినవన్నీ వేదవాక్యాలుగా నమ్మేది. అవి నిజమేనా అన్న సందేహం ఎప్పుడూ ఆమెకు రాదు. మీరు చెప్పే విషయాలకి తార్కాణాలు వున్నాయా అని ఏ నాడయినా అడుగుతుందేమో అన్న భయం నాకూ లేదు.

మేము యింటి గుమ్మందాకా వచ్చాం. లీల చటుక్కున ఆగి "మా కాంత చాలా అద్భుతమయిన మనిషి. అది అంటే నాకు చాలా గౌరవం. దాని కోసం నా జీవితాన్నయినా అర్పించేస్తాను. కాని..." ఇంకా నా దగ్గరగా వచ్చి, నా షర్టుకఫ్స్ సర్దుతూ "నాతో చెప్పరూ! మా కాంతా, మీరూ ఎప్పుడూ అలా వాదించుకొంటూవుంటారేం? అది మాట్లాడుతూంటే మీరు చాలా చిరాకుపడుతున్నట్లు కనిపిస్తారు, అవునా!" అని అడిగింది.

"అవును. ఆమె మాట్లాడేదాంట్లో నా కేమీ అర్థం కనిపించదు మరి" అన్నాను నేను.

లీలకళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. 'ఇది నా కేమీ అర్థంకావడం లేదు' అనుకుంది.

ఇంతట్లోకే కాంత తొందరతొందరగా అటు వచ్చింది. తోటకేసి వెళ్లింది. పాలికాపుని పిలిచింది. ఏవో పనులు చేయాలని చెప్పింది. లోపలికి వెళ్లింది. డ్రాయర్లు అన్నీ తెరిచింది. ఎందుకో గబగబా సర్దింది. మళ్లా తీసింది. దేనికోసమో కొంతసేపు వెదికింది. మళ్లా వేసేసింది. చాలా పనితొందరలో వున్నట్లు హడావిడిగా తిరుగుతోంది. మే మంతా లోపల టిఫిను తీసికొంటున్నాం. కాఫీ తీసికొనే టైముదాకా తను రానేలేదు. ముఖ్యంగా గమనించదగ్గ సంగతు లేమీ జరగకపోయినా, యిలాంటివన్నీ పరిశీలిస్తుండడం నాకో అలవాటు. లీల మళ్లా యింకో పుస్తకం చదువుతూంది. నేను చీడీలమీద పైన విశాల మైన నీలి ఆకాశంలో పరుగులెత్తే మబ్బులని చూస్తూ కూర్చున్నాను.

రాజ్యలక్ష్మమ్మగారు విసుక్కుంటూ, ఒక విసనకర్రతో మే మిద్దరం కూర్చున్నచోటికి వచ్చి, ఆవులిస్తూ, బద్ధకంగా, నిద్రమొహంతో నిలబడింది.

"అమ్మా! పగలు నిద్రపోకూడదు. పడుకోకే!" అంది లీల.

లీలకు, తల్లికి పరస్పరం ఎక్కువ అనురాగం. లీల తోటలో తిరుగుతూవుండడం చూస్తూనే, "బేబీ, ఎక్కడున్నావ్" అని ఆవిడ కేకలేస్తోంటుంది. తల్లిని డాబామీద ఎదురుగుండా చూస్తూనే "అమ్మా, ఎక్కడా!" అంటూ కేకలు వేస్తోంటుంది లీలకూడా.

లీలలాగే ఆమెకూ నేనంటే అపరిమితమయిన గౌరవం. నేను నాలుగురోజులు వాళ్లయింటికి వెళ్లక పోతే, నాకోసం కబురంపించేది. "ఎందుచేత రాలేదు? వంట్లో బాగుంటోందికదా" అని అడుగుతూండేది. "మీరు బొమ్మలు ఎంతబాగా గీస్తారండీ" అంటూ మెచ్చుకుంటూండేది.

ఆవిడకి కాంత అంటే చాలా గౌరవం. మాటి మాటికీ "మా కాంత చాలా అద్భుతమయిన మనిషి" అంటూవుంటుంది. "ఈ పుస్తకాలు, మీటింగులు, సంఘసేవ అన్నీ బాగానేవున్నాయి. కాని, పెళ్లీడుపిల్ల యిక పెళ్లిచేసికొని స్థిరపడాలి మరి" అనేది ఆవిడ నవ్వుతూ.

"ఇప్పుడు ఎందుకూ ఆ గొడవ పోనిద్దూ" అని లీల మళ్లా తన పుస్తకం చదువుతూ కూర్చునేది.

నే నింటికి వెళ్లాను. ఇంటిదగ్గర సుందరం మొహం! ఆకాశం అంతా విరిగి మీదపడినట్లు కూర్చున్నాడు. ఏదో మాట్లాడతాడు. ప్రపంచకానికి ఏమీ విముక్తి లేదన్న ధోరణి. కొన్ని వేల మైళ్లపొలదీ నిర్మానుష్యమయిన సహారా ఎడారి అయినా సుందరం మొహంకంటె ఎక్కువ విసుగూ, నిరాశా కన్పించ లేదనే నా వుద్దేశ్యం. తను ఏదో చెబుతాడు. ఏమంటావు అని అడుగుతాడు. అతని సిద్ధాంతాలమీద ఒక అభిప్రాయంకూడా ఏమిటి నాతలకాయ అని అనుకున్నాను.

"నాటికి తొంభైతొమ్మిదిమంది బుద్ధిలేని చచ్చుపీనుగులు అని అనుకుంటాను నేను" అన్నాను అతివిసుగుగా.

ఇది నేను అతన్ని గురించే అన్నట్లుగా అనుకొని చాలా చిన్నబుచ్చుకొన్నాడు.

3

నేను ఒకసారి రాజ్యలక్ష్మమ్మగారితో మాట్లాడుతూ కూర్చున్నప్పుడు శాంత గబగబా అక్కడికి వచ్చింది. "ఈ వేళ పిచుకలజమీందారు యిక్కడికి వచ్చారు. ఈ వూళ్లో హాస్పిటలుసంగతి ఆయనతో మాట్లాడాను. ఆయనకూడా ఆలోచిస్తా నన్నారు. కాని ఆయనమీద నాకు అంతగా ఆశ లేదు" అని చెబుతూ నాకేసి చూచి "క్షమించండి. మీ కిలాంటి విషయాలలో ఆదరంలేదన్న సంగతి నేను మరచి పోతూంటాను" అంది.

నాకు కొంచెం చిరాకుగానే వుంది యీ పరిస్థితి. "ఎందుచేత? నే నెలా అనుకుంటేమాత్రం మీకు మునిగిపోయింది ఏ ముంది? నే నేమని అనుకున్నా మీరు లెక్కచేయరుగా" అన్నాను.

ఆమె నాకేసి ప్రశ్నార్థకంగా చూసింది. "ఈ వూళ్లో ఆసుపత్రికి ఏమీ అవసరంలేదనే నావుద్దేశ్యం" అన్నాను నేను.

ఆమెకు ఒళ్లు మండిపోయింది. నాకేసి యీసడించిచూస్తూ "మరేం కావాలి? బొమ్మలు గీసిన పటాలు కావాలా?" అంది.

"అవీ అక్కర్లేదు. ఏమీ అక్కర్లేదు."

ఇంక ఆమె నాతో ఏమీ మాట్లాడలేదు. ఏమీ మాట్లాడలేకపోయింది కోపంతో. అక్కడ వున్న పేపరుతీసి చదవడం మొదలుపెట్టింది. ఒక నిముషం ఆగి, "పాపం, పెంటి నీళ్లాడలేక బాధపడి చచ్చిపోయిందట. ఇక్కడ ఒక హాస్పిటలయినా వుంటే బతికేదేమో! అయినా చిత్రకారులు యిలాంటి వుపద్రవపు విషయాలనుగురించి అయినా అనవసర మయినవిగానే అనుకోవచ్చు." అంటోంది.

"నేను నా వుద్దేశ్యం చెబుతాను వినండి. నాకు యీ హాస్పిటళ్లవల్ల, లైబ్రరీలవల్ల, స్కూళ్లవల్ల ఏమీ వుపయోగం వున్నట్లు కనిపించదు. ఇవన్నీ మన పరిస్థితులని యింకా అధమంగా చేయడమేగాని బాగు చేస్తాయని నేను అనుకోను."

ఆమె నాకేసి చూచి వెగటుగా నవ్వింది. నేను లెఖ్ఖచేయకుండానే యిలా మొదలుపెట్టాను: "ఒక వెంకమ్మో, పెంటమ్మో పురిటింట్లో నెప్పులుపడలేక యిబ్బందిపడి చనిపోయిందంటే విచారించవలసిన పని లేదు. ఇలాంటివాళ్లు కోట్లకొలది ప్రజ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా పనిచేసి చేసి, ఆయాసంతో అలసిపోయి, విశ్రాంతి లేక, తినడానికి తగిన తిండిలేక, మలమలమాడే పిల్లల దుస్థితి చూడలేక, యీ ఆవేదనలతో, ఆదుర్దాలతో యౌవనంలో సుఖాన్ని ఎరుగక, పడుచుతనంలోనే వృద్ధాప్యంలోని వ్యసనంతో క్రుంగిక్రుంగి నశించే దరిద్రపరిస్థితులు ఎంత ఘోరంగా వున్నాయి. కోట్లకొలది ప్రజల జీవితాలు పశువులజీవితాలకంటె ఎన్నోరెట్లు అధమంగా వున్నాయే! ఒక్కపూటయినా పూర్తిగా తాగడానికి గంజిమెతుకులు లేక ఆకలితో అలమటించిపోయి హరించిపోతున్నారు. దరిద్రం, భయం, కూలికి బత్తెం చాలని వెట్టిచాకిరి-పీటితో ఎంతమంది ప్రజల్ని మన సంఘంలో మృత్యుదేవత కడుపునపెట్టుకుంటోందో ఆలోచించారా? ఈ పరిస్థితులలో మానవత్వాన్ని గురించీ, దైవత్వాన్ని గురించీ ఆలోచించే సావకాశం వాళ్లకి వుంటుందని మనం అనుకోగలమా? వాళ్లకీ, పశువులకీ తేడా ఏమిటి? వాళ్లకి ముందర తినడానికి తిండిలేక ఛస్తోంటే నీవు స్కూళ్లు, హాస్పిటళ్లు పెట్టి డబ్బు తెచ్చుకోమంటే వాళ్లు ఎక్కడనుంచి తెచ్చుకుంటారు? దానికోసం వాళ్లు పడుతోన్న బాధలు కాక, యింకా ఎక్కువబాధ పడాలనా మీ వుద్దేశ్యం?"

"నేను మీతో వాదించదలచుకోలేదు. కాని ఒక విషయం చెప్పదలచుకొన్నాను. (పేపరు కింద పెట్టి) మనం చేతులుకట్టుకొని కూర్చొనిమాత్రం ప్రయోజనం ఏమిటి? చదువుకున్నందుకు సార్థకంగా సంఘానికి వినియోగించే పని ఏదయినా చేయాలి. అందులో మన తోడిమానవులకి తోడ్పడడంకంటె మహోత్కృష్టమయిన కార్యం యింకోటి వుందని నే ననుకోను. దానికోసం మనకు ఎంతవరకు ఓపిక వుంటే

అంతవరకూ చేయవలసిందనే నా అభిప్రాయం. అది మీ కిష్టంవుండదు అని నాకు తెలుసు. కాని ప్రతీ వాళ్లకీ నచ్చేలా పనిచెయ్యడం అసాధ్యం."

"నిజమే శాంతా! నిజమే" అంది రాజ్యలక్ష్మమ్మగారు.

శాంతముందర ఆవిడకు ఒక విధమయిన భయం. తనేమన్నామాట్లాడితే అదేమయినా తెలివితక్కువగానో, అవకతవకగానో కనిపిస్తుందేమోనని ఏమీ తెలకుండా 'నిజమే శాంతా! నిజమే' అన్నమాట ఒకటే అంటూంటుంది ఆవిడ.

"ఈ వూళ్లో వున్న రైతులనందరినీ పిలిచి వాళ్లకి యీ అచ్చుకాగితాలు పంచిపెట్టినంతమాత్రంలోనూ, ఒక డాక్టరుని యీ వూరికి పిలిచినంతమాత్రంలోనూ వాళ్ల సమస్యలన్నీ తేలిపోవు. నీ గదిలో లైటు వెనున్న తోటలోకంతా కనిపించనట్లే. నీవు చేసేది వుపకారం కాదు సరిగదా వాళ్లని యింకా ఎక్కువ పనిచేయించే పరిస్థితులు ఏర్పరచడం" అన్నాను.

"అబ్బ! భగవంతుడా! ఇదేమిటి! కాని ఏదో ఒకటి చేయాలనే నే నమకుంటానండి" అంది గట్టిగా. దానితో నేనంటే ఆమెకు పరమఅసహ్యంగా,విసుగ్గా వున్నట్లు పూర్తిగా ధ్వనించింది.

"మొదట వాళ్లు ఎడతెరిపిలేకుండా రాత్రింబవళ్లూ చచ్చే యీ పనిలో నుంచి కొంత విరామం కలిగించే పరిస్థితులు ఏర్పరచాలి. ఆ విశ్రాంతిలో వాళ్లు వాళ్లసంగతిని గురించి ఆలోచించుకొనే పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడే వాళ్లకి దేవుడూ, దయ్యం అని ఆలోచనలు పుడతాయి. లేకుండా ఎందుకొచ్చిన యీ అచ్చుకాగితాలు, ఎందుకొచ్చిన యీ గందరగోళం యిదంతానూ!" అంటున్నాను.

"ఊహూ! వాళ్లకి పని ఏమీ లేకుండా చేయాలిట! ఇది సాధ్యం అయే పనేనా?" అంది శాంత.

"ఎందుకు కాదు? నువ్వుకూడా వాళ్లతోపాటు కలిసి పనిచేయడానికి సిద్ధపడిననాడు, అంతా కలిసి పనిచేసేనాడు, రోజుకి ఎవరూ రెండు మూడు గంటలకంటె ఎక్కువ పనిచేయవలసిన అవసరం వుండదు. అప్పుడు ఎవరికీ బడలిక వుండదు. అందరి ఆరోగ్యాలూ సవ్యంగానే వుంటాయి. అందరికీ తిండి వుంటుంది. ఎవరికీ ఆకలి వుండదు. అప్పుడు హాస్పిటలు అవసరం లేదు. అంతా సావకాశంగా ఎవళ్లమాట వాళ్లు ఆలోచించుకోవచ్చు.

నే నిలా మాట్లాడుతోంటే లీల అక్కడికి వచ్చి కూర్చొని వింటోంది. శాంత వెంటనే "లీలా! నువ్వు లోపలికి పోయి చదువుకో" అంది చంటిపిల్లలని కసిరినట్లు. లోపల లీల యీవిషయాలన్నీ విని ఏమి పాడయిపోతుందో అన్న భయంతో.

శాంతకి నాతో మాట్లాడడం పూర్తిగా విసుగెత్తింది. రాజ్యలక్ష్మమ్మగారితో జవిూందారు సంగతి, హాస్పిటలు వ్యవహారాలూ మాట్లాడడం ప్రారంభించింది. నేను శెలవుపుచ్చుకొని యింటికేసి బయలుదేరాను.

అప్పుడే రాత్రి చాలా పొద్దుపోయింది. వాతావరణం అంతా ప్రశాంతంగా వుంది. తోట, తోటమాలీలు అంతా నిదురపోతున్నారు. నేను గేటుదగ్గరకి వచ్చేసరికి నన్ను సాగనంపడానికి లీల అప్పుడే అక్కడికి వచ్చి నిలబడివుంది.

"వూరంతా అప్పుడే మాటుమణిగిపోయింది చూశావా!" అన్నాను నేను ఆమెముఖంలోకి చూడాలని. ఆమె నిగనిగలాడే తన చక్కని పెద్దకళ్లతో నాకేసి పూర్తిగా చూస్తోంది. "అంతా సుఖంగా నిదురపోతుంటే, చీకూ చింతా లేకుండా, మనకు అనవసరమయిన విషయాలనిగురించి మనం దెబ్బలాడుకుంటున్నాం" అన్నాను. లీల వూరుకొంది.

ఆ రాత్రి చలిగా విసుగ్గా వుంది. వెన్నెల బాగా రాలేదు. ఎక్కడో మబ్బులవెనకాల చంద్రుడు దాగుడుమూతలాడుతున్నాడు. మబ్బుసందులలోనుంచి తప్పించుకువచ్చిన వెలుతురు కిరణాలు అక్కడక్కడ రోడ్డుమీద మెరుస్తున్నాయి. దూరంలో ఆకాశం

నుంచి నక్షత్రాలు కిందకి రాలుతున్నాయి. లీల నాతో నడిచివస్తోంది నా ప్రక్కనే.

"మీరు చాలా బాగా మాట్లాడతారు. మీరు చెప్పే విషయాలు నాకు బాగా నచ్చుతాయి నిజంగా" అంది చలితో వణకుతూ.

"మరి ఏమిటి అనుకున్నావు! మనం అంతా అసలు నిజంగా మానవత్వంయొక్క అర్థాన్ని అవగాహనచేసికోడానికి ప్రయత్నించడంలోనే సాధనకి అర్థం వుంది. అది ప్రతిభాశాలికి సహజలక్షణం" అన్నాను.

మేము అప్పుడే చాలాదూరం వచ్చేశాము. లీల వెనక్కి తిరిగి చూచింది. "క్షమించండి. చాలా దూరం వచ్చేశాము. యింక పోతాను మరి" అంది. ఆ చలిలో ఆమె గజగజ వణకిపోతోంది. ఆమె చక్కని దంతపుభుజాలమీద వుల్లిపొరలాంటి జార్జిట్ కండువా, వొంటిమీద ఉండీవుండనట్లున్న లేతనీలి బ్లౌజూ మతిపోయినట్లు చూస్తూ నిలుచున్నాను ఆమె దగ్గర. "రేపు తప్పకుండా వస్తారుకదూ!" అంది. ఆమె కళ్లలో ఏవో వెలుగులు మెరిశాయి.

ఆమె వెళ్లిపోతే నే నెలాగ? నన్నేదో హఠాత్తుగా పెద్ద బ్రహ్మాండమయిన ఒంటరితనం ఆవరించినట్లు అనిపించింది. "కొంచెంసేపు ఆగవూ!" అన్నాను. ఆమెకు నేనంటే ఎంతో ప్రేమ, గౌరవం వున్నాయని నా వుద్దేశం. ఆమె ఎంత చక్కనిపిల్ల! అతి నాజూకయిన ఆమె ముఖము, ఆ అందమయినకళ్లు, నున్నని భుజాలు...... ఆమె తెలివి! చురుకుతనం! ఆమెకు చక్కని పరిజ్ఞానం వుందని నాకు గౌరవం. ఆమె నా రాణీ! నా చిత్తరువు లన్నీ ఆమెకే అంకితాలు. ఆమె లేని ప్రపంచకం నాకు అంధకారం, అమావాస్య. ఆమె వెళ్లిపోతే నే బతికేది ఎలాగ?

"నువ్వు చాలా మంచి అమ్మాయివిట! ఇంక కొంచెంసేపు ఆగుతావుకామా నా కోసం" అన్నాను నవ్వుతూ.

ఆమె నాకేసి చూచి విచిత్రంగా నవ్వుతుంది. ఆమెకళ్లల్లో వెలుగులు మిలమిల మెరిశాయి. "ఇంకా ఎంతసేపు చెప్పండి. చాలా చలిగావుంది!" అంది. ఆమెపెదవులు చలికి తడబడుతున్నాయి. వణకుతూ వున్న ఆమె లేతభుజాలకి నా కోటు విప్పి కప్పాను. లీల పకపక నవ్వింది. అది తీసివేయబోతోంది. వెంటనే చటుక్కున ఆమెను నాదగ్గరగా లాక్కొన్నాను. ఆమె భుజాలని, ముఖాన్ని, చేతులని, ఆమె లేత పెదవులనీ ఎన్నిసార్లో ముద్దుపెట్టుకున్నాను. ఆమె నాచేతుల్లో నలిగిపోతోందేమో నని భయం. కాని ఆమెను వదలలేకపోతున్నాను.

"ఇంక ఇక రేపటిదాకా........." అంది ఆమె అతినెమ్మదిగా నన్ను విడిపించుకుంటూ. నేను యింకా దగ్గరగా తీసికొన్నాను. నా కంఠం గట్టిగా కౌగిలించుకొంది. ఆమెచేతులు తీగల్లా నా నడుముకి, మెడకి పెనవేసికొన్నాయి. "మనలో మనకి రహస్యాలేమిటి? అమ్మతో చెబితే అమ్మ చాలా సంతోషిస్తుంది. కాని శాంత...శాంత కోప్పడుతుంది" అంది.

నేను యింకొకసారి చురుకుగా ముద్దుపెట్టుకొన్నాను. నన్ను గిల్లి విడిపించుకొని పారిపోయింది. కొంతదూరం పరుగెత్తి వెనక్కి తిరిగిచూచింది. "రేపు తప్పకుండారండి" అని మళ్లా చేతితో సంజ్ఞ చేసింది. మళ్లీ లేడిపిల్లలా పరుగెత్తుకొనిపోయింది. . నా కింటికి వెళ్లాలని అనిపించలేదు. వెళ్లిమాత్రం ఏం చెయ్యను? ఎవరికోసం వెళ్లను? నా కాళ్లు నన్ను నెమ్మదిగా డాబాకేసి లాగుకొనిపోయాయి. డాబామీదకి పోతే జాజితీగల్లో సన్నజాజులు నన్ను చూచి నవ్వినట్లుగా ఘుమఘుమలాడేయి. నేను తిన్నగా గేటులోనుంచి లోపలికి నడిచిపోయాను. పక్కనున్న టెన్నిసుకోర్టు దగ్గర వున్న బల్లమీద పోయి కూర్చున్నాను. లీల గదిలో యింకా లైటు వెలుగుతూనేవుంది. గోడల మీద నీడలు కదులుతున్నాయి. లైటుషేడు తిప్పిన చప్పుడు. పేజీలు తిప్పుతోన్నట్లు ధ్వని. లీల ఎందుకయినా వరండామీదికి వస్తుందేమోనని అలాగే కూర్చున్నాను. ఒక గంటసేపు అయింది. దీపం ఆరిపోయింది. ఇక నీడలు కనిపించడంలేదు. చంద్రుడీసారి పైకి బాగా వచ్చాడు. తోట అంతా వెన్నెల

పండువుగా వుంది. అరవిరుస్తోన్న గులాబులు కమ్మగా వాసనవేస్తున్నాయి. చలి ఎక్కువ అవుతోంది. నాకోటు తొడుగుకొని యింటికి బయలుదేరాను.

మరునాడు మధ్యాహ్నం యథాప్రకారం 'ఉదయప్రకాశ'కి వెళ్లాను. తలుపులన్నీ తీసేవున్నాయి. మామూలు అలవాటు ప్రకారం చీడీలమీద కూర్చున్నాను. ఏ చెట్లచాటునుంచయినా, ఏ తీగెల వెనకాలనుంచయినా పుస్తకం పట్టుకొని లీల వస్తుందేమోనని చూస్తున్నాను. ఎంతసేపటికీ ఎక్కడా చడీ చప్పుడూ లేదు. లోపలికి వెళ్లాను. ప్రతిగదీ చూస్తున్నాను.

"పక్క నీటిలో తన నీడను...నీడను... చూచెను...పక్క... నీటిలో...తన..."అని శాంత పాఠంచెబుతోంది ఎవరికో. నా అడుగులచప్పుడు వినగానే ఆగి "ఎవరు వారు ?" అంది.

"నేను" అన్నాను.

"అలాగా ! క్షమించండి ! నే నిప్పుడు వెంటనే వాలేను. కొంచెం తొందరపనిలో వున్నాను" అంది.

"సరేలెండి. మీఅమ్మగారు ఎక్కడున్నారు?" అన్నాను.

"లేరు. మా అమ్మ, మా లీల మా పినతల్లిగారింటికి వెళ్లారు. అక్కడనుంచి వాళ్లు చెన్నపట్నం వెడతారు. ఇప్పుడప్పుడే తిరిగిరారు..........పక్క నీటిలో.........తననీడను.........." అని మళ్లా చెప్పడం ప్రారంభించింది.

నేను సావడిలోకి పోయి నిలుచున్నాను. నాకు ప్రపంచం అంతా ఖాళీఅయిపోయినట్లు అనిపించింది. ఆ తోటా, ఆ డాబా, ఆ వూరూ అన్నీ చిరాకుగా కనిపిస్తున్నాయి. నాకు వుక్కపోస్తున్నట్లుంది.

"పక్క నీటిలో......నీటిలో... తన నీడను ...." ఇంకా వినిపిస్తూనే వుంది.

నేను యింటిమొగం పెట్టి బయలుదేరాను. గేటు మళ్లే సరికి ఒక కుర్రాడు పరుగెత్తుకొని వచ్చి నా కొక చీటీ యిచ్చి పారిపోయాడు.

"నేను శాంతతో రాత్రి జరిగిందంతా చెప్పాను. దానికి చాలా కోపం వచ్చింది. వెంటనే తక్షణం నేను మీకు కనిపించకుండా వెళ్లిపోతేనేగాని వీలు లేదని పట్టుపట్టింది. నేను విధిలేక మా అమ్మతో పోవలసివచ్చింది. నేను ఎంత ఏడ్చానో మీ కోసం మీకు తెలుస్తే! నే నెప్పుడూ మీసుఖాన్నే కోరుతూ వుంటాను. నన్ను మరిచిపోకండేం!"

మళ్లీ అదేదారి మా యింటికి. అంతా ఖాళీ. లోకం అంతా ఖాళీ. నేను అంత తెలివితక్కువగా అక్కడ మాట్లాడడంవల్ల వచ్చింది యీ ముప్పు అని పశ్చాత్తాపపడ్డాను. ఇప్పు డిక ఏమి అనుకుంటే ఏం లాభం. యింటికి వెళ్లాను. మూటా ముల్లా కట్టాను. సాయంత్రం మా వూరికి ప్రయాణం.

కొన్నాళ్లకి ఆ తోట, డాబా అన్నీ మరిచిపోతున్నాను. కాని అప్పుడప్పుడు చదువుకుంటుంటే ఏమీ కారణం లేకుండానే ఆ కిటికీ, గదిలో లైటు, గోడమీద నీడలు, నే నతినెమ్మదిగా లీలగదిలోకి నడిచిన నా అడుగులచప్పుడు అంతకుముందటి సంఘటనలో నా లీలా, ఆమె నిగనిగలాడే కళ్లల్లోని వెలుగులు, ఆ అమాయికపునవ్వూ, లేతభుజాలూ, మెత్తటి తీయని పెదవులూ, అన్నీ ఒకటొకటే జ్ఞాపకం వస్తుంటాయి. బహుశా నేనూ యిలాగే జ్ఞాపకంవుంటున్నానేమో ! నా కోసం లీలకూడా యిలాగే బాధపడుతోందేమో !

"లీలా ! ఎక్కడున్నావ్ !"

విశ్వం పెళ్ళి

[నాటకము]

=శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి=

౧-వ అంకం

[విశ్వేశ్వరరావుగృహం. విశ్వేశ్వరరావు మోటారు డ్రైవరు సింహాచలం పాడుకుంటూ బిల్ల నవిరిస్తూవుంటాడు.]

సింహా—రాదే చెలీ....నమ్మరాదే చెలీ....

విశ్వం—ఎవరిని నమ్మకూడ దంటావు సింహాచలం?

సింహా—ఏంలేదు. బాబూ.

విశ్వం—నన్నుకూడా తెలుసుకోనీ నీ రహస్యం కొంత. ఎవరైనా నిన్ను....

సిం—సినీమాపాట బాబూ.

విశ్వం—సినీమాల వ్యామోహం ఇంకా పోలేదు నీకు.

సిం—ఆట మారినప్పుడల్లా యెళుతూనేవున్నాను బాబూ.

విశ్వం—ఆరి పిడుగా! అయితే నీ జీతమంతా సినీమాలకిందే ఖర్చు.

సిం—సినీమా కెంతోటి కావాలి! బేడ్డబ్బు లెడితే కెంచి.

విశ్వం—రెంటు రూపాయలు వొదిలించుకుంటేనే గాని నాకు సినీమా చూడ్డం పడదు. సినీమాకి వెళ్లినా పక్కవాడితో బాతాఖానీయే ఎక్కువ. ఫిలిముచూడ్డం తక్కువే! మొత్తంమీద ఫిలిములన్నీ మీరే బాగా చూసి ఆనందిస్తారు. ఒక్క తమాషా కనిపెట్టావ్ సింహాచలం! ఇది ప్రజాస్వామిక యుగం. కళ అంతా సినీమాద్వారానే ప్రచారమవుతోంది. కనక మీరే కళలని పోషిస్తున్నారు.

సిం—తమాషా తమరు చెప్పడంలో వుంది.

విశ్వం—కానేకాదు. సినీమాలవల్ల మన సంఘంలో కలిగిన గొప్పమార్పు కనిపెట్టావా?

సిం—లేదు బాబూ!

విశ్వం—నువ్వు నౌకరువి: నేను యజమానిని. అయినా మన మిద్దరమూ సమానహోదాలో సినీమానిగురించి చర్చించుకోగలము! జట్కాబండీలో ఎక్కానసుకో. బండీవాడికీ. నాకూ సినీమాపేరు చెప్పి అరనిమిషంలో స్నేహమవుతుంది. ఇది సాంఘికవిప్లవం కాదూ? మరే విషయం కదుపు. అన్నీ విభేదాలే! వీడు ధనికుడు: వాడు బీద. వీడు గాంధీగారి శిష్యుడు! వాడు గవర్నమెంటుబంటు. వీడు కమ్యూనిస్టు: వాడు సోషలిస్టు. వీడు బ్రాహ్మడు: వాడు శూద్రుడు. వీడు మాల: వాడు మాదిగ. వీడు వైదీకి: వాడు నియోగి! సినీమా కొచ్చేటప్పటికి మాత్రం మనం అందరమూ నోరెళ్లబెట్టుకు చూసే ప్రేక్షకులం.

సిం—సినీమాలోనూ కొట్లాటలు రావు మరీ! ఓడికోఅట నచ్చు: మరోడి కది గిట్టదు.

విశ్వం—అదంతా వ్యక్తిగతాభిప్రాయాలు సింహాచలం! కాంగ్రెస్‌పార్టీ ఒకటైనా అందులో కుళ్లి బ్రాహ్మలూ అబ్రాహ్మలూ. కమ్మ కాపూ కొట్టుకుని పైకి రావాలని చూస్తున్నారా? కాని "పుష్పమాల" ప్రేక్షకవర్గంలో బ్రాహ్మణశిష్యులనీ. అబ్రాహ్మణ శిష్యులనీ కొట్టుకుంటున్నారా? పుష్పమాలంటే జ్ఞాపకమొచ్చింది. ఈమధ్య దాని కేదో పిచ్చెక్కిందన్నారు. నిజమే?

సిం—పిచ్చికాదు బాబూ! వుంచినోడు పోయాడుట. అతగా డంటే వొల్లమాలిన యిష్టంట! యికారంచేత కుంగిపోయిందిట.

విశ్వం—అదా సంగతి? ఈప్రేమంతా సినీమాలోనే అనుకున్నాను. పైన మనకీ అంటుకుంటోంది. మన అరవిందంగా డొకడు! కౌముదిమీద తెగ పద్యాలూ. పాటలూ రాసేస్తున్నాడు.

సిం—కౌముదమ్మగారు బలే చలాకీమనిషి బాబూ. అరవిందంబాబుని....

విశ్వం—నానుస్తున్నావేం? పెళ్లి చేసుకోదంటావా ఏమిటి కొంపతీసి? చేసుకుంటుందిరా! చేసుకుంటుంది.

సిం—నాకేదో....

విశ్వం—నువ్వు గట్టిగా అనకురా! ఇప్పుడు వాక్శుద్ధి అంతా మీలో వుంది. నువ్వు గట్టిగా అంటే అది కాస్తా నిజమైపోయి పూరుకుంటుంది.

(పైనించి తలుపుకొట్టిన చప్పుడు)

విశ్వం—ఎవరో వొచ్చినట్టుంది. చూడు.

(సింహాచలం పైకి వెళ్లిపోతారు. కరుణాకరం లోపలికి ప్రవేశిస్తాడు. కరుణాకరానికి ఇరవై ఏ ళ్లుంటాయి.)

విశ్వం—కూచోండి. మిమ్మ ల్నెక్కడా చూసిన జ్ఞాపకం........

కరు—లేదండి. చూడలేదు. నాపేరు కరుణాకరరావు. మొన్ననే బి. యల్. పాసయాను. ఇహ ఇల్లు కట్టాలి.

విశ్వం—తల్లితండ్రులు నిలవేసిన ఆస్తి చాలా వుందా యేమిటి?

కరు—ఏం అలా అడిగారు?

విశ్వ—రేపు భుక్తి ఎలా గడుస్తుందనేవాళ్లు ప్లీడరీ ప్రారంభించి లాభం లేదుగా....నువ్వు మాసంఘంలో వాడివేనా?

కరు—మీసంఘమంటే?

విశ్వం—సోమరి ధనికుల సంఘం.

కరు—(నవ్వుతూ) అన్నమాటే.

విశ్వం—ఏంపనిమీద వొచ్చినట్టు?

కరు—అట్టే పనేమీ లేదండి. మీరు ఉషని ఎరుగుదురుగా! ఇక్కడి కొచ్చిందేమో కనుక్కుందామని.

విశ్వం—ఉషా? ఇక్కడి కెందు కొస్తుంది? వొస్తానందా?

కరు—లేదండి.

విశ్వం—మరి?

కరు—వూరికే కనుక్కుందామనే వొచ్చానండి.

విశ్వం—నన్ను నమ్మమనేటయ్యా నీ వుద్దేశం? కారణం లేకుండా ఉష ఇక్క డుంటుం దనుకోడానికి నువ్వేమైనా వెర్రివాడివా? అసలు సంగతి చెప్పు. ఉషని నువ్వు ఎలా ఎరుగుదువు?

కరు—మా కాలేజీలో చదువుకుంది.

విశ్వం—ఉషమీద పద్యాలూ, పాటలూ ఏమన్నా వ్రాశావా ఏమిటి?

కరు—నాకు కవిత్వం రాదండి.

విశ్వం—ప్రాణా లివ్వడాని కిసిద్ధంగా ఉన్నట్టు వచనంలోనైనా చెప్పుకున్నావా?

కరు—ఉషని నేను మనసారా ప్రేమిస్తున్నా.

విశ్వం— అయిందీ! నే నొక్క సలహా చెబుతాను విను! సమయం మించిపోక మునుపు విరమించుకో! ఉషమీద ఆశ పెట్టుకు తిరిగి లాభం లేదు. అనవసరంగా ఎందుకు చిక్కులో పడతావు?

కరు—కారణ మడగొచ్చునాండి!

విశ్వం—అడక్కూడదు. అదింకా రహస్యం. అయినా ఎవరితోనూ చెప్పనంటే నీ ఒక్కడితోనూ చెబుతాను ఆ రహస్యం.

కరు—ఎవరితోటీ చెప్పను. భగవంతుడి సాక్షిగా చెబుతున్నా!

విశ్వం—నీ కా భగవంతుడి సాక్ష్యంకూడా ఎందుకు? నీమాట చాలదూ? నీ మాటలో నీకే విలవలేక, వారినీ వీరినీ సాక్ష్య మేసుకుంటానంటే, ఇతరు లేం నమ్మగలరు?

కరు—నా వుద్దేశ మదికాదండీ!

విశ్వం—మనసులో వుద్దేశ మొకటీ: పైకి చెప్పే దొకటీ. ఇదేగా నాగరికత అంటే! ఈరహస్యం మాత్రం మరెవరితోనూ అనకు. ఉషకి పెళ్లయిపోయింది.

కరు—(ఆశ్చర్యంతో) పెళ్లయిపోయిందా? ఎప్పుడు?

విశ్వం—ఏమో! ఎప్పుడో!

కరు—భర్త పే రడగొచ్చునా?

విశ్వం—అడగొచ్చును గాని, చెప్పడానికి మా కెవరికీ తెలీదు. అదే రహస్యం. నువ్వు ఉషని పెళ్ళాడదామనే అనుకున్నావన్నమాట.

కరు—కొంత ఆశపడ్డాను.

విశ్వం—నువ్వింకా కుర్రాడివి. ఒక్క సంగతి నేను అనుభవంమీద చెబుతున్నా విను. ఎప్పుడూ ఏ ఆడదాని మాటా నమ్మకు. నమ్మావా, మహా సుడిగుండంలో పడిపోతావు.

(అంటూవుంటే ఉష లోపలి కొస్తుంది.)

విశ్వం—(ఉషతో) వొచ్చావూ? నీ కోసమే ఇందాకటినించీ పలవరిస్తున్నాడు. ఇహ అట్టే ఏడిపించక. దబ్బున పీడొక్కలు ఇచ్చేసి పంపించెయ్యి. పరస్పర నిందలూ, విచారాలూ ఏమీ ప్రయోజన ముండదు. తెలిసిందా? మీ మాట లయిపోయిన తరవాతగాని, ఈలోపుగా నాసలహా అవసర ముంటేగాని, పిలవండి. (అని ఎవరూ జవాబు చెప్పడానికి వీలులేకుండా త్వరగా వెళ్లిపోతాడు.)

ఉష — మెట్టవేదాంతం మొదలెట్టావా? ఎంతసే పయింది నువ్వొచ్చి?

కరు—పదినిమిషాలు కాలేదు. అప్డే వేదాంతం లేదు గాని. నీ రహస్యం చెప్పి నన్ను తప్పుకో మని సలహా ఇచ్చాడు. నాభార్యని నేను ఇంత దొంగచాటుగా కలుసుకో వలసి రావడం నాకేం బాగాలేదు. అందరికీ మన వివాహం సంగతి చెప్పెయ్యనిద్దూ!

ఉష—చెప్పనని నాకు మాటిచ్చావు.

కరు—ఇచ్చాను లే. కాని అందరిచేతా మాటలు పడడం నాకేమీ....

ఉష—తొందరపడి లాభం లేదు. ఓపిక పట్టాలి. ఏం చేస్తాం. మీ నాన్న మూర్ఖపుపట్టు పట్టాడయ్యె!

కరు—నిజమే ననుకో! ఆయనతో వాదించి లాభం లేదు. పెద్ద కట్నంతో వొస్తేనే గాని పిల్లని చేసుకోడం సాంప్రదాయం కాదంటాడు. కట్నం పుచ్చుకోకపోతే, మా వంశం మంచిది కాకపోడంవల్లనే కట్నం దొరకలే దంటారుట! నలుగురిలోనూ తలెత్తుకు తిరగడం కష్టంట! ఇహ ఏం చెప్పను? చిన్నప్పుడు వారాలు చేసుకునీ, మధూకర మెత్తుకునీ చదువుకుని డబ్బు సంపాదించి గొప్పవాడయిన సంగతి మరిచిపోలేకుండావున్నాడు. తన వంశం ఎలాగయినా గొప్పదే నని అనిపించుకోవాలని ప్రయత్నం. భల్లూకపుపట్టు పట్టాడు. అయినా మానాన్నకి మన పెళ్లి సంగతి తెలిస్తే ఏం చేస్తాడు? డబ్బివ్వడం మానుకుంటాడు. అంతేనా? మరేం భయంలేదు. నారెక్కలు నాకుండగా మా నాన్నడబ్బు తినడం నాకేదో దొంగతనం చేసినట్టుంది. అందరికీ చెప్పెయ్యనిద్దూ.

ఉష—వల్లకాదు. మీనాన్న డబ్బివ్వనంటే మనకి గడవదు. ప్రేమనిగురించి ఎన్ని పిచ్చిఅభిప్రాయా లున్నా ప్రమాదం లేదు. డబ్బువిషయంలో తప్పుఅడుగు వేశామా, దెబ్బతినేస్తాము. నీకొచ్చిన చదువుతో ఏ గుమాస్తావనో దొరుకుతుంది. నలభై రూపాయల రాబడిమీద ప్రేమ ఏమిటి, సుఖమేమిటి? నీతో ఇదివరకు అనేకమాట్లు చెప్పాను. కలుసుకున్నప్పుడల్లా ఇదే గొడవ నీకు.

కరు—సరేగాని, నాకేమో....

ఉష—సందేహా లన్నీ కొద్దిరోజులు మరిచిపో. నినీ మాకి వెళ్లడానికి కౌముదీవాళ్లూకూడా ప్రయాణమయిన ట్టున్నారు. వాళ్లెవరూ ఇక్కడికి రాకముందే పోదాం రా!

కరు—విశ్వేశ్వరరావుగారితో చెప్పిపోదాం!

ఉష—చెప్పక్కర్లేదు లెద్దూ! పిలిస్తే మళ్లీ వేదాంతం మొదలెడతాడు.

(అని యిద్దరూ నవ్వుకుంటూ వెళ్లిపోతారు. అర నిమిషం నిశ్శబ్దం. తరవాత అరవిందం ప్రవేశిస్తాడు)

అర—ఎవరూ లే రిక్కడ? విశ్వం!

విశ్వం—ఎవరది? (బయటికొచ్చి) అరవిందం! ఇక్కడ మీచెల్లెలూ, కరుణాకరమూ వుండాలి!

అర—నా కెవరూ కనిపించలేదే! కరుణాకరం ఎవరు?

విశ్వం—నీలాటివాడే. మరోకుంత. మీచెల్లెలిని పెళ్లి చేసుకుందా మనుకున్నాడుట. ఇప్పుడు గుండెపగిలి ఏడుస్తున్నాడు. నీసంగతేమిటి? కౌముదితో మాట్లాడావా?

అర—విశ్వం. నే నెంత క్రూరుణ్ణి! కఠోరహృదయుణ్ణి!

విశ్వం—ఏదన్నా నాటకంలో పార్టు జ్ఞాపకంచేసుకోడం లేదుకదా!

అర—నాజీవితనాటకంలో సుఖాంకమే లేకుండా పోతోంది.

విశ్వం—ఇప్పుడు నీ కొచ్చిన ప్రమాదమేమిటిరా? నిన్ను పెళ్లిచేసుకుంటా నన లేదు కదా కౌముది?

అర—ఎంత నిర్దయ!

విశ్వం—పోనీ. ఇక్కడ పలవరిస్తూ కూచోకపోతే వెళ్లి అడిగెయ్యలేకపోయావా?

అర—పురుషులది రాతిగుండె! ఏకోశానా మృదుత్వమే లేదు. అడిగేశాను!

విశ్వం—ఏ మంది?

అర—అశ్రుజలం బొటబొట రాల్చింది. ఆ కంఠధ్వని నువ్వు వినుంటే, ఆ కన్నీళ్లే నువ్వు చూసుంటే! ఆహా! ఉబికిఉబికి పొంగుతున్న దుఃఖాన్ని బలవంతంగా అణిచిపెట్టుకుంది కదా!

విశ్వం—కన్నీళ్లే! మాయాజాలం ప్రారంభమయిందన్న మాట! ప్రయోజనం లేకుండా ఆడదాని కంటివెంట నీరు రాదురా బాబూ.

అర—వూరుకో, నీ వ్యాఖ్యానాలూ నువ్వూను!

విశ్వం—పోనీ, ఎందుకేడిచిందో కనుక్కున్నావా?

అర—వివాహం సంగతి చెప్పేసరికి వాళ్ల నాన్న జ్ఞాపకమొచ్చాడుట. పితృవియోగ విచారసాగరంలో మునిగి వుండగా నేను పెళ్లి మాట ఎలా తలపెట్టానో కదా!

విశ్వం—ఏడిశావు. నోరుమూసుకో! తండ్రికోసం ఎల్లకాలమూ ఏడుస్తూకూచుంటుందా ఏమిటి? అదంతా నటనరా బాబూ. నిన్నింకా కొంతకాలం ఏడిపిస్తేనేకాని అంగీకరించ దన్నమాట.

అర—నువ్వు గార్డియన్‌వి కనక నీతో చెప్పి మొదట నీ అనుమతిపుచ్చుకొని మరీ తన్ని అడిగుండవలసిం దంది. నీ అనుమతి కోరడమంటే ఎలాగో వుంది. ఒక్కమాట కౌముదితో చెబుదూ!

విశ్వం—ఏమని చెప్పమంటావు?

అర—కౌముది నన్ను పెళ్లాడి సుఖపడుతుంది కాని కష్టపడదని....

విశ్వం — నువ్వు సుఖపడతావా లేదా అని నాకు బెంగ కాని, దానికేం? ఎవరినైనా తన సుఖానికీ, తన ప్రయోజనానికీ వినియోగించుకోగల శక్తి కౌముదికుంది. ఒక్క కౌముదికే ఏమిటి? ప్రతిస్త్రీలోనూ వుంది! తమకి స్వంతంగా ఏఆదర్శమూ లేని పురుషులు స్త్రీ ప్రయోజనానికి సాధనమాత్రులుగా లొంగిపోయా రంటే ఆశ్చర్య పడా రించవలసిన పని లేదు కాని, కవివై స్వతంత్రసృష్టి సాగించాలన్న నువ్వు స్త్రీకి లొంగకూడదు.

అర—నా కవితాసృష్టికి కౌముదే ఆదర్శదేవత. పట్టుకొమ్మ. నన్నేదో సాధనంగా వినియోగించుకుంటే నాకు కలిగే నష్ట మేమిటి?

విశ్వం—నష్టమేమిటా? వెర్రివాడా! అసలు ఈప్రపంచాన్ని, ఈ మానవసృష్టినిగురించి ఏనాడయినా ఆలోచించావా? మానవుడు సృష్టి అయి ఎన్నికోట్ల సంవత్సరాలయిందో? జంతువుకంటె ఉత్కృష్టజాతిని సృష్టించాలన్న సంకల్పమే మానవజాతికి ప్రభవకారణంగదా! కాని ఇన్నికోట్ల సంవత్సరా లయినతరవాత మానవుడు జంతుజాతికంటె లేశమాత్రమయినా ఉత్కృష్టంగా కనిపిస్తున్నాడా? మానవజాతి నశించకుండా పురోభివృద్ధి చెందాలంటే ఉత్కృష్టపరివర్తనం జరిగితీరాలి. అది పురుషుడి ఆధీనంలో వున్న కార్యం. ఈ ప్రపంచసృష్టికే మూలకారణమయిన సంకల్పశక్తి పురుషుడిలో వుంది. మన మనస్సు, బుద్ధి అందు కేర్పడినవేగదా! ప్రకృతి అంధసృష్టిని ప్రతిఘటించి దివ్యమార్గాన, ప్రయోజనకరమైనదారిని నడిపించవలసిన బాధ్యత మనమీద వుంది. శక్తి మనలో వుంది. పురుషుడే సంకల్పించాలి... వేరే సంకల్పం లేక, ఈసృష్టి అవిచ్ఛిన్నంగా సాగిస్తూ, జంతుజాతికి సామీప్యంలో మానవజాతిని వుంచేటందుకు కారణభూతురాలయినది స్త్రీ. కనక స్త్రీకి సాధనమాత్రుడుగా లొంగిపోకు. సంకల్పించు. ప్రతిసృష్టికి ప్రయత్నించు. మానవుడిని మించిన ఉత్కృష్టవ్యక్తి సృష్టికి సహాయపడు.

అర — నీవాగ్ధోరణి అమోఘంకదా! కట్టతెగిన ప్రవాహం. మాట్లాడ్డం మొదలెడితే, ఎదుటివాడిని గుక్క తిప్పుకో నివ్వవు.

విశ్వం—నే నెంత బోధచెయ్యబోయినా నీధోరణి నీదే. సరే....ను వ్విప్పు డెక్కడినించి వొచ్చావు? షికారుకి వెళ్లడానికని లలిత వొస్తానంది.

అర—అన్నట్టు మరిచిపోయాను. నీచేతి కిమ్మని లలిత వుత్తరమిచ్చింది.

(అని వుత్తరం తీసి చేతి కందిస్తాడు. విశ్వం వుత్తరం విప్పుకుచదివి)

విశ్వం—హారి! ఏమి మోసం!!

అర—ఏమిటిసంగతి?

విశ్వం—నాతో లలిత ఎక్కడికీ బైటకి వెళ్లకూడదని కౌముది హుకుం జారీచేసిందట.

అర—కారణమేమైనా వ్రాసిందా?

విశ్వం—కారణం కాదు. అవమానం! ఇప్పుడే కాదు. ఎప్పుడూకూడా వొంటరిగా నాతో వుండకూడదని నిషేధించిందిట. ఆడపిల్ల లెవరూ నమ్మి నాతో స్నేహం చెయ్యడానికి తగినవాడిని కానుట నేను. నీసుగుణాలపోవు. నీ కౌముది ఎలాటిదో ఇప్పుడైనా గ్రహించావా నువ్వు?

అర—తండ్రి పోయిన తరవాత చెల్లెలి బాధ్యతంతా కౌముదిమీద వొచ్చి పడింది కాదూ. పాపం! తల్లికి అన్నీ స్వయంగా చూసుకునేందుకు శక్తి లేదు! అలాటప్పుడు చెల్లెలి బాగోగులు కౌముది చూసుకోకపోతే ఎలాగ?

విశ్వం—అంటే! నావిషయమై కౌముది కున్న అభిప్రాయమే నీకూ వుందన్న మాట.

అర—లేదనుకో. కౌముదిమనస్సులో నిజంగా వున్న ఉద్దేశం నే నవగాహన చేసుకోగలను. నువ్వేమో అన్నీ తల్లకిందులు వ్యవహారాలు మాట్లాడుతావు. ఇంకా బుద్ధి కుదరని పిల్లలు అవి నమ్మి ఆచరణలో పెట్టడం ప్రారంభిస్తే ఇహ సన్మార్గం పట్టుపడుతుందా? నువ్వే చెప్పు పోనీ!

విశ్వం—ఒకరిని సన్మార్గంలో పెట్టడమంటే, నిజ మేమిటో తెలియకుండా అన్నీ అబద్ధాలు చెప్పడమేగా? ఆ

అబద్ధాలన్నీ వరే. నేను నమ్మకద్రోహం చేస్తానన్న ఈ అబద్ధమేమిటి? ఇదిమాత్రం నేను సహించలేను.

అర—కౌముది నిన్నేమీ అలా అనందే?

విశ్వం—అలా అనకపోతే మరెలా అంది?

సింహా—(లోపలికి తొంగిచూసి) కౌముదమ్మగారొస్తున్నారు!

(కౌముది లోపలికి ప్రవేశం)

కౌ—(విశ్వంతో) లలితకి తలనొప్పొచ్చింది. రాలేనని మీతో చెప్పమంది. ఆసంగతి చెప్పడానికే నే వొచ్చాను.

విశ్వం—(అరవిందంతో) ఇప్పుడేమంటావు?

అర—అర్థం కావడం లేదూ? నీమనస్సుకి కష్టం కలిగించడ మెందుకని ఈమాదిరిగా చెబుతోంది.

విశ్వం — మోహాంధకారం! కళ్లయెదుట పెట్టి చూపించినా తెలుసుకోలేవురా! కౌముదీ, నే నోపని చెబుతాను చేస్తావూ? మీచెల్లెలి తలనెప్పి పోతుంది.

కౌ—ఆ.

విశ్వం—ఇప్పుడు నువ్వు నాతో చెప్పిన ముక్కలు మీచెల్లెలితో చెప్పు. చెప్పి, తను రాసిన ఉత్తరం అందిన కొద్దినిమిషాలకి నువ్వొచ్చి ఈకథ చెప్పిన సంగతికూడా చెప్పు.

కౌము—లలిత నీ కుత్తరం రాసిందా?

విశ్వం—ఆ. వివరాలతోసహా!

అర—నువ్వు మరేమీ అనుకోకు కౌముదీ! నువ్వు నీవిద్యుక్తధర్మం నెరవేర్చుకున్నావు. మనసు నొప్పించకుండా, ఎంత మృదువుగా మందలించడానికి వీలుందో, అంత మృదువుగానూ హెచ్చరించావు.

కౌ—నీ దెంత మెత్తని హృదయం అరవిందం! ను వ్వెంత చక్కగా అర్థంచేసుకుంటావు?

విశ్వం—ఊ! కొండచిలువ తోక చుట్టెయ్యి. అరవిందం! నువ్వు కౌముదిని ప్రేమిస్తున్నావు కాదూ?

అర—ఆ.

కౌ—అబ్బ! పూరుకో.

విశ్వం—మీవివాహానికి నాసమ్మతి యిచ్చేస్తున్నాను. సుఖీ భవ. నే నిక వెళతాను. ఓగంటసేపు షికారు తిరిగి రావాలి.

కౌ—వెళ్లకు విశ్వం. నీతో మాచెల్లెలివిషయం మాట్లాడాలి. అరవిందం! అమ్మకూడా సినీమాకి వొస్తానంది. నువ్వెళ్లి తీసుకురావూ? అమ్మకి నువ్వంటే ఎంతో యిష్టం!

అర—ఓ. తప్పకుండా తీసుకొస్తా. నువ్వు చెప్పడమూ, నేను చెయ్యకపోడమూనా? (అని వెళ్లిపోతాడు)

విశ్వం—నేను నమ్మకద్రోహం చేస్తానని చెప్పడంలో నీవుద్దేశమేమిటి? ఇహ నేను లలితకి ఎలా మొహం చూపించను?

కౌ— ను వ్వలాటివాడివి కావని నాకు తెలుసును. కాని....

విశ్వం—అయితే ఎందుకు చేసిన ట్టీపని? ఎందుకీఅబద్ధాలు?

కౌ—చెప్పక తప్పిందికాదు!

విశ్వం—తప్పిందికాదూ?

కౌ—అమ్మ చెప్పించింది!

విశ్వం—అమ్మ! అమ్మ!! అమ్మ!!! ప్రతిదానికీ అమ్మ!!!!

కౌ—నే నేం చెయ్యను చెప్పూ? ను వ్వాపుస్తకం రాశావు: చయనులుగారికీ, అమ్మకీ దురభిప్రాయం కలిగించావు.

విశ్వం—అయితే నేను తప్పు చెయ్యలేదని తెలుసుండీ, మీఅమ్మకోసం అలా అబద్ధాలాడ్డమా?

కౌ—అన్నీ మన యిష్టమొచ్చినట్టు చెయ్యగలము టోయ్. పెద్దవా ళ్లేమనుకుంటారో అని మనం కాస్త ముందూ వెనకా చూసుకోవొద్దూ?

విశ్వం—కూడదు. వయస్సులో పెద్ద లయినంత మాత్రంచేత బుద్ధిలో పెద్దలా? ముసలివాళ్లందరూ యువకులమీద పరిపాలన చెయ్యొచ్చునన్న దురభిప్రాయం నశించేదాకా ఈ లోకం బాగుపడదు. వయస్సుకి జరుగుతున్న ఈపూజ మానిపించాలి. "తల్లి మాట మీరరాదు" అన్నదే అసలు మానవసంఘానికి వేరుపురుగు. తల్లిమాట ఎందుకు విధిగా వినాలి? తల్లికీ, పిల్లకీ మధ్య వున్నది ప్రేమకాదు. దౌర్జన్యం. భావదాస్యం. నువ్వు తిరగబడాలి. దాస్యశృంఖలమోచన మయితేనేగాని మనకి మోక్ష ముండదు.

కౌ—ఏం చక్కగా మాట్లాడతావోయ్ నువ్వు? ఏశాసనసభలో ప్రవేశించినా ఇట్టే పైకొచ్చేస్తావు!

విశ్వం—నీ కిదంతా వొట్టి పూరదంపుడుపన్యాసంకింద కనిపిస్తోందికాదూ? ఐతే పో. ఇంటికి పో. మీఅమ్మ కొంగట్టుకు తిరుగు. పెళ్లాడి పిల్లల్ని కని వాళ్లందరి మన

స్పులూకూడా పాడుచెయ్యి. ఊ. వెళ్లు. ఇంకా కూచు న్నావేం ?

కౌ—నీతో ఏమొచ్చినా కష్టమేనోయ్. నువ్వు చెప్పినది నాకు నచ్చినా. ఆచరణలో ఎలా పెట్టడం చెప్పు ? ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు ?

విశ్వం—ఏం చెయ్యమంటానా ? సంకెళ్లు తెంపుకో. నీమనస్సుకి నచ్చినరీతిని ప్రవర్తించు. ఎవ రేమనుకుంటారో అని ఆలోచించకు. మీఅమ్మ చెప్పిన మాటలు అసలు వినకు. నీమనస్సులో వున్న కుళ్లంతా పైకి తోసెయ్యి. ఈ ఆవరణలోనించి బయటపడు. పరిశుభ్రమైన స్వేచ్ఛా వాయువు పీల్చు. దేశాటనం చెయ్యి. కావలిస్తే నాతో రా. నాకారులో వూటీకొండలమీదికి. కన్యాకుమారిఅగ్రం దాకా సంచారం చేసొద్దాం. తరవాత నీఅనుభవాలన్నీ పుస్తకరూపంలో ప్రకటిద్దువుగాని. దానితో మీఅమ్మ పనయిపోతుంది. నీకు వ్యక్తిత్వం లభిస్తుంది.

కౌ—(ఆలోచిస్తూ తాపీగా)బాగానే వుంది సుమా నువ్వన్నది! నాకూ వూళ్లు చూడాలని చాలా రోజులనించీ వుంది. వూటీ తీసుకెళతావుకాదూ తప్పకుండా ? నీతో వొచ్చేస్తే మరేమీ ప్రమాదం వుండదు. ఏమంటావు ? నువ్వు నా గార్డియన్‌వే కనక నీతో వొంటరిగా వెళ్లినా ఎవరూ ఏమీ అనుకోడానికి హక్కుండదు. వొచ్చేస్తానోయ్.

విశ్వం—(నిర్ఘాంతపోయి)వొచ్చేస్తావా ?

కౌ—ఆ.

విశ్వం—మనం వొంటరిగా వెళ్లడంవల్ల ప్రమాదమే లేకపోతే వెళ్లి ప్రయోజనం ?

కౌ—నాకు చెడ్డపేరు తెద్దామనా నీవుద్దేశం? అమ్మా! ను వ్వలాటి పిచ్చిపని నిజంగా చెయ్యవని నాకు తెలీదూ ? నువ్వు నిజానికి చాలా మంచివాడివోయ్! లేకపోతే న న్నిలా వూళ్లన్నీ తిప్పుతానంటావా ?

విశ్వం—ఎవరూ ఏమీ అనుకోనికాడికి ప్రపంచమంతా తిప్పినా లాభముండదు.

కౌ—చూశావా ? అన్నీ ఇలాటి వితండవాదాలే!

(అంటూవుండే రామాయమ్మగారు లోపలికొస్తారు)

కౌ—అమ్మా! విశ్వం నన్ను తన కారులో వూటీ తీసుకెళతానన్నాడే! తరవాత కావలిస్తే కన్యాకుమారీఅగ్రం దాకాకూడా తిప్పితీసుకొస్తానన్నాడు. వెళ్లిరానా ?

విశ్వం—మీఅమ్మగారికి మనం ఇలా వొంటరిగా వెళ్లడం ఇష్టముండదు. ఆవిడ సమ్మతించదు. కాదండీ. మీ కిష్టం లేదుకాదూ ?

రామా—నా కెందు కిష్టంలేదు నాయనా ? తండ్రి పోయినతరవాత ఎక్కడికీ బయటకి వెళ్లడానికి వీలే లేక పోతోంది. తిరిగొస్తే కాస్త దుఃఖమయినా తగ్గుతుంది.... ఆసంగతే చెబుదామని నేను అనుకుంటున్నాను. లలితని కూడా కాస్త అటూ ఇటూ తిప్పుదూ ? అది మరీ యింట్లో వుండిపోతోంది. మీరు వూరెళ్లొచ్చినతరవాతయినా సరే!

విశ్వం—మోసం. మోసం. మహామోసం!!

కౌ—(తొందరగా) అమ్మా. సినిమాకి టైమయి పోతోంది. వెళ్లిపోదాం రావే. (అని తల్లిరెక్క పట్టుకుని బలవంతంగా పైకితీసుకుపోతుంది.)

(విశ్వం మెల్లిగా తల కొట్టుకుంటాడు. సింహాచలం లోపలి కొస్తాడు)

విశ్వం—సింహాచలం! కౌముది నాతో కారులో వూటీప్రయాణాని కొస్తానందిరా!

సింహా—నిజం. నే నెప్పుడో చెప్పానుకాదండి!

విశ్వం—ఏమన్నావు ?

సింహా—అమ్మగారు అరవిందంగోరికి దక్కరని!

విశ్వం—ఇప్పుడొచ్చిన ఉపద్రవమేమిటి ? నాతో ప్రయాణం చేసినంతమాత్రాన అరవిందం కౌముదిని వొదులు కుంటాడా ?

సిం—అరవిందంగా రొదులుకోరండి!

విశ్వం—మరి!

సిం—ఏటిబాబూ! ఇన్నోటి పుస్తకాలు చదువు కున్నారు. ఇంకా తెలవదు.

విశ్వం—అదేరా మాఖర్మం. పుస్తకాలు నూరిపోసి మాబుర్రలు నింపేసరికి ప్రపంచజ్ఞానం తక్కువయిపోతుంది. అందుచేతే ప్రపంచవ్యవహారం ఏమొచ్చినా నీసలహా అడిగేది. ఇంతకీ సంగతి చెప్పావుకాదు. కౌముది అరవిందాన్ని ఎందు కొప్పుకోదు ?

సిం—మరోరిమీద కన్నేసింది కనక!

విశ్వం—ఎవరిమీద ?

సిం—మీమీదే!

విశ్వం—నామీదా ? నీకేం బుద్ధిలేదురా ?

సిం—నాకేం బాబూ! చెప్పమన్నారుకనక చెప్పాను.

మీయిష్టం. ఇలాగే అప్పుని. అడుగుతారు. చెబితేనేమో కోపం. (అని వెళ్లిపోతాడు)

విశ్వం — నిజమా? నేనా కొండచిలువవనని? నేనా బలిపశువుని? ఎంత ఘోరం! ఎంత ఘోరం!! సింహాచలం, కారు సిద్ధంగావుందా?

సిం—ఆ.

విశ్వం—కారునిండా పెట్రోలు నింపెయ్యి. నీవీ నావీ పక్కచుట్టలు పెట్టెయ్యి. అయిదునిమిషాల్లో బయలుదేరాలి.

సిం—ఎక్కడికి?

విశ్వం—మహాపర్వతాగ్రంమీదికి! భీకరారణ్యాల్లోకి! కాముడికి అందకుండా ఎక్కడికయినాసరే. ఊ, పక్కకట్టు, పెట్టె సర్దు. కారు తియ్యి. ఊ. జల్దీ. జల్దీ.

3-వ అంకము

[నీలగిరి కొండల్లో: దొంగలముఠా.

దొంగలజట్టులో ఏదో మీటింగు జరుగుతోంది. దొంగలనాయకుడు ఈ సమావేశానికి అధ్యక్షత వహించి కొంచెం ఎత్తైన పీఠంమీద కూచున్నాడు. నాయకుడు ప్రసాద్‌కి నలభై ఏళ్లుంటాయి.]

ప్రసాద్—స్నేహితులారా! తోటిదొంగలారా! రాడికల్ డెమోక్రాటులకి ఎక్కువ ధైర్యసాహసా లున్నాయా, సోషలిస్టులకి ఎక్కువ ధైర్యసాహసా లున్నాయా అన్న అంశంమీద మూడురోజులనుంచీ చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో రాడికల్ డెమోక్రసీ అంటే ఏమిటి. సోషలిజమ్ అంటే ఏమిటి అన్న విషయంకూడా తీవ్రంగా చర్చించాము. మన ముఠాలో వున్న ఒక్క రాడికల్ డెమోక్రాటూ, రాడికల్‌డెమోక్రసీ అంటే ఏమిటో తెలియకపోయినా, పధ్నాలుగు గంటలు ఉపన్యసించి, రాడికల్ డెమోక్రసీని వర్ణించాడు.

రా. డె.—ప్రెసిడెంట్! అన్యాయం. అన్యాయం. నాకు రాడికల్ డెమోక్రసీ అంటే తెలుసునని రుజువుచేస్తాను. (అంటూ లేస్తాడు)

ప్ర—వల్లకాదు. దానికి మళ్లీ ఇంకో రెండు రోజులు పుచ్చుకుంటావు.

(వెనకనించి 'కూచో కూచో' అని కేకలు. రా. డె. గొణుగుకుంటూ కూచుంటాడు)

ప్ర—ఇహ మనలో సోషలిస్టులు ముగ్గు రున్నారు. వీళ్లలో ఒకరికో రెండోవాడికి మాటల్లేవు. ముగ్గురూ పరస్పరవిరుద్ధంగా, సోషలిజాన్ని మూడువిధాల వర్ణించారు.

(వెనకనుంచి 'కామ్రేడ్ నే చెప్పింది అర్థంచేసుకోలేదు' అని ఒకరూ, 'సరిగ్గా మళ్లీ చెప్పనా?' అని మరొకరూ కేకలేస్తారు.)

ప్ర—వూరుకోండి. ఇహ మీరు మాట్లాడకూడదు. ....కనక ఈ సమావేశానికి నే నొక్క సూచన చేద్దా మనుకుంటున్నాను. ఈ చర్చ ఇక్కడితో కట్టిపెట్టేద్దాం. ఎవరికి ఎక్కువ ధైర్యసాహసా లున్నాయో చర్చించి వోటుకి పెట్టి తెలుసుకోగలమా? అది శాసనసభల్లో ఆడుకునే ఆట. మన మేం శాసనసభల్లో సభ్యులమా? కాదు. దొంగలం, బందిపోటు దొంగలం. దారులు కాసి, బళ్లు అడ్డం కొట్టి ధనం దోచుకునే బందిపోటు దొంగలం. మన ధైర్యసాహసాలు మన దొంగతనాల్లో చూపించాలి. అవునా?

అయ్యరు—ఆమ. నిజందా!

ప్ర—మనం దొంగతనం మాత్రం ఎందుకు చేస్తున్నాము? కేవలం స్వలాభానికా? కాదు కాదు. ముమ్మాటికీ కాదు. లోకంలో ధనవిభజన బాగా లేదు. బీదలు కష్టపడి పనిచేస్తే, ధనవంతులు ఆసొమ్ము హరించి హాయిగా అనుభవిస్తున్నారు. కనక ధనం ఇంతకంటె న్యాయంగా పంచిపెట్టడానికే మనం బందిపోటు దొంగతనం ప్రారంభించాము. పైగా మన మేం సామాన్యదొంగలమా? మానవ సేవా సంఘం అన్న పేరుతో మన కంపెనీ రిజిస్టరు చేయించాము. ప్రతి సంవత్సరం వాటాదార్లకి డివిడెండులూ, లాభాలూ పంచిపెడుతాము. రాజకీయసిద్ధాంతాలూ, వేదాంతాలూ చర్చించడం మన పని కాదు, దార్లుకొట్టడం మన పని.

(చప్పట్లు. 'హియర్ హియర్' అని వెనకనించి ధ్వని)

అయ్య—నాది ఒక్క చిన్న విన్నపం వుండింది. మనం దారికాచేదానికి ముందు భగమంతుడికి ప్రార్థన చెయ్యాలి అని. లేదాంటే ఆండవనికి దా కోపం వొచ్చిందా అంటే నిండా మోసం.

సోషలిస్టు—భగమంతుడూ లేడు గిగమంతుడులేడు. మార్క్సు ఏమన్నాడంటే....

అయ్య—రామా రామా! భగమంతుడు లేడంటుడే? వీడుదా యెట్టువుట్టైనో? ఆండవనే! ఎన్న అపరాధం! ఎన్న అపరాధం! (అని లెంపలేసుకుంటూ) క్షమించు ఆండవనే.

రొంబకోపమొచ్చి అళ్ళందరినీ క్షమించలేకపోతే నన్ను ఒక్కణ్ణిదా క్షమించు బగమంతుడా!

(పైన ఈలవేసిన చప్పుడు. దొంగలందరూ లేచి అటూ యిటూ పరుగెడుతారు)

ప్ర—(దూరదర్శినిపెట్టి రోడ్డువైపుకి చూస్తూ ఒక దొంగతో) రోడ్డుమీద మేకులు జల్లించు. టైరు పగలకపోతే అప్పుడు జాగ్రత్తగా తుపాకీపేల్చి టైరు బద్దలు కొట్టాలి. అనవసర గలభా కూడదు.

(దొంగ వెళ్లిపోతాడు)

అయ్య — సామీ! నాకుకూడా ఒక్కమాటు యిస్తురూ. నేనుకూడా చూస్తను.

ప్ర—నీ కెంత ధైర్యముందో చూపించడానికా ఏమిటి ఇక్కడ దిగడ్డావు?

అయ్య—మీకు సేవ చేసేందుకుదా దిగడితిని సామీ!

ప్ర—నా కేం సేవ చెయ్యక్కర్లేదు. అక్కడికి వెళ్లి చూసిరా! మరేం భయం లేదులే. కారులో యిద్దరే వున్నట్టున్నారు. డ్రైవరు. యజమానీని!

అయ్య—ఏం సామీ. వారు వొచ్చి దుడ్డుయిస్తరేమో. కాఫీ తయారుపెట్టివొద్దునా?

ప్ర—కాఫీ చెయ్యమన్నప్పుడల్లా నువ్వు అరకప్పు కాజేస్తున్నావుట. ఈమాటు నిన్ను మళ్లీ కాఫీదగ్గిరకి వెళ్లనివ్వను జాగ్రత్త. మరెవరినైనా చెయ్యమంటాను.

అయ్య—ఏమి సార్. తెలిసినవాండ్లే అట్లు చెబుతురే. తెలుంగువాడు కాఫీ నల్ల తయారుచేస్తుడా? వాడు ఇంకా ఎక్కువ తాగేస్తుడు. అవళదా! నామీదదా అందరూ నేరాలు చెప్పేస్తురు. అరవవాడు అంటేనే లోకువ!

(విశ్వం, సింహాచలం, ఒకదొంగ ప్రవేశిస్తారు)

అయ్య—ఈ రెండుపేరుదానా దొరికింది?

విశ్వం — (ప్రసాదుని చూపిస్తూ) మీనాయకుడన్నావు-ఈయనేనా?

అయ్య—ఆమా సార్. అమ. వీరుదా మానాయకుడు.

ప్రసా—(గంభీరంగా) నన్ను నేనే పరిచయంచేసుకుంటాను. నాపేరు సత్యవీరప్రసాద్. మానవసేవాసంఘ అధ్యక్షుణ్ణి. బందిపోటుదొంగని. వృత్తి ధనికుల్ని దోచుకు బ్రతకడం.

విశ్వం — నాపేరు విశ్వేశ్వరరావు. పెద్దమనిషిని. వృత్తి బీదల్ని దోచుకు బ్రతకడం. మనం మనం స్నేహితులమే. (అని షేక్‌హాండ్ ఇచ్చుకుంటారు)

అయ్య—రొంబ తమాషాగా మాట్లాడుతురే మీరు!

విశ్వం—నాస్నేహితుడు. నా కారుడ్రైవరు. (అని సింహాచలాన్ని చూపిస్తాడు)

దొంగ — ఇందులో ఏది నిజం? స్నేహితుడా, కారుడ్రైవరా? స్నేహితుడయితే విడిపించుకోడానికి డబ్బిచ్చుకోవాలి. జీతం పుచ్చుకునే డ్రైవరయితే అవసరం లేదు. అస లీకొండల్లో స్వేచ్ఛగా తిరగొచ్చును.

సిం—యీలయితే తిరిగీ యిటోమారు కారు పట్టించాలేం?

అయ్య—నువ్వుకూడా రొంబ తెలివయినవాడు. మీ రెండుపేరు చాలా తెలివయినవాండ్లు.

ప్ర — ఆకలేస్తోందేమో? ఏమన్నా తినడానికి కావాలా? పల్లేరుకాయల పులుసూ, ఉడకబెట్టిన బ్రహ్మజెముడుమట్టలూ వున్నాయి. అవి మా కిక్కడ నిత్యభోజనం.

విశ్వం—అక్కర్లేదు. భోజనమయింది.

అయ్య—పోనీ! కొంచెం కాఫీ యిస్తునా సార్!

సిం— ఇక్కడకూడా నువ్వు హోటలు పెట్టేశావా ఏమిటి? దొంగలు దోచుకున్న సొమ్మంతా కాఫీపేరు చెప్పి నువ్వు కొట్టేస్తున్నావూ?

ప్ర—ఇక్కడ మఠాలో ఎవరూ కాఫీ తాగకూడదని నియమం. మాఅక్కౌంట్లు సరిచూసిపెట్టడం ఇతని అసలు పని. కాని అలవాటుచొప్పున అందరికీ కాఫీ యిస్తానంటాడు.... (విశ్వంతో) వ్యవహారం రేపు మాట్లాడుకుందామా? మీరు ఆఫీసువేళ దాటిపోయినతరవాత వొచ్చారు. కాని తొందరప నేదన్నా వుండి విడిపించేసుకోడానికి ఎంత సొమ్మివ్వాలో ఇప్పుడే తేల్చుకుందామంటే అలాగే కానిద్దాము. పట్టుబడినవాళ్ల సౌకర్యాలు మేము కనిపెట్టి చూస్తూనేవుంటాము వీలయినంతవరకూ.

విశ్వం — ఇప్పుడు మరేం మించిపోలేదు. రేపే చూసుకుందాము. నేను భాగ్యవంతుణ్ణి. మరీ గొంతెమ్మ కోరికలు కోరకుండావుంటే మీరు అడిగినంతా ఇవ్వగలను.

ప్ర—మీవంటి మనిషిని నే ఇదివరకెక్కడా చూడలేదు. సాధారణంగా పట్టుబడినవాళ్లందరూ ఏమీ డబ్బులేని బీదవాళ్లమని ఏడిచి నానాగొడవా చేస్తారు.

విశ్వం—డబ్బు ఏమీ లేని బీదవాళ్లు మోటారుకార్లు కొనుక్కుని షికార్లు తిరగరుగా!

ప్ర—అదే మేమనేదీని!

విశ్వం—మాకు కావలసిన సౌకర్యాలన్నీ చెయ్యండి. మీ కేమీ తక్కువజరగదు.

సింహా—పల్లేరుకాయల పులుసూ, బ్రహ్మచెముడు మట్టలూ మాకొద్దు. మరో పసందయిన భోజనం దొరక దేమిటి?

ప్ర—సిగరెట్లూ, బ్రాందీతోసహా ఏది పడితే అదే దొరుకుతుంది దబ్బిస్తానంటే. అరువుమాత్రం లేదు.

సింహా—అలా చెప్పాలి!

విశ్వం—మీ రిక్కడ అంతా సోషలిస్టులేనా ఏమిటి?

ప్ర—అబ్బే అదేం కాదే? దేశంలో ఉత్పత్తయిన భాగ్యం సరిగా పంపకంకావడం లేదని మా అందరికీ పుద్దేశా ఉన్నాయనుకోండి. దొంగతనం పురానావృత్తిగా సాగించు కోవాలంటే గౌరవమైన అభిప్రాయా లుండాలి. మనం ఏపని చేసినా దేశక్షేమానికో, లోకకళ్యాణానికో చేసినట్టు మనసుకి సమాధానం చెప్పుకోవాలి. అందరికీ చెప్పాలి. అంతేగాని. మాకేం? మాలో అన్ని రకాల వాళ్లూ పున్నారు! కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌వాళ్లు, నాస్తికులు, భగవద్భక్తులు, గృహస్థులు, బైరాగులు. ఇక్కడ సంపూర్ణభావస్వాతంత్ర్య ముంది. ప్రతివాడికీ వేపకాయంత వెఱ్ఱిమాత్రం వుండనుకోండి. అది మిమ్మల్నేమీ బాధించదు.

విశ్వం—అబ్బే! అందు కనలేదు. ఆమాట కొస్తే నేనూ ఓరకమైన సోషలిస్టునే.

ప్ర—అవునవును. భాగ్యవంతుల్లో చాలామంది సోషలిస్టులు, అదో ఫాషను.

సింహా—సోషలిజమ్ మీలో కూడా పాకిందంటే, ఇహ దానికి బాగుపడే దినా లొచ్చా యన్నమాట!

ప్ర—నిజమే. వేదాంతులూ, నిజాయితీ మనుష్యులే నమ్మే సిద్ధాంతాలు అట్టే వ్యాపించవు. ఏదన్నా సిద్ధాంతానికి బలంరావాలంటే అది ముఖ్యంగా దొంగల్లో వ్యాపించాలి.

విశ్వం—తెలియ కడుగుతాను. దొంగలంటే సామాన్యప్రజలకంటే తక్కువ నిజాయితీ మనుష్యులనా?

ప్ర—అది కాదు. బందిపోటు దొంగతనం సామాన్య వ్యాపారం కాదు. అసామాన్యవృత్తి. కనక దీంట్లోకి సామాన్యమానవులు రాలేరు. అసామాన్యవృత్తులకి సాధారణంగా రెండురకాల మనుషులు చేరుతుంటారు. సంఘంలో ఎందుకూ మారని కుంకలు ఒకరకం. సంఘానికి అతీతులు రెండో రకం. మేము సంఘంలో మురికి, మీగడాను. మురికి అధమ రకం, మీగడ ఉత్తమరకం.

సింహా—జాగ్రత్తండోయ్. అమురికో దెవరైనా ఈ మాటింటే గొప్పతగువొచ్చిపడేను!

ప్ర—మరేం భయంలేదు. ఎవరిమటుకు వాళ్లే మీగడా, మిగతావాళ్లంతా మురికీ అనుకుంటారు. అమాటకొస్తే మిగతా వాళ్లని మురికివెధవలని తిడితే మరీనయం. మరీ సంతోషిస్తారు.

విశ్వం—లోకజ్ఞానం చాలా వుంది మీకు. ఒక్క ప్రశ్నవేస్తాను. ఏమీ అనుకోరుగదా!

ప్ర—మీయిష్టమొచ్చిన ప్రశ్న వెయ్యండి. మరేం ఫరవాలేదు.

విశ్వం—మీ అంత తెలివయినవారు ఈవృత్తిలో ప్రవేశించి ఈ మేకల్ని కాసుకుంటూ కూచోడ మెందుకు? మీకంటె తక్కువ తెలివయినవాళ్లు అనేకమంది సంఘంలోనే వుండి ఆర్జించుకుంటూ, మూడుపూట్లా భోజనం చేస్తూవుంటే మీ కీపల్లేరుకాయలపులుసూ, ఉడకబెట్టిన బ్రహ్మచెముడు మట్టలూ ఖర్మమేం?

ప్ర—నేను మాత్రం చెయ్యలేదూ? అందరికంటె ముందు నేనే అన్నీ రుచిచూసేవాడిని. పదిమంది యిళ్లలో వంటచెయ్యడంవల్ల అన్ని రకాల మనుష్యులూ తెలిసొచ్చారు. అందుకనే నా కింత లోకజ్ఞానం.

విశ్వం—నువ్వు వంటబ్రాహ్మడివా అసలు?

ప్ర—అవును. ఈ బందిపోటు నాయకుడు ఒకప్పుడు వంటబ్రాహ్మడు. (అకస్మాత్తుగా) నేను నాజీవితకథచెప్పనా?

సింహా—సిటికలో చెప్పెయ్యాలి. కాంతాడంతోటి చెప్పకు!

విశ్వం—నీకేం విందామని కుతూహలం లేందే? నీ కిష్టంలేకపోతే నిద్రపో....కథమాత్రం కుదించకండి.

ప్ర—నే ప్రేమించిన స్త్రీ....

విశ్వం—సరి!

సింహా—ప్రేముందీ.అటయితే వింటాను. నీ పూసేకో చెప్పుకుంటావని భయపడ్డాను.

ప్ర—నాప్రేమగాథే నాజీవితగాథ! అది తెగి ఇక్కడి కొచ్చి పడ్డాను. నే ప్రేమించిన స్త్రీ....

సింహా—సినీమా కథ ఏదన్నా నా ఏటయ్యా?

ప్ర — సినీమానాజూకుతనంతో నాకేంపని? నే ప్రేమించినదానికి ఉక్కుముక్కలాటి వొళ్లు: జిడ్డున పీడ లేదు ఎప్పుడూ. నలుగురి పని ఒక్కత్తే అడుకుంటూ

పాడుకుంటూ చేసేది. మాంచి తెలివయినది. నోరుమాత్రం కొంచెం దురుసు. ఎంతటివాడినయినా హడలగొట్టెయ్య గలదు. తిట్టాలంటే ఇహ చూసుకోండి ఆభాష. తిట్టిన తిట్టు తిట్టకుండా మూడుగంటలు తిట్టగలదు! నిమిషంలో మనసు మార్చుకునేది. ఆ కోపం, ఆ ప్రేమ, ఆ కరవదం, ఆ మనసుమార్చుకోడం సరిగ్గా ఆడది ఎలా వుండాలో అలా వుండేది. ఒక్కమాటు దాన్ని చూసిన తరవాత ఇహ ప్రపంచంలో మరెవరిమీదా మనసుపోదు.

విశ్వం—ఎవరు? ఏం చేస్తూవుండేది?

ప్ర—దాసీపని చేస్తూవుండేది.

విశ్వం — బాగుంది. కొత్తరకం కావ్యనాయిక. తరవాత? నిన్ను పెళ్లిచేసుకోనందా?

ప్ర—పెళ్లిచేసుకుంటే నే నిక్క డెందుకుంటాను? బ్రాహ్మణ్ణి పెళ్లిచేసుకోనంది.

విశ్వం—ఏం? దాసీది బ్రాహ్మణ్ణి పెళ్లాన్నడమేం?

ప్ర—వంటబ్రాహ్మడు కుబ్బిరంగా వుండదని! కొల్లాయగుడ్డ కట్టుకుని వంటచేసి వార్డిస్తేనేగాని యింటివారు వూరుకోరు. ఆ కొల్లాయగుడ్డ ఎంత మురికిగా వుంటే అంత ఆచారం. ఇది అంట్లు తోమేటప్పుడయినా చాలా నీటుగా వుండేది. నన్ను చూసి అసహ్యించుకునేది. వంటయిపోయిన తరవాత మంచిబట్టలు కట్టుకుని వెళ్లినా నా మొదటి రూపు మరిచిపోయేది కాదు. దానికోసం వంటపని అసలు మానుకున్నా లాభం లేకపోయింది. చచ్చిపోతానన్నా. కావలిస్తే మందు తెచ్చిపెడతానంది. చంపుతానన్నాను. దానితో వెఱ్ఱి ఎత్తుకొచ్చింది. నేను చంపుతున్నట్టు పీడకలలు రావడం మొదలెట్టాయి. నే నావూళ్లో వుంటేనే దానికి నిద్రపట్టడం పోయింది. నే నెంతో ప్రేమించిన ఆడది నామూలాన్న నిద్ర లేక చిక్కి శల్యమైపోడం చూసి భయపడ్డాను. ఈ దేశ మొచ్చేశాను. దొంగలతో స్నేహమయింది. బుర్రున్న బ్రాహ్మణ్ణికనక కొద్దిరోజుల్లో నాయకుణ్ణయాను. పెద్ద కంపెనీ పెట్టాను. కావలసినంత లాభాలు. ఎంతో బలగం. కాని దాన్ని మాత్రం మరిచిపోలేకుండా వున్నాను. ఈ అడవుల్లో ప్రతి చెట్టుమీదా దాని పేరు చెక్కాను. ఆ పేరే జపంచేసుకుంటాను. సింహాచలం! సింహాచలం!

సిం—(ఉలిక్కిపడి) సింహాచలమా?

ప్ర—అవును. దాని పేరు అప్పల నరససింహాచలం!

సిం—ఏయ్. అది మా అప్పపేరు.

ప్ర—అన్నట్టు. ఓ తమ్ముడు మంచి కారుడ్రైవరని చెప్పేది. నువ్వేకాబోలు. నీ పేరూ సింహాచలమేకాదూ?

సిం—ఆ!

ప్ర—అందరి తమ్ముళ్లలోకీ నువ్వంటేనే చాలా యిష్టమని చెప్పింది.

సిం—ఏయ్. నువ్వేం బ్రాహ్మడివయితే ఆయావు. దొంగలనాయకుడి వయితే ఆయావు. అదీ గిదీ అంటున్నావు. జాగర్త. నోరుమిగిల్తే ముక్కు చితక్కొట్టేస్తాను.

ప్ర—నా ముక్కు చితక్కొట్టనిస్తానుకాని ఇలా చితక్కొట్టానని మీ అక్కయ్యతో గొప్ప చెప్పుకుంటావూ? అది ఏదోవిధంగా నన్ను జ్ఞాపకముంచుకుంటే చాలు. నా కంతకంటె ఏమీ అక్కర్లేదు.

విశ్వం—చూశావా సింహాచలం? మీ అక్కయ్యంటే ఎంత ఇష్టమో. ఇక నేమీ అనకూడదు.

సిం—ఇష్టం కాదు; పిరికి!

ప్ర—(తాచుపాములా లేచి) పిరికితనమా? ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసునా? గరిటతిప్పిన భీముడి వంశం నాది! పిప్పిచేసేస్తాను.

సిం—నీలాటోళ్లని లక్షమందిని చూ సీ శా ను. తూర్పాదు బాపనోడికా భయపడతాడు. జాగర్త.

విశ్వం—నిన్ను చూస్తే సిగ్గేస్తోంది సింహాచలం! నీకూడా కులాభిమానమే? పోనీ. ప్రసాదుని కొట్టినా దొంగలముఠా అందరినీ కొట్టలేవుకదా!

ప్ర—అదీ యింతే. కులాసాగా కబుర్లు చెబుతూనే వుండేది. తటుక్కున కోప మొచ్చేసేది. అప్పుడు ఇహ వెనకా ముందూ చూడ్డంలేదు. అంచేతే దాన్ని చూస్తే నా కంత యిష్టం. ఆప్రేమే న న్నిలా అధోగతిపాలు చేసింది. లేకపోతే నే నీపాటికి ఓ హోటలు పెట్టి ప్రసాద్ యిడ్డెన్లు. దోసెలూ దేశమంతా పేరుతెచ్చుకోలేక పోయానా? ఎన్ని ఇడ్డెన్లకన్నా పిండి అది ఒక్కర్తే రుబ్బేసునే? అహఁ. నాపెళ్లయినతరవాత ఇహ పిండి రుబ్బనిస్తాననికాదు!

విశ్వం—(ఆవలిస్తూ)నే నొక్క సలహా చెప్పనా?

ప్ర—ఊఁ.

విశ్వం—ఒక్క ఆడదానికోసం ఇలా నీభవిష్యత్తంతా చెడగొట్టేసుకోడం ఏమీ తగదు.

ప్ర—నాకు తెలుసు. కాని తెలి సేం లాభం? నే నేం చెయ్యగలను? అప్పుడప్పుడు రాత్రుళ్లు నాకు నిద్దర

పట్టకపోతే పద్యాలు రాసేవాణ్ణి. చదివి వినిపించనా? నా కష్టే కవిత్వం రాదు. కాని ఆ విరహబాధలో కవిత్వం దానంతట అది అలా పుట్టుకొచ్చేది. చదవమంటారా?

"అప్పలనరసమ్మా నీ
కెప్పుడు నామీద దయ పుడుతుందో?"

ఏమందమయిన పేరు! ఈపేరుతో ఎవరైనా కవిత్వం రాసెయ్యొచ్చు. నాగొప్పేముంది. ఈపేరే ఎన్ని రకాల మార్చొచ్చునో చూడండి:

"అప్పలమ్మా, నామీద దయాలుంచుమా
అప్పలమ్మా, నామీద.
అలసి అలసి.
విసిగి విసిగి.
అలసి విసిగిపోయినా.
అప్పలమ్మా, నామీద దయాలుంచుమా!"

ఇంకోటి చదవనా?

"సింహాచలం, నువు నన్ను పెళ్లాడితే, నే నీభర్తను కానా? సింహాచలం, నే నిను పెళ్లాడితే నువు నాభార్యవు కావా? నువు నాదానివి కావా? నే నీవాడిని కానా?"

అబ్బ—ఇది గుండెల్లోనించొచ్చిన కవిత్వం, గుండెల్లో నరాల్లోనించొచ్చిన కవిత్వం. ఈకవిత్వం వింటే అది కరిగి నీరైపోదూ? నామీద జాలిపుట్టదూ?

(ఎవరూ మాట్లాడరు. సిం॥, వి॥ నిద్దరోతున్నారు.)

మామూలే! నాకేమో దివ్యగానం, మిగిలినవాళ్లందరికీ వెట్టిమొట్టికవిత్వం! ఛీ, ఛీ, నే వొట్టి వెధవని, నా ప్రేమ చంపుకోలేక ఇలా ఏడుస్తున్నాను.

(ఆవలిస్తూ) అప్పలమ్మా! నరసమ్మా! అప్పల నరసమ్మా! సింహాచలం....(అని నిద్రపోతాడు.)

* * *

(తెల్లవారుఝాము. వెనకనించి 'మోటారుకారు, మోటారుకారు' అన్న ధ్వని. గడబిడ. ముగ్గురూ ఆవలిస్తూ లేచి కూచుని వొళ్లు విరుచుకుంటూ వుంటారు.)

విశ్వం—ఎప్పుడు నిద్దరట్టిందో తెలీదు. అప్పుడే తెల్లారిపోతోందే?

(పైన తుపాకి పేలిన చప్పుడు.)

ప్ర—తుపాకీతో అఘోర్దని ఎన్ని మాట్లు చెప్పినా వినరు. ఈమాటు మెడ విరగ్గొట్టేస్తాను.

(ఒక దొంగ, అయ్యరూ వగర్చుకుంటూ లోపలికి పరుగెత్తుకొస్తారు.)

ప్ర—(దొంగతో) నువ్వేనా తుపాకి పేల్చింది?

దొం—నే కాదు. వాళ్లే ముందు పేల్చారు.

అయ్య—రెండు మొగమనిషి, మూడు ఆండవాండ్లు.

ప్ర—ఇక్కడి కెందుకు తీసుకురాలేదు? భయ మేసిందా?

దొంగ—వాళ్లని చూసి కాదు. వెనక రెండు కార్ల నిండా పోలీసులు తోడున్నారు.

విశ్వం—ఓహో, తోడుకా దది! కొండలన్నీ గాలించి దొంగల్ని పట్టుకోడానికి సిపాయీల జట్టు బయలుదేరుతోం దని మమ్మల్ని వుండిపొమ్మన్నారు. అదేకాబోలు. మేం వినకుండా వొచ్చేశాము.

దొంగ—బాబురే! మన్ని పట్టుకోడానికి సిపాయిలే! పారిపోయి కొండల్లో దాగుందాం!

ప్ర—వేళ మించిపోయింది. ఇహ లాభం లేదు. పైగా కొండల సంగతి నీ కేం తెలుసు! ఒక్క ముక్క అనమన్నా రాదయ్యె. రెండో రోజుకి పట్టుబడతావు!

అయ్య—నేనుదా ముందరనే చెబితినే-నాయనా బగ మంతుణ్ణి తలచురా అని! బగమంతుదా? ఎన్న కష్టం తెచ్చి పెట్టితివిరా! నేను దినాము ప్రేయర్ చేస్తినే? నన్నైనా రచ్చించు ఆండవనే!

ప్ర—మీరెవరూ గాభరాపడకండి. (వి॥తో)కామ్రేడ్ మమ్మల్ని సిపాయిలకి అప్పగించరుకదూ!

సిం—ఎవరినోప్ కామ్రేడ్ అంటున్నది? నే నేం కామ్రేడ్ని కాను.

ప్ర—నిన్న మాకు మీరు లోకువ. బీదల్ని దోచుకు బతికే దొంగ ధనికుల్ని దోచుకుబతికే దొంగచేతిలో పడ్డారు. గౌరవంగా చూశాము. ఇప్పుడు మీకు మేము లోకువ.

విశ్వం—నే నెవరిమీదా ఫిర్యాదు చెయ్యను! ఓరాత్రి ఇక్కడ కులాసాగా గడిపాను. నా కేం విచారం లేదు.

సిం—నా కవ్వన్నీ తెలీవు, నాయిష్టం, తెలిసిందా?

ప్ర—అలానే కానీ! నన్ను పట్టుకుంటే నేరం ఒప్పేసుకుంటాను. ఎందుకు దొంగ నవ్వాలసొచ్చిందోకూడా చెప్పేస్తాను. నాపెట్టె వెతికితే మీ అప్పఫొటో, నే రాసిన ఉత్తరాలూ పద్యాలూ! అన్నీ కనిపిస్తాయి. నీపేరూ, నీఅప్పపేరూ పోలీసుకోర్టుల్లో, పేపర్లలో పదిమందినోళ్ల ల్లోనూ పడిపోతుంది కానుకో.

సిం—(హడిలిపోయి) పేపర్లో పడితే భయం లేదు కాని. దొంగముండావాడిని మాఅప్ప ఎరుగునని పేరు

పైకొస్తే....నన్నిలా బెదిరించి నోరు కట్టేస్తున్నందుకు చూడు ఏం చేస్తానో ?

ప్ర—ముందర నీనోరు కట్టడిందికదా! తరవాత సంగతి తరవాత ఆలోచించుకుందాం.

(లోపలినించి కౌముది, కరుణాకరం, ఉష, దయ సులుగారూ లోపలి కొస్తారు)

కౌము—(తిన్నగా విశ్వందగ్గరకి వెళ్లి) విశ్వమే!

విశ్వం—ఆ. నేనే దొరికిపోయాను.

కరు—నే చెప్పలే, విశ్వేశ్వర్రావుగారేనని? మా కారు టైరు పంక్చరయిపోయింది. ఇదేమిటో, ఈరోడ్డునిండా మేకులే!

కౌము—మాతో ఎవరితోటీ చెప్పకుండా వొంటరిగా యిలా ఎందుకొచ్చేశావు?

కరు—నేనే పందెం గెలిచాను. (కౌముదితో) మనం పూటీ వెళ్లగానే మీరందరికీ టీపార్టీ ఇవ్వాలండోయ్. (విశ్వంతో) మీరు పూటీ చేరేలోగా మిమ్మల్ని కలుసుకో లేమనీ పందెం వేశారండి. నా కారుసంగతి ఆవిడకేం తెలుసు? గంటకి అరవైమైళ్లపై వెళుతుంది.

విశ్వం—ఇది పూటీరోడ్డు కాదే!

కరు—అయితే యేం? కౌముదిగారు ప్రతి పెట్రోలు బంకుదగ్గిరా మీ ఆచోకీ కనుక్కుంటేనే! మీరు గొప్ప సి. ఐ. డి. గా పనికొస్తారండోయ్.

విశ్వం—ప్రకృతి తరుముతోంది. ఇహ సాహసయి పోయింది.

(అకస్మాత్తుగా అరవిందం లోపలికొస్తారు.)

అర—అమ్మయ్య! నువ్వు కులాసాగా వున్నావా? నిన్నేమో దొంగలెవరో పట్టుకున్నా రనుకున్నా.

దయ—('ప్ర' కేసి తీక్షణంగా చూసి) వీరిని ఇదివర కెక్కడో చూసినట్టు జ్ఞాపకమొస్తోంది.

అర—నేనూ చూశాను. నాకూ చాలా బాగా గుర్తుంది.

ప్ర—(ఉషతో) మీకు నన్ను చూసిన గుర్తు లేదూ?

ఉష—వుందికాని పేర్లు నాకు జ్ఞాపకముండవు!

ప్ర—అయితే నన్ను నేనే పరిచయంచేసుకుంటాను. అందరం గోవిందంగారింట్లో కలుసుకున్నాము.

దయ—ఓహో. అలా చెప్పండి! ఏదైనా పనిమీ దొచ్చి వారంపదిరోజు లున్నారుకాబోలు.

ప్ర—వారం పదిరోజులేం? నాలుగయిదునెల లున్నాను. వారింట్లో వంట చేశాను.

దయ—ఓరి నువ్వు వంటవాడివా?

ప్ర—నాకంతా కళ్లకక్కట్టినట్టుంది. కౌముది పది మందిచేతా బతిమాలించుకుంటేనేకాని ఎప్పుడూ తినేది కాదు. ఉష వడీ చప్పుడూ లేకుండా తిని వెళ్లిపోయేది. తినలేదని ఇంటిల్లిపాదీ గాభరాపడేవారు. ఇహ దయసులుగారికి కావాలి గాని మొహమాటం. వొద్దువొద్దంటూనే, ఎంత పెడుతూ వుంటే అంతా తినేసేవారు.

దయ—(కోపంతో)కట్టిపెట్టు నీ సంభాషణ.

ప్ర—నాకేం? మీకు జ్ఞాపకం రాలేదంటే జ్ఞాపకం చేశాను. ముందు పలకరించింది మీరా, నేనా? ఇక్కడ మీరెంతో నేనూ అంతే! ఇహ మాటలొద్దు.

విశ్వం — నువ్వూ నీకారూ ఎక్కడినించి కొట్టు కొచ్చారు కరుణం! నువ్వూ ఇంకా ప్రకృతిశక్తిని వొదుల్చుకోలేకపోయావూ? నిన్నూ ఇంకా తిప్పితిప్పి కొడుతోందీ?

ఉష—(మాట తప్పిస్తూ)అదుగో సిపాయి లొస్తు న్నారు!

అయ్య—సిపాయిలే? అందవనే! పూడుస్తునా?

ప్ర—కదిలావంటే నిన్ను పూడుస్తా ఇక్కడ.జాగర్త!

ఘోష—విప్లవం రావాలంటేవినలేదు. ఇప్పుడు జరుగు తోంది శాస్తి. కాపిటలిస్టుప్రభుత్వం మనమీద కసితీర్చు కుంటోంది.

అయ్య— బగమంతుడా! ఎన్నమనిషి. ఇప్పుడు కూడా పాలిటిక్సే మాట్లాడుతుదే? బగమంతుణ్ణి ద్యానం చెయ్యమీ!

ప్ర—పాలిటిక్సే మాట్లాడండి! అదే పెద్దమనిషి తరహా!

(ఒక ఆఫీసరు లోపలికొస్తాడు. సలామ్ పెట్టి)

ఆఫీ—నీళ్లందరూ ఎవరండి? మేం దొంగలకోసం గాలిస్తున్నాము.

విశ్వం—ఈకొండల్లో నాకు దారి చూపించడానికి నే తోడుతెచ్చుకున్నాను. దొంగలు కారు!

(ఆఫీసరు తిరిగి సలామ్ పెట్టి వెళ్లిపోతాడు. ప్రసాద్ సింహాచలాన్ని చూసి చిరునవ్వు నవ్వుతాడు.)

[సశేషము]

నాటకములు : పద్యములు

= శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి =

ఇపుడు దృశ్యకావ్యము లన్నిటికి నాటక మను సంజ్ఞయే తెలుఁగు వాడుకలో నున్నది కావున నిందు దానినే వాడుదము.

విజాతీయుల సహవాసమువల్ల వారి మతాచార సంప్రదాయములు కొన్నికొన్ని హైందవుల కబ్బుచున్నట్లే, ఆంగ్ల భాషాసంసర్గవిశేషమువల్ల దాని సంప్రదాయములు కొన్ని మన భాషలకు సంక్రమించుచున్న వనుట విదితము. అది స్వాభావికమే, తప్పదు. ఇపుడు తక్కిన లక్షణముల మాట యటుంచి, నాటకముల కావశ్యక మనుకొనుచున్న యొక మార్పును గూర్చి యించుక పరామర్శింతము.

"నాటకమందు పద్యము లుండరాదు" అని రూపకరచన కొక క్రొత్తలక్షణము తలచూపినది. ఇది పదములు, లేక పాటలకు ఉపలక్షణము. ఇవి రాగములతో పాడుట యాచారము కావున సంగీతము కూడ దన్నయభిప్రాయ మిం దిమిడియున్న దనుట స్పష్టము. ఈ మతము నేఁటిది కాదు. ఇది యుదయించి సుమారు ముప్పదియేం డ్లయినది. కాని, ఆనాఁడు పద్యసంగీతములు ప్రేక్షకరంజకము లగుట కనిపెట్టుచున్న నటులు వాటిని విడువలేదు. అది యెఱుఁగిన రూపకరచయితలా మతము నెక్కువగా నాదరింపలేదు. ఆయినా, కొంద ఱాసమయమున వచననాటకములు రచియించుచుండుటయు, వాటిలో నొకటి రెండు ప్రదర్శింపఁబడుచుండుటయు లేకపోలేదు. అందు గణింపఁదగినది 'కన్యాశుల్కము'. పాత్రౌచిత్యమును చక్కఁగాఁ పాటించిన యది చదువరులను, చూపరుల నాకర్షించినమాట నిజము. కాని, ఆనాఁటివే మఱికొన్ని వచననాటకములు సామాజికులను రంజింపఁ జేయలేదు సరిగదా, పాఠకుల కైన నింపు పుట్టించలేదు. ఇట్లనుట పద్యాదులతోడి నాటకములు రెండు విధముల రంజకము లైన వని కాని, అగుచున్న వని కాని చెప్పుటకాదు. అట్టి వెన్నో విఫల మైనమాట విద్యావంతు లెఱుఁగనిది కాదు. వాణీవిలాస నాట్యమండలివారి యొకటిరెండు వచననాటకప్రదర్శనము లిపుడు సభ్యరంజకములై సఫలము లగుచున్నమాటయు నాటకకళాభిజ్ఞులకు తెలియనిది కాదు. దీనినిబట్టి, నాటకమును, తత్ప్రదర్శనమును సహృదయహృదయంగమము లగుటకు వస్తుపాత్రరసౌచిత్యములు కారణము గాని పద్యసంగీతముల కలిమియు, వాని లేమియు హేతువులు కా వని తెలియుచుండఁగా, వాటిని తీసివేయవలె నన్న వాద మెందుకు పుట్టవలెను?

"కథాదుల యౌచితి ముఖ్యమే యైనను, రంగస్థలమునందు పద్యసంగీతములతోడి సంభాషణము పాత్రోచితమును, స్వభావసిద్ధమును కాకపోవుటచే నది యింపు పుట్టింప"దని:—సరే కాని, వేటి ననుకరించి మన మీ మార్పు కోరుచున్నామో, ఆ యాంగ్ల నాటకములలో పద్యములు లేవా? పాత్రముల సహజ సంభాషణము కంటె ఆ పద్యరూప సంభాషణము విలక్షణముగా నుండదా? షేక్స్పియరుమహాకవి పద్యరూపసంభాషణమందలి యౌచిత్యానౌచిత్యము లెఱుఁగఁడా? అతని నాటకములు ప్రదర్శనరమ్యములు కావా? మఱియు, తెలుఁగును పోషించిన సంస్కృత ప్రాకృతములలోని రూపకములలో పద్యము లున్నవి గదా! నాటకకళాభిజ్ఞు లైన భాసకాళిదాసాదులును,

రాజశేఖరాదులును పద్యరూపపాత్రసంభాషణను సామాజికరంజకము కాదని తలఁచినచో వారు పద్యములు రచించి యుందురా? కావున, రూపకములందు పద్యము లుండరా దన్న వాదము సమర్థము కాఁజాలదు. ఇఁకనో, పద్యభావము తెలియకుండునట్లు నిరర్థకము లైన పదముల విఱుపులతో పద్యమధ్యపద్యాంతము లందు రాగము సాఁగదీసి పాడుట కూడ దందురా, అది యంగీకరింపఁ దగినదే. అంకములు పద్యశతకములో యనునట్లు సందర్భశుద్ధియు, భావపుష్టియు లేని పద్యములతో నాటకము నిండించుట తగ దందురా, ఆ యభిప్రాయమును గ్రహింపఁ దగినదే. అంతే కాని శ్రుతిరమ్యమును, భావానుగతము నై యౌచిత్యమర్యాద నతిక్రమింపని పద్యమును, సంగీతమును సామాజికుల కుత్సాహము పుట్టింపవని మాత్రము భావింపరాదు. అవి రంగప్రసాధనవిధులలో చేరినవే.

సంస్కృతనాటకముల ననువదించుటయు, వాటి ననుకరించి యనుసరించి రూపకములు వ్రాయుటయు తెలుఁగునకు సుమా రేఁబదియేండ్లనాఁడు బయలుదేఱినది గాని, నన్నయభారత ముదయించిన దాదిగా సుమారాఱుశతాబ్దులలో మనవారు రూపకరచనమే యెఱుఁగరు. తరువాత నేవో యొకటిరెండు నాటకములు పుట్టినట్లు వినవచ్చిన నేమి? అవి కనరావు. పిదప ౧౬౨౦ ప్రాంతమునందు తెలుఁగురాజులు పాండ్యాదిమండలము నేలుచున్నపుడు దృశ్యకావ్యనిర్మాణ మారంభ మైనది. అది నాట్యశాస్త్రదశరూపకాదిలక్షణముల ననుగమించినది కాదు. స్వతంత్రము. వీథిపందిరియే నాట్యరంగముగా నటులు ప్రదర్శించిన యీ దృశ్యకావ్యములు యక్షగానకావ్యము లని మనవారు వ్యవహరించుచున్నారు. అవి యిపుడు తంజావూరు పుస్తకభాండాగారమున వందలకొలఁదిగా నున్నవి. మన దేశములో చిరకాలముగా ప్రదర్శింపఁబడుచు ప్రేక్షకుల నాకర్షించుచు వచ్చిన భామకలాపము, గొల్లవేషము, ప్రహ్లాదచరిత్ర మొదలయినవి నాజాతిలో చేరినవే. భారత రామాయణాదికథలను ప్రేక్షకరంజనముగా వీథిపందిటిలోని తెరమీఁద ప్రదర్శించెడి 'తోలుబొమ్మలాట' తెలుఁగువారికి చిరపరిచితమే. అది నేఁటి టాకీసినిమాను పోలవచ్చును. ఈ చెప్పినవాటిలోని పద్యములు, పాటలు నింత దనుక జనరంజకము లగుచు వచ్చిన వని మన మెఱుఁగమా? నేఁటి తెక్కైన నవనాగరికశాలక్షణములవలె నాటకమున పద్యాదు లుండరా దన్న నూతనలక్షణము వెలసినది గాని, యీ వాదమున సారస్య మేమియు లేదు. పద్య సంగీతసహితము కానీ, తద్రహితము కానీ! యేది సహృదయరంజక మగునో, అదే గణింపఁదగిన నాటకమనుకొన్నచో విప్రతిపత్తియే లేదు. ఎవరికి తోఁచిన పద్ధతిని వారు నాటకములు రచింతురు. అం దేది సభ్యరంజక మగునో!! దాని యదృష్టము. పదపద్యసంగీతప్రియులు వచననాటకములు వద్దనుచున్నారా? ఇఁక వీ రెందుకు వాటిని నిషేధింపవలెను? కావున పద్యనిషేధవాదము హృద్యము కా దనక తప్పదు. ఇఁక:—

పాత్రసంభాషణము పద్యములవల్ల నసహజమై యనుచితము కాకున్న దనెడి మతము నింతవఱకే సోదాహరణముగా నొకింత చర్చించియున్నాము. ఈ సందర్భమున మఱిరెండు మాటలు:—

కథ సత్యమో కల్పితమో! అది పురాతనమో అధునాతనమో! అందలి స్త్రీపురుషుల వేషములు వేసుకొని నటులు నాట్యరంగమున కావించు కృత్య మేమి? వారి యవస్థల ననుకరించుట. అంతే కదా! 'అవస్థానుకృతి నాట్య' మన్నంతమాత్రమున వారి చేష్టలను మాటలను, ఎట్లు జరిగెనో, లేక యెట్లు జరిగి యుండు నని మన మూహింతుమో, అట్లే నటులు చూపుట యనుకరణ మనియు, అదే నాట్య మనియు భావింపరాదు. అట్లైని, యీ నాటకకర్త కవి కాఁడు, ఆ నాటకము కావ్యమును కాదు. కణ్వుఁడు శకుంతల నత్తవారియింటికి పంపునపు డీ విధముగా మాటలాడి యుండు నని లోకానుభవమునుబట్టి మనము తలంతుమో, అట్లే శాకుంతలనాటకమున నున్న దనఁగలమా? నిజముగా నట్లే యున్నచో, కాళిదాసు ప్రతిభాశాలి యగు మహాకవి యను పే రొందునా? ఆ నాటక మింత కాలము విద్వద్రంజకమై నిలచునా? కణ్వుఁడు పద్య

ముతోఁనే పూల మొక్కల యనుమతి ప్రార్థించెనా? దుష్యంతునికి పద్యరూప సందేశము శిష్యులచేత పంపెనా? అట్లే వారాతనికి చెప్పిరా? లేదు. అయితే, ఆ ఘట్టమును నటులు పఠించునపుడు సామాజికులలో నొకఁడైన 'ని దేమిటి? ఈ సంభాషణము సహజముగా లేదు. స్వభావవిరుద్ధ, మనుచితమని నిరసించె ననఁగలమా? ఇట్లే సీతారామ ద్రౌపదీ ధర్మజాదుల చేఁతలను, మాటలను పురస్కరించుకొని, నాటకకవు లాయా సందర్భము లందు రచించిన పద్యము లెట్లు సముచితములు కావో సప్రమాణముగా నిరూపించి, యపుడు నేఁటి నాటకకవులకు పద్యనిషేధ ముపదేశించిన బాగుండును.

ఉత్తరరామచరిత్రలో శ్రీరాముఁడు సీతను తలఁచుకొని విలపించినట్లు రెండుమూఁడుచోట్ల పద్యము లున్నవి. నటులు వాటి భావ మభినయించుచు పఠించునపుడు తన్మయత్వము చెంది సామాజికులు కంట నీరు పెట్టుదురు గాని, "అయ్యో! భవభూతి శిఖరిణీవృత్తములో విలాపము వర్ణించి రసభంగము కావించె" నని యతనిని తిట్టుదురా? దృశ్యకావ్యకళాపారీణు లగు కవిసత్తములు—

"కవిచతురాననప్రతిభఁ
గల్పిత మైన విచిత్రసృష్టికిం
దవిలిన దేశకాలసుర
దానవమానవవృత్త మెల్ల ని
క్కువ మనునట్లుగా నెదుటఁ
గూరిచి చూపఁగ చిత్తముల్ సుఖా
ర్ణవమున నోలలార్చు కృతి
రాజము రూపకమే తలంపఁగన్."

అన్నట్లు, సామాజికులు తన్మయులై యానందించుటకు రసోచితము, పాత్రోచితము, సందర్భోచితము నగు రీతిని మాటలు, పద్యములు కూర్చుచు తమ కృతి ప్రదర్శనరమ్య మగుట కుద్యమించుచు వచ్చిరి. ఇపుడా యాచారము తగదన్న కవీశ్వరులు సభారంజక మగు పద్ధతిని పద్యరహితముగానే నాటకములు నిర్మింప యత్నింతురుగాక. ఈ రెండుపద్ధతులకును రూపకసారస్వతమున నెంతో యవకాశ మున్న మాట సత్యము. అట్టియెడ నొకదాని నొకటి నిరసింపఁ బని యేమి? అది తగ దనుటయే యీ వ్యాసము నుద్దేశము.

సవరణలు

గతమాసపు భారతిలో 'మధురనేలిన తెలుగునాయకరాజులు' అనే వ్యాసములో 391 పుట 3-వ పంక్తి (రెండవకాలము)లో 'అక్కనమాదనల'కు బదులు 'లక్కనమాదన'లని చదువుకొనవలెను.

—దిగవల్లి వేంకటశివరావు.

గడచిన ఫాల్గుణమాసపు 'భారతి'లో 252-వ పుటలో రెండవకలమున 16-వ పంక్తిలో "చలితదశమాధిపతి" యనుటకు "చలిత బృహస్పతి" అనియు, 17-వ పంక్తిలో "జన్మదశమాధిపతి" యనుటకు "జన్మబృహస్పతి" అనియు సవరించుకోవలసి యున్నది. పాఠకమహాశయులకీ తొందర కల్గించినందుకై చింతిల్లుచున్నాను.


—రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు.

దివ్యస్మరణ

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు

పంతులుగారిని గురించి నాకు తెలిసినది కొంచెము. నేను వారికి సమకాలికుడను కాను. అనగా వయస్సులో వారికి కొంచెము అటు నిటుగా నుండుట. నేను వారి పేరు వినునాటికే వారు నాయకులు, దాతలు, దేశోద్ధారకులు. తరువాత నేను పోయి యెవరినైనను ఆశ్రయించుట యనునది చాల తక్కువ. మొట్టమొదట మిత్రులు శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావుగారిని అడిగితిని: నే నేదైనను భారతికి వ్రాయుచుందును- పంతులుగా రేమైన నిచ్చెదరేమో అడిగి పెట్టవలెనని. రామకోటీశ్వరరావుగారు అడిగిరి. పంతులుగారు సరే యనిరట. నేను తరువాత నెప్పుడైనను మదరాసుకు పోయినప్పుడు వ్రాసినవానికి నీయవలసినది యేదైన నున్నచో పంతులుగారి దర్శనము చేసి యడిగెడువాడను. వారు వెంటనే యిచ్చెడివారు. ఏకవీర, కళింగరాజ్యము ఇవి రెండును మొదట భారతీముఖమున ప్రచురింపబడినవి. నా కప్పు డేదో డబ్బు కావలసి పంతులుగారి కడకు పోయి "యీ గ్రంథములు మీ భారతిలో ప్రకటించి, నాకు ప్రస్తుతమింత డబ్బు కావలయును- ఇప్పించు"డని యడుగుచుంటిని. వారు మరుమాటాడక అట్లే యిచ్చుచుండిరి. నా కాశ్చర్యముగా నుండెడిది: అందఱికి నిట్లే యిత్తురా? నాయందు వీరికి ప్రత్యేకాభిమాన ముండవలసిన యవసర మేమియు లేదే యని. నిజానకు నాయం దేమియు వారికి ప్రత్యేకాభిమానము లేదు. అంతియేకాక భారతిలో ప్రకటింపబడిన నా పద్యములను వారివద్ద నిందించినవారినికూడా నే నెరుగుదును. ఆ నిందించిన వారు సామాన్యులు కారు. ప్రసిద్ధులైన పండితులు. ఇది యెందుకు చెప్పితి ననగా—నేను డబ్బడుగుటయు, వా రిచ్చుటయు వారి సహజౌదార్యగుణ మొక్కటియే కారణముగా నాకు కనిపించినది.

వారి యౌదార్యము నే నొకసారి పరీక్షసేయవలయు ననుకొంటిని. నా వంటివా డట్టి పని చేయగూడదు గాని గొప్పవాళ్లను కొద్దివాళ్లు తమ యంతరము, పెరయంతరము తెలియకుండ పరీక్షచేయుట, విమర్శించుట మన దేశములో సహజమైన గుణము కనుక ఆ గాలివాటమున చేసితి కాబోలు. ఆ పరీక్ష యిది. పంతులుగారు తమ కుమార్తెవివాహము జగజ్జేగీయమానమైన వైభవముతో బెజవాడలో జరిపిరి. నేను పోలేదు. ఒకపద్యము చదువలేదు. పద్యము చదివిన ప్రతికవికి ఒక శేలువ, ఒక వెండిగిన్నె, పది రూపాయలు ఇచ్చుచుండి రని చెప్పిరి. అప్పుడు నే నొక పల్లెటూరిలో నుంటిని. ఆయూరిలో పదిమందిని పిలిచి, పదిమందికి పది యయిదులు ఏబది పద్యములు వ్రాసి పెట్టితిని. అందులో ఒకరిద్దరు గణా లున్నచో యతులు లేకుండ, యతులు కూడనున్నచో మతులులేకుండ పద్యములు వ్రాయగలవారే. వారిని బెజవాడకు పంపించితిని. మూడవదినమునకెల్లా ఆ పదిమందియు పది శేలువలు, పది వెండిగిన్నెలు, పది పదులు వంద రూపాయలు పుచ్చుకొని యింటికి చక్కా వచ్చిరి. నా కాశ్చర్యము వేసెను. అందులో నలుగురు పద్యము చూచి చదువలేరు. "ఏమిరా! చదివితిరిరా" యని యడుగగా వాళ్లనవ్వి "కాగితం చేతికిచ్చాం! బహుమతి తెచ్చుకొన్నాం!" అన్నారు. ఆహా! ఔదార్యము! పండితుడనునో కాదో- పండితుడనని వచ్చినాడు. వానిని నీ వగుదువా, కాదా యని రసాభా



దేశోద్ధారక, విశ్వదాత
కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు
ప్రియజనకులైన శ్రీ పంతులుగారి సప్తమవర్ధంతి (చైత్రశుద్ధద్వాదశి) సంద
ర్భమున వారి పవిత్రాత్మకు భారతి భక్తితాత్పర్యములతో నివాళిపట్టుచున్నది.

నముచేయు దాత యేమి దాత? అట్లు చేయవలయు నను నూహయు లేని పంతులుగారు కట్టి దాత!

తరువాత వారిని గురించి నాకు రెండే విషయములు తెలియును. ఒక రోజున పంతులుగారు మదరాసు పోవుటకు బెజవాడలో రైలెక్కుచున్నారు. నేను వారి వెనుకనే కొంచెము దూరముగా నడచుచు పోవుచుంటిని. ఎడమచేతిలో అయిదులు, పదులు రూపాయల కట్టల నోట్లున్నవి. దారినెంట గేటు మొదలు రైలు కదలువరకు రైల్వేయుద్యోగస్థులు, మరి యెవ్వరో యితరులు వారి దగ్గరకు వెళ్లుటయు, నమస్కారము చేయుటయు, ఆయన కుడిచేతితో చేతికి వచ్చినన్ని అయిదో, పదియో, పాతికో యిచ్చుచుండుటయు! నా కది చూచినప్పుడు కన్నులు బైరులు క్రమ్మెను. ఇది యేమి దాతృత్వము! కర్ణుడు, రాయని భాచడు మొదలైనవారు మాత్ర మిట్లు చేసియుండిరా యని యనిపించెను.

రెండవది యిది. నేను గుంటూరులో నుద్యోగము మాని బెజవాడకు రాకమునుపు, ఆరేండ్లు బందరులో నుండి నా పుస్తకము లేవో యచ్చువేయించుచు అది జీవికగా నుంటిని. ఒకప్పుడు మదరాసు పోయితిని. చిరంజీవి శంభుప్రసాదు నాకు శిష్యుడు. శంభుప్రసాదును చూడవలయునని పంతులుగారింటికి వెళ్లితిని. అతనితో మాట్లాడి తిరిగివచ్చుచుండగా పంతులుగారు వారి యింటి ముంగిట ఎడమ చేతివైపుగా శిలావిగ్రహము లున్నచోట ఒక తీవసం దిరిలో కూర్చుండుట వారి కలవాటు. అక్కడ కూర్చుండి నన్ను పిలచిరి. నేను పోయి నమస్కారము చేసితిని. "ఏమండీ! మీరు మీ పుస్తకములు ప్రకటించుచున్నారటగదా? నన్ను వచ్చి యేమియు నడుగలేదేమి"యని యడిగిరి. నే నేమియు మాటాడలేదు. మధ్యాహ్నము ఆఫీసుకు రమ్మనిరి. నేను పోయి కనిపించితిని. వెంటనే వందరూపాయల చెక్కు వ్రాసి యిచ్చిరి.

నేను ఎదుటివారి యౌదార్యము భరించుకొనలేను. ఇట్టి యవ్యాజౌదార్యమునకు నెట్లు ఋణవిముక్తి చేయవలయునో తెలియక నా 'త్రిశూల'మను నాటకమును వారి కంకితము చేసితిని. అది వారి తుదిరోజులలో జరిగెను.

ఇంతకు మించి పంతులుగారినిగురించి నా కేమియు తెలియదు.

నేను వట్టి కవిని. సూర్యుని తేజస్సే చూడగలను. ప్రకృతిశాస్త్రపరిశోధకులైనచో భూతఅద్దములద్వారా సూర్యబింబములో కొంపెలు చూతురో! నదులు చూతురో!! నేను సూర్యునియందలి ప్రాణదాతృతమైన దీప్తిమాత్రమే చూచితిని.

విశ్వనాథ సత్యనారాయణ.

* * *

శుష్కప్రియాలు

మా నాగేశ్వరరావు పంతులుగారు 'తగని-గర్విష్ఠి'; 'పరమలుబ్ధుడు'

—ఇవే నాకు పంతులుగారిలో నచ్చిన ఉత్తమ-సుగుణాలు.

అంతటి గుణ-లుబ్ధుణ్ణి నా చిన్నతనంలో నేను చూడటం అదే తొలిసారి. తెలుగుతనాన్ని, తెలుగువారిని తలంచుకుంటూ పలవరింతగా అనుక్షణమూ పులకరించిపోయే ఆ గర్వానికి ఒక హద్దూ పద్దూ అంటూ ఉంటేనా?

పంతులుగారికి చీటికీ-మాటికీ కోపం రాదేమా అని నాకు కోపం వచ్చేది. అమ్మయ్య! ఇన్నాళ్లకు, ఆయన పుట్టి-బుద్ధెరిగిన తరువాత కోపమంటూ రాబోతూన్నది గదా, ఇక తరించాడు, అని మనం ఎంతో ముచ్చటపడుతూ అందుకోసం పడిగాపులు పడిఉంటే, ఇంతా చేసి, తీరా ఆయనకు నవ్వొచ్చేది...అదేం పాపమో!

ప్చ! యీ రవంత భాగ్యానికి కూడా పంతులుగారు నోచుకోలేదు.

ఆయనకు కీర్తికాంక్ష లేదంటూనా? ఓఁ... ఉడ్డోలంగా ఉంది: ఎందుకు ఉండదూ?- దానికి

వారసులము యింతమందిమి ఉన్నామని ఆయనకు తెలియదు గనుకనా?

నిజంగా మనం అసాధ్యులం. మన గడ్డమీద కళ్లు తెరిచిన తతిమ్మా బంగారు-తండ్రులకు మల్లేనే, సారె చీర పెట్టి ఏ దేశానికో పంపించి, అక్కడ కూర్చుని కోటికి వేయిపడగలెత్తి కూర్చోనీకుండా, పీకైవంత చేరువలో నిలువుకుని పట్టు-పగ్గాల్లో ఉంచి 'యీ వాలుగురాళ్లతోనే సంతృప్తిపడండి' అన్నాం. ఆ ఘనుడు ఉన్నవాడు ఉన్నట్టుండక, ఆ యిరకాటంలోనే విశ్వదాతగా వెలశాడంటే, అది మన లోపమా? అనంతమైన విశ్వానికీ, అందులో ఆవగింజపాలు లేని జన్మ-భూమికీ లేదా కనిపెట్టలేని పక్షి అర్భకుడు పంతులుగారు.

పంతులుగారిలో ఎన్ని లోపాలు ఉన్నాయో అందరికీ తెలిసిన సంగతే కదా!

ఎవరన్నా బాధపడుతూంటే, ఆ బాధ తమదిగా హామేషా భావించడం అదో లోపం.

ఎవరన్నా బాధపడతారేమోనని, తాము ఎప్పుడూ బాధపడుతూండటం...ఇదో లోపం.

లోకంలో, ఎదుటివారిలో, కొండలపెట్టున ఎన్ని లోపాలు కనపడుతూన్నా, లీలగానైనా వాటిని చూడలేని దృష్టి-మాంద్యం...అన్నింటికన్నా ఘట్టి లోపం. అయినా, ఫరవాలేదు, ఉదారహృదయులమైన మనం, తెలుగువారం, వాటి నన్నింటినీ మన్నించాము; ఎలాగో సరిపెట్టుకుంటూ వచ్చాము.

నిజానికి, పంతులుగారికి 'పుట్టు-గతులు' లేవు. మనకు ఏ మాత్రం ఆచోకీ తెలిసినా అందుకు ఒప్పుకోమని, రెండోకంటివాడికి తెలియకుండా, ఒకుపుగా, పునరావృత్తిరహితమైన పదమును కాజేశారు. పోనిద్దురూ, యింతా చేసి, అదే ఆయన దాచుకున్న సొమ్ము!

నాగేశ్వరరావుపంతులుగారి పనే చాలా మెరుగు, మొత్తానికి! ఆయన యింటిపేరూ, ఆయన పేరూ ఏరి-కోరి పెట్టుకున్న దేవర, దక్కి-స్తూ, ముక్తి-మోక్షమూ లేకుండా, గంగఒడ్డున రాయిలాగా పడిఉన్నాడు...శివ-శివ!

మల్లాది రామకృష్ణశాస్త్రి.

ఎవరికెరుక?

= శ్రీ పుట్టా సూర్యనారాయణమూర్తిచౌదరి =

జగతి నెన్నెన్నియో హీనజన్మ లెత్తి
చివర కేను సీతాకోకచిలుక నైతి
వెనుక నంద రసహ్యించుకొనిరిగాని
పిదప నన్నందరును గౌరవించుచుండ్రి.
మిలమిలలు నింపు నాదు రెక్కలను గాంచి
కుసుమకుసుమాన మధువు త్రాగుటనుజూచి
సుందరంబుగ నే చరించుట దలంచి

యే నదృష్టవంతుడ ననియెదరుగాని.
బిడియమే లేక తీవతీవకును జేరి
పొట్టకూటికి పూవుపూవును తడుముచు
ప్రాణముల నఱచేతను బట్టుకొనుచు
నిమిషనిమిషమ్మునకును వేషముల మార్చి
నిలుకడేలేని బ్రతుకుబాటల చరింప
నిపుడు నే బడు వేదన లెవరి కెరుక!!!

కలగూరగంప

ఆదర్శగ్రామమైన సేవాగ్రాం

సుమారు తొమ్మిది సంవత్సరాల క్రిందట మహాత్ముడు సబర్మతీ ఆశ్రమాన్ని విడిచినప్పుడు (కీ॥ శే॥) జమ్నాలాల్ బజాజ్ ఆయన్ని వార్ధాకు ఆహ్వానించాడు. అతని ఆహ్వానాన్ని స్వీకరించాడు బాపూజీ. అక్కడికి దగ్గరలో వున్న మగన్‌వాడీ గ్రామంలోని అఖిలభారత గ్రామపరిశ్రమసంఘం అతని దృష్టిని గ్రామోద్ధారణకు పురికొల్పింది. మిగతా జీవితం గ్రామప్రజలతోనే గడిపి, వారి అభివృద్ధికోసం పాటుపడమని అతని అంతరాత్మ బోధించింది.

తరువాత వార్ధాకు నాలుగుమైళ్ల దూరములో వున్న 'సెగాన్' గ్రామం మహాత్ముణ్ణి ఆకర్షించింది. అదృష్టవశాత్తూ ఆ గ్రామస్థలమంతా (కీ॥ శే॥) జమ్నాలాల్ బజాజ్ అధీనంలో వుండడంవల్ల ఆయన ఆ స్థలమంతా సంతోషముతో బాపూజీకి అర్పించాడు. ఆ గ్రామాన్ని పూర్తిగా ప్రజల సేవకోసమే వినియోగించడానికి నిశ్చయించి, దానికి 'సెగాన్' అన్న పేరును మార్చి "సేవాగ్రాం" అని పెట్టాడు బాపూజీ. కొద్దిసంవత్సరాలలోనే ఆ ప్రదేశంలో అనేక కుటీరాలు వెలిశాయి. సేవాగ్రాం ఇప్పుడు, పూర్వము మహాఋషుల ఆశ్రమాలకిమల్లే, ప్రశాంతంగావుంటుంది. ఒకప్పుడు ఈ గ్రామానికి కాలిబాటకూడ లేదు. శ్రీ హాసన్ గారు వార్ధాడిస్ట్రిక్టుబోర్డు అధ్యక్షుడుగా నున్నప్పుడు వార్ధానుంచి సేవాగ్రాంకు ఒక చక్కటి రోడ్డు వేయించి పుణ్యంకట్టుకున్నారు.


సేవాగ్రాం పవిత్రతమూలంగా వార్ధా ఒక పుణ్యక్షేత్ర మయింది. ప్రపంచంలో అనేకమంది నిత్యం అక్కడకు వస్తూనేవుంటారు. క్రమంగా, సేవాగ్రాంలో, భారతభాగ్యోదయానికి వేర్వేరువిధాల పాటుపడుతూన్న హిందుస్థానీతాలిమీసంఘం, గ్రామపరిశ్రమసంఘం, గాంధీసేవాసంఘం, మహిళాశ్రమం మొదలైనవి లేచాయి. గురుదేవుని శాంతినికేతనం, అడయారులకు మల్లే సేవాగ్రాంలో అలంకారాలూ, ఆడంబరాలూ ఏమీ లేవు. అతిప్రశాంతంగా, అతినిర్మలంగా వుంటుంది. అక్కడ జాతి మత భేదాలకు తావులేదు.

సేవాగ్రాంను ఆదర్శగ్రామంగాను, స్వశక్తివంతంగాను చేయడానికి మహాత్ముడు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తూనేవున్నాడు. శిక్ష, భోజనం, నివాసం మొదలైన విషయాల్లో మహాత్ముడి వుద్దేశాలు అక్కడ అమలులో వున్నాయి. ఆశ్రమాన్ని శుభ్రపరిచే బాధ్యత ఆశ్రమవాసులదే. అందుకే మరుగుదొడ్లు బాగుచేయడం, వీధుల్ని వూడ్చడం మొదలైన పనులన్నీ ఆశ్రమప్రజలే, కార్యక్రమంప్రకారం, తెల్లవారిందిమొదలు రాత్రయిందాకా చేస్తారు.

ప్రశాంతమైన ప్రకృతి వాతావరణంలో పెరగడం ఉత్తమమని మహాత్ముని ఉద్దేశ్యం. అందుకు తగినట్టే సేవాగ్రాం నిర్మించబడింది. బాపూజీ నివసిస్తున్నది ఒక చిన్న మట్టిగోడల కుటీరం. అదే బాపూజీ కార్యాలయం. రోజూ వచ్చే వందలకొలది వుత్తరాలను పూర్వం మహాదేవదేశాయి విప్పుకునేవాడు. కాని అత నిప్పుడు లేడు. ఈ ప్రపంచాన్ని శాశ్వతంగా విడిచిపెట్టాడు. ప్రస్తుతం శ్రీ ప్యారీలాల్, శ్రీమతి ఖుర్షీద్ బెన్ కలసి ఆ పనిని చూచుకుంటున్నారు.

దర్శనానికి వచ్చినవారితో, చాపమీద కూర్చుని

మాలు వడుకుతూనే బాపూజీ మాట్లాడుతాడు. రాత్రిళ్లు బాపూ ఆరుబయట హాయిగా నిద్రిస్తాడు. సోమవారం నాడు ఎవరితోనూ మాటాడడు. విశ్రాంతికోసం కాదు- ఆ రోజు వ్రాతపనిలో నిమగ్నుడై వుంటాడు.



సేవాగ్రాంలో గాంధీజీ

సేవాగ్రాంలో ఒక కుష్ఠురోగికూడ వున్నాడు. ఆ రోగి ఒక సంస్కృతపండితుడు; పేరు శ్రీ పర్చూరు శాస్త్రిగారు (Shri Parchure Sastri). ఆయనంటే మహాత్మునికి ఒకవిధమైన ప్రేమ. కుష్ఠురోగి అవడం చాత ఆయన్ని ఎవ్వరూ ఆదరించలేదు. అందుచాత కొన్నాళ్లకు ఆయనకు జీవితంమీద విరక్తి పుట్టి, జీవితాంతమువఱకు నిరాహారదీక్ష చేయడానికి నిశ్చయించుకున్నారు. అప్పుడు దిక్కులేని ఆయన్ని గాంధీజీ ప్రేమతో చేరదీసి, తన సర్సూనూనె (Sarsu) మందువల్ల కొంత బాగుచేశాడు. ఇప్పుడాయన నిరాహారదీక్షాప్రయత్నాన్ని మానుకున్నారు. గాంధీజీ ఆయన్ని వేఱే ఒక కుటీరంలో వుంచాడు. ఆయనఆరోగ్యవిషయంపై మహాత్ముడు రోజూ రెండుగంటల కాలం వ్యయపరుస్తాడు. సర్దార్ వల్ల

భాయి పటేల్, రాజేన్ బాబు, ఆచార్య నరేంద్రదేవ్ మొదలైన దేశనాయకులు, తమ కెప్పుడైనా వళ్లల్లో అస్వస్థతగా నున్నప్పుడు, చికిత్సకోసం, విశ్రాంతి కోసం సేవాగ్రాంకు వస్తూంటారు, ఇలా బాపూజీ ఒక వైద్యుడే కాక, న్యాయాధిపతి కూడ సేవాగ్రాంలో. అక్కడ ఏ తగువు వచ్చినా బాపూజీ తీర్పు ప్రమాణంగా తీసుకుంటారు.

చిమూరుగాథలో నిరాహారదీక్ష వహించిన ప్రొఫెసర్ భన్సాలీగారి నివాసం సేవాగ్రాంలోనే. అతనికి గాంధీజీ అంటే అమితభక్తి. సేవాగ్రాంలో బాలబాలికలకు విద్యాదానం చేస్తూ కాలం గడుపుతున్నారు. ఒకప్పుడీయన వుత్త వేపాకులనే ఆహారంగా స్వీకరించేవారు. అతనితో మాట్లాడుతూంటే అదోమాదిరి ఆనందం కలుగుతుంది.

ఏడులక్షల భారతగ్రామాలలో వున్న నిత్య జీవనం ఒక్క సేవాగ్రాం ఆశ్రమాల్లో ప్రతిఫలిస్తూంది. అందుచేతనే నిరాడంబరమైన ఈ సేవాగ్రాం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. (స్వేచ్ఛానువాదం)

జి. వి. యల్. యస్. స్వామి.

కీ|| శే|| కె. యస్. గుప్తగారు

కేంద్రశాసనసభలో గంజాం, విశాఖపట్టణ మండలాల నియోజకవర్గము తరఫున కాంగ్రెసు సభ్యులైన కొల్లూరి సూర్యనారాయణ గుప్తగారు మార్చి ౫-వ తేదీనాడు అసెంబ్లీ సభలో మాట్లాడుచు మాట్లాడుచునే హఠాత్తుగా అసువులుబాసిరి.

అప్పటికి గుప్తగారికి ౫౬ ఏండ్లు. ఆ దినము పగలువరకు హుషారుగానే ఉన్నారు. ఆ క్రితము రాత్రి ప్రపంచ విషయములను గురించి మాట్లాడుచు ఆనందముగానే ఉన్నారు. ఆనాడు సభలో ఉపన్యసింప లేచినారు. ప్రభుత్వ చర్యలను ఖండించుచు మాట్లాడుచున్నారు. ప్రజలు తిండిలేక, బట్టలులేక, మందులులేక బాధపడుచున్న సంగతిని తీవ్రముగా చెప్పుచువచ్చినారు. ఇంతలోనే, ఎక్కడినుండి ఊడిపడ్డదో, గుండెజబ్బువచ్చి దాపరించినది. మాటల మధ్యలోనే ఆపి, "అధ్యక్షమహాశయా, నాకు ఒంటిలో సుస్తీగా ఉన్నది" అని చెప్పి కూలబడిపోయినారు.



కీ|| శే|| కె. ఎస్. గుప్తగారు.

వెంటనే ప్రథమ చికిత్స జరిగినదిగాని, లాభములేక పోయినది. ఆయనలోనుండి హంస ఎప్పుడు సందు చూచుకొని లేచిపోయినదో లేచిపోయినది. వట్టి కళేబరము మాత్రము మరుసటిరోజున విమానమెక్కి పుట్టినింటికి చేరుకొన్నది.

వానరాకడ, ప్రాణముపోకడ ఎవరికిని తెలియవందురు. ఇందుకేనేమో! ఏ క్షణానికి, ఎవరికి ఎక్కడ వ్రాసియున్నదో ఎవరెరుగుదురు!

భారతదేశములోని పేదలబాధలు నివారింప కంకణము కట్టుకొన్న గుప్తగారు ఇంత అకస్మాత్తుగా తనువుచాలించుట విచారకరము.

‘ఇంటిపేరంటే—?’

గతమాసపు ‘భారతి’లో పై శీర్షికతో ఇంటి పేర్ల పుట్టుపూర్వోత్తరాలనుగురించి విమర్శిస్తూ శ్రీ వేదుల సోమయాజుల వరహాలుగారు ‘వ్యాయామవిశేషాలు’ అనే ఉపశీర్షిక క్రింద దాట్లవారినీ, కప్పగంతుల వారినీ ఉదాహరించారు.

కప్పగంతులవారనేది వ్యాయామ సూచకం కాదు. ఆ పదం ‘కప్పగొంతుల’వారి భ్రష్టరూపం! ఆ కుటుంబంలోని పూర్వీకులు ఘనాంతస్వాధ్యాయులయి కప్పలు అరచునట్లు పనసలు చెప్పుటచేత ఆ పేరుకలిగింది. ఆ ‘కప్పగొంతుల’ పదం ఆనోటా ఆనోటా పడి రూపుచెడి ‘కప్పగంతుల’ అయినది. ఇలా ఎన్నో యిళ్ల పేర్లు తారుమారయాయి. అలాంటి వాటి యథార్థస్థితిని పరిశోధిస్తేనేగాని యింటిపేర్ల తత్త్వం నిశ్చయింపబడదని మనవి.

బులుసు వేంకటరమణయ్య.

సుమిత్ర మాగధి

౧౯౪౪ ఆగస్టు భారతియందు “సుమిత్ర యే రాజకూఁతురు?” అను శీర్షికతో నేనొక చిన్న వ్యాసము రచియించితి.

అందు, వాల్మీకి రామాయణమున కౌసల్యా కైకేయులు, కోసలకేకయాత్మజలుగాఁ జెప్పఁబడిరనియు, సుమిత్ర యే దేశపు రాజకూఁతురో చెప్పఁబడలే దనియు, వాల్మీకేతరకవికృత రామాయణములయందు సహితము సుమిత్రాజనకుని నామము చెప్పఁబడలేదనియు, పింగళిసూరనార్యకృతరాఘవ పాండవీయమున మగధతనయ యని యీ క్రింది పద్యమునఁ గానవచ్చుచున్న దనియు విరచించితిని:

రాఘవపాండవీయము ౧ ఆ. ౮ ప:—

సీ. “ధృతిఁ గుంతిమద్రభూపకుల......

....

గీ. ....

జగతిఁ గోసలకేకయమగధుల తన
యుల వరించిన యాజ్ఞలో మెలఁగఁజేసె.”

అందే మగధతనయ (మాగధి) యనుటకు “సూరన కే గ్రంథమునం దాధారము కలదో విజ్ఞులు పరిశీలింపవలసియున్నది.” యని వ్రాసితిని.

ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావుగారి వాల్మీకిరామాయణమందరవ్యాఖ్యానమున నీ క్రింది శ్లోకములు పద్మపురాణమునుండి గ్రహింపఁబడి యున్నవి:

శ్లో. “కోసలస్య నృపస్యాథ
తనయాంచ శుచిస్మితామ్,
కౌసల్యాంనామ కన్యాం తా
ముపయేమే స పార్థివః,
మాగధస్య నృపస్యాథ
పుత్రీ సర్వాంగశోభనా
సుమిత్రానామ నామ్నా చ
ద్వితీయా తస్య భామినీ
తృతీయా కేకయస్యాథ
నృపతే ర్దుహితా తథా
భార్యాభూత్ పద్మపత్రాక్షీ
కైకేయీనామ నామతః.”

పై శ్లోకము మూలమున సుమిత్ర మాగధ (మగధ) తనయ యనుట స్పష్టమగుచున్నది. మన సూరనగారికి పద్మపురాణమే యాధారమైయుండునని యూహింపవలసియున్నది.

రావూరి దొరసామి శర్మ.

విమర్శనము

"Deliverance"

రచన : శరత్‌చంద్ర ; ఆంగ్లానువాదం : దిలీప్ కుమార్‌రాయ్ ; అరవిందులు అనువాదం సరిచూశారు. రవీంద్రులు తొలిపలుకు వ్రాశారు.

ప్రకాశకులు : నలందాపబ్లికేషన్స్, N. M. త్రిపాఠీ లిమిటెడ్, ప్రిన్సెస్ స్ట్రీటు, బొంబాయి 2. వెల రూ. 3-8-0.

తొలిపలుకుల్లో అరవిందులు వ్రాసిన మాటలలో ఎంతో సత్యమున్నది. శరత్ గొప్ప మేధావి. అతనిది అతివిశాలమైన హృదయం ; అతినిశితమైన చూపు. మితిలేని సానుభూతి. మానవుల దుఃఖాన్నీ, వేదననీ, హృదయం కరిగించేట్లుగా చిత్రించటంలో శరత్ అందెవేసిన చెయ్యి. మనుష్యుల స్వభావాలలో వుండే మలుపులూ, మెలికెలూ కళ్లకు కట్టించి పాత్రలమీద పాఠకులకి చెప్పలేని మక్కువ కలిగించగలడు. ఆ పాత్రల సుఖదుఃఖాలు తనవే అయినట్లుగా పాఠకుని హృదయం ముందున్న కథకోసం గబగబ పరిగెత్తుతుంది.

ఈ నవలలో శరత్ ఒక కుటుంబాన్ని చిత్రించాడు. నవల మొదలయేసరికి ఆ కుటుంబంలో గిరీశ్, హరీశ్, వాళ్ల పినతండ్రికొడుకు రమేశ్, వాళ్ల భార్యలు సిద్ధేశ్వరీ, నయనతారా, శైలా, వాళ్ల పిల్లలూ అంతా సుఖంగా కలిసివుంటారు. వంటింటికి పెద్ద సిద్ధేశ్వరి. ఇంటికి పెద్ద ఆమెభర్త గిరీశ్. పిల్లలని అదుపులో వుంచటం, ఇనప్పెట్టెతాళంచెవులు కొంగున కట్టుకుని డబ్బువాడుతూవుండటం శైలపని. గిరీశ్, హరీశ్ ప్లీడర్లు. రమేశ్ మాత్రం ఉద్యోగమేమీ లేకుండా ఇంట్లో కూర్చొని పత్రికలకి వ్రాసి దేశాన్ని బాగుచెయ్యాలనుకుంటూ వుంటాడు. నయనతార నవనాగరికత కలవడిన నారి. ఆమెభర్త హరీశ్ కూడ అంతే.

అంతవరకూ అరమరలు లేని కుటుంబంలో మెల్లమెల్లగా భేదాలు తల ఎత్తుతాయ్. నయనతార కొడుకు బూట్లు తొడుక్కొని వంటింట్లోకి వస్తాడు. శైల ఆ అబ్బాయిని బైటికి పోయి బూట్లు విప్పి రమ్మంటుంది. విప్పకుండా అక్కడే నిలబడతాడు. ఇంతలో సిద్ధేశ్వరికొడుకు ఆ దోవన పోతూ, బూట్లు విప్పనని మొండికివేసిన కుర్రాడిని చెంపమీద కొడతాడు. ఇంకేముంది, ఇల్లంతా గందరగోళం. శైల కొట్టించిందనీ, తాము అక్కడ వుండటం శైలకి ఇష్టం లేదనీ, వెంటనే ఇంకో ఇంటికి వెళ్లిపోతామనీ నయనతార గొడవచెయ్యటం మొదలుపెడుతుంది.

ఎల్లాగయినాసరే కుటుంబంలో చీలికరాకుండా చూడవలెననే తాపత్రయం సిద్ధేశ్వరికి. శైలదే తప్పనీ, ఏమైనా సరే వెళ్లటానికి వీలులేదనీ నయనతారను బ్రతిమాలి ఒప్పిస్తుంది.

అప్పటిదాకా శైలమీద సిద్ధేశ్వరికి ఎంతో గురి. శైలను తానే పెంచి పెద్దదాన్ని చేసి మరిదికిచ్చి పెళ్లిచేసింది. అందువలన శైల అంటే ఎంతో మక్కువ. మెల్లిమెల్లిగా నయనతార సిద్ధేశ్వరిని లోబరుచుకుంటుంది. శైలమీద ఏవగింపు కలిగిస్తుంది. ఎవరు ఎటు తిప్పితే అటు తిరుగుతుంది సిద్ధేశ్వరి. కొన్నాళ్లకి శైల తన ఇనప్పెట్టెలోంచి డబ్బు దొంగిలిస్తున్నదేమోనని అనుమానపడుతుంది. పరాయివాళ్లు నా ఇంట్లో చెడతింటుంటే నే నూరుకుంటానా? ఎన్నాళ్లని రమేశ్ అన్నగారి నెత్తిన కూచోటం? అని శైలను ములుకులలాటి మాటలతో పొడుస్తూ

వుంటుంది. అయినప్పటికీ శైలని ఇల్లా బాధిస్తున్నానే అన్న పరితాపం కూడా సిద్ధేశ్వరిలో వుంది. శైలని ఏదో విధంగా పలకరించాలని చూస్తుంది. శైలని నిందతో అయినా పలకరించాలని చూస్తుంది. శైల అన్నిటినీ ఓర్పుతో సహిస్తుంది.

చివరికి కుటుంబంలో చీలిక రానే వచ్చింది. ఈసారి శైలా పిల్లలూ, భర్త రమేశ్ ఇల్లు వదిలి వెళ్లి పోతారు. పల్లెటూళ్లో వాళ్లకున్న ఇంట్లో వుంటారు. వాళ్లు వెళ్లిపోయిన రాత్రి సిద్ధేశ్వరి పడ్డ తహతహకి మితిలేదు. శైలకొడుకు లిద్దరూ తలొకవైపునా తన పక్కలో నిద్రపోయేవాళ్లు. ఆ రాత్రి శూన్యంగా వున్న పక్కని చూసేసరికి సిద్ధేశ్వరికి పట్టలేని దుఃఖం వస్తుంది. వాళ్లు నాపిల్లలు, వెంటపెట్టుకుపోవటానికి శైల కేమీ అధికారం లేదని భర్తదగ్గరికీ, మరదిదగ్గరికీ వెళ్లి, వెంటనే పిల్లల్ని తెచ్చి దిగవిడువవలసిందని లాయరునోటీసు ఇమ్మంటుంది. ఈ సంఘటనలో సిద్ధేశ్వరిలో వున్న మాతృత్వంతో కదిలించివేశాడు శరత్.

చివరికి గిరీశ్ తమ్ముడు వుంటున్న పల్లెటూరు వెళ్లవలసిన పని వొస్తుంది. అప్పటికి హరీశ్ కుట్రవల్ల, నయనతారవిషంవల్ల రమేశ్ మీద కోర్టులో దావా జరుగుతూవుంటుంది. ఈ వ్యవహారం నడిపేందుకు డబ్బు ఎక్కడిది రమేశ్ కి? అదంతా శైల నీ ఇనప పెట్టెలోంచి తస్కరించిన డబ్బే అని నయనతార సిద్ధేశ్వరిమనస్సు విరిచినా, సిద్ధేశ్వరి భర్త వెళ్లేప్పుడు రమేశ్ పిల్లల నిద్దర్నీ చూసిరమ్మనీ, వెంట తీసుకురమ్మనీ చెపుతుంది. గిరీశ్ ది వింతస్వభావం. ఏదీ అతని మనసుకి పట్టదు. వెళ్లేవెళ్లటంతోనే తమ్ముణ్ని తిట్టి, "ఓకేనో, ఓ పాతాల్" అని పిల్లలని పిలుస్తూ ఇంట్లోకి వెళ్తాడు. పిల్లలు వచ్చి పెద్దనాన్నని చుట్టేసుకుంటారు. అంతవరకూ దీనంగా దేవుడిని వేడుకుంటున్న శైల వచ్చి బావగారికి నమస్కారం చేస్తుంది. ఏమీ మనసుకి పట్టని గిరీశ్ కి వొంటిన ఒక్క నగ అయినా లేకుండా దీనంగా కనిపించిన శైలని చూడగానే గుండె చివుక్కుమన్నది. వెంటనే

పల్లెటూరిలో తనకున్న ఆస్తి అంతా రమేశ్ పేర వ్రాసేసి ఇంటికి వస్తాడు.

ఇంటికి రాగానే తమ పథకం పాడయినందుకు హరీశ్, నయనతారా గిరీశుని నానా మాటలూ అంటారు. కాని సిద్ధేశ్వరి భర్త చేసిన పనికి ఉప్పొంగి పోతుంది.

ఇదీ కథ. ఈ కాస్తకథలో స్త్రీహృదయం లోతులు తడివిచూపించాడు శరత్. కృత్రిమమైన పన్నాగాలు చేసే నయనతారా, చెప్పుడుమాటలు విని ఎవరు ఎటు తిప్పితే అటు తిరిగే సిద్ధేశ్వరీ, ఆమె మాతృత్వమూ, కరుణా, శైలపాత్రలో చిత్రించిన చాకచక్యమూ, ధీరత్వమూ, తాలిమీ చదివినతరవాత కూడా మరుపుకురావు. ఏమీ పట్టించుకోని గిరీశ్ పాత్ర ఎంతో కులాసాగా చిత్రించాడు శరత్.

అనువాదం మొదట కొంచెం గద్దుగా వున్నా,

పోనుపోను సాఫీగా సాగిపోయింది. పుస్తకం మొదలు పెడితే ముగించేదాకా తోచదు.

ముందుముందు రాయ్‌గారు శరత్ రచనలన్నీ ఆంగ్లంలోకి అనువదిస్తారని ఆశిస్తున్నాను. విశ్వసాహిత్యంలో గొప్ప నవలారచయితలతో తులతూగే శక్తి శరత్ కున్నది. ఆ శక్తిని లోకానికంతకీ చాటటానికి ఇటువంటి ఆంగ్లానువాదాలు ఇంకెన్నో కావాలి.

Telugu Literature

(ఆంధ్ర సాహిత్యము) రచయిత : ప్రొఫెసర్ పి. టి. రాజు, యం. ఏ., పి. ఎచ్. డి., శాస్త్రి, ఆంధ్ర యూనివర్శిటీ, గుంటూరు. ప్రచురణ : ది పి. ఇ. ఎన్. ఆలిండియా సెంటర్, ఆర్యసంఘ, మలబార్ హిల్, బొంబాయి. దొరికేచోటు : ది ఇంటర్నేషనల్ బుక్ హౌస్ లిమిటెడ్, ఆష్‌లేన్, ఫోర్టు, బొంబాయి. పుటలు ౨౪ + ౧౨౪ వెల ౨-౮-౦.

పి. ఇ. యన్. అనే పొడి అక్షరాలకు ఇంగ్లీషులో కవులు, వ్యాసకర్తలు, నవలాకారులు అని తాత్పర్యం. మొత్తంమీద వివిధరీతుల సాహిత్యపరులైనవారి బృందమే ఇంటర్నేషనల్ పి. ఇ. యన్. అనే సంస్థగా ఏర్పడింది. ౧౯౨౧ లో లండనులో స్థాపన అయిందిమొదలు ఇది జగద్విఖ్యాతంగా వర్థిల్లుతూ వచ్చింది. నానాదేశాల్లోనూ ఈ సంస్థశాఖలున్నవి. మన భారతీయశాఖను ౧౯౩౩ లో శ్రీమతి సోఫియా వాడియా స్థాపించింది. వివిధదేశభాషలందలి సారస్వతానికీ మంజూషగా ఉండాలని వీరి వాంఛ. అందువలన ఆ యా భాషాసాహిత్యాలను గురించి రాజభాష ఇంగ్లీషులో పుస్తకాలు ప్రచురించి ఇతరుల రసాస్వాదనకు తోడ్పడుతూ ఉన్నారు. ఈ విధంగా వీరు ఇంతవరకూ అస్సాం, వంగ సాహిత్యాలను గురించీ, భారతీయులు రచించిన ఆంగ్లసారస్వతాన్ని గురించీ పుస్తకాలు ప్రచురించారు. ఇపుడు తెలుగుసాహిత్యాన్ని గురించిన ఈ గ్రంథం ప్రచురణ అయింది. ఇందులో ప్రాచీనసాహిత్యము, నవ్యసాహిత్యము, అనువాదమాల అనే మూడు భాగాలున్నవి. సంపాదకురాలు శ్రీమతి సోఫియా వాడియాగారి పీఠిక, కట్టమంచి రామలింగారెడ్డిగారి ఉపోద్ఘాతము, గ్రంథకర్త మున్నుడీ వున్నవి. గ్రంథం చివర ఇంగ్లీషులో గల గ్రంథాల జాబితా ఆంధ్ర సాహిత్య పరిజ్ఞానానికని సూచికగా చేర్చారు.

భారతీయ సంస్కృతికి, సంస్కృత సాహిత్యానికీ ఆంధ్రులు ప్రశస్తమైన కృషిచేశారు. తెలుగు భాష పసిఫిక్ ఖండంలో వ్యాపించి ఫిలిప్పైను దీవుల దాకా పాకింది. ఫిలిప్పైన్ భాషలో ఎన్నెన్నో తెలుగుమాటలున్నవి.

దక్షిణాదిన తెలుగుప్రభావం కన్నడ సాహిత్యంలో హెచ్చుగా ప్రతిఫలిస్తూ ఉంది. తెలుగు సాహిత్యం ప్రథమదశలో సంస్కృత పండితులైన రచయితల ప్రాభవం హెచ్చుగా గోచరిస్తున్నా, కాలక్రమేణ దేశీయమైన నానుడితో కలిసిపోయి విశిష్ట సారస్వతంగా పరిఢవిల్లింది.

ఆంధ్రభారతంతో ప్రారంభమై ౧౮౭౫ వరకు వర్ధిల్లినది ప్రాచీన సాహిత్యమనవచ్చును. ఆంధ్రభారతానికి పూర్వం తెలుగుసాహిత్యం ఉన్నదనుకున్నా దక్కినదిలేదు.

ఇది సమగ్రమైన ఆంధ్రసాహిత్య చరిత్రం కాదు. పరిమితమైన ధోరణిలో వ్రాశారు ఈ పుస్తకం. ఇతర రాష్ట్రాలవారికి, దేశాలవారికి సూక్ష్మంగా తెలుగు సాహిత్యపు పోకడలు తెలియజేయడమే ఈ పుస్తకం ఉద్దేశం. ప్రాచీనసాహిత్యాన్ని భారత కవులు, రామాయణ కవులు, ప్రబంధకవులు, శతక కవులు అని నాలుగు అధ్యాయాలుగా విభజించి వ్రాశారు. ఉన్న మితిలో మొత్తంమీద ఈ ఖండం సమగ్రంగా ఉంది. రెండో ఖండంలో నవ్యాంధ్ర సాహిత్యం గూర్చి వ్రాశారు. ఇక్కడ నే గ్రంథకర్త వ్రాసినది అసమగ్రంగానూ, కొంత అనాలోచితంగానూ కనబడుతుంది. భమిడిపాటి కామేశ్వర

రావుగారు ఇటీవల హాస్యరచయితగా పేరొందారనీ, ఈ మధ్యనే శ్రీరంగం శ్రీనివాసరావుగారు ప్రభవరచనతో ప్రాముఖ్యత చెందారనీ వ్రాసినది చూడగా అక్కడక్కడ వీరి విషయగ్రహణ పదేళ్లు వెనకబాటుగా ఉందా అనిపిస్తుంది. ప్రసిద్ధులైన వారిని కొందరిని ప్రస్తావించనే లేదు. దానికి 'లోకోభిన్నరుచిః' అనే సమాధానం కుదరదు. సాహిత్యచరిత్ర వ్రాసేవానికి జనాభిప్రాయపు ఆకళింతకూడా అవసరమే అవుతుంది. అవధానయుగంగా ఒకదశాబ్దం తెలుగు సాహిత్యంలో విజృంభించింది. అదికూడా ఉపేక్షించతగ్గదికాదు. పలువురు చదివిన పుస్తకమని చెప్పినదానికన్న గ్రంథవిషయం ఏ కొంచెమో తెలిపితే బాగుండేది. గెలెట్టీ, బ్రౌన్ ప్రభృతులు చిన్న ఇంగ్లీషు - తెలుగు నిఘంటువులు వెలువరించారని వ్రాసినది చూడగాను, ఇంకా ఇలాటి వ్రాతలను బట్టి వీరా యీ గ్రంథాలనుగూర్చి ఎక్కువగా తప్పువిని కిడినిబట్టి వ్రాసినట్లు కనబడుతుంది.

పేర్కొనవలసినవారిని పేర్కొ లేదు సరికదా, పేర్కొన్నవారిని గురించైనా సమంజస ప్రస్తావన లేదు. అనువాదమాల ఏర్చి కూర్చినది బాగున్నది. ప్రాచీన సాహిత్యమందలి రసవంతపు ఘట్టాలను ఇంగ్లీషు కవనంలోకి దింపారు. అసలు గ్రంథంలోలాగానే ఇక్కడ కూడా నవ్యాంధ్రకవనానికి గాని, గద్యానికిగాని సరితగ్గ ప్రస్తావనలేదు. అయినా అసలు గ్రంథభాగం కన్న ఈ అనువాదమాలవల్లనే ఇతరులకు మన సాహిత్యవస్తువు, రసమూ ఎక్కువగా బోధ అవుతుంది.

పరాయివారికి ఈ గ్రంథం తెలుగు సాహిత్య గ్రహణకు ఉపకరిస్తుంది కాని ఉపకరించవలసినంతగా ఉపకరించదు. రెండో కూర్పులో రెండో ఖండం విశేషించి తిరిగి వ్రాయవలసి ఉంటుంది.

తెలుగురాని వారికి ఆంధ్ర సాహిత్యపరిచయం ఈ విధంగా కలిగించినందుకు పి. ఇ. యన్. భారతీయశాఖవారు అభినందనీయులు. 'సురుచి.'

సూర్యప్రభ - జన్మదినసంచిక

సంపాదకులు : జంపన చంద్రశేఖరరావు, డి. అప్పారావుగార్లు. కార్యాలయము : ౪౩ గోవిందప్ప నాయనివీధి, జి. టి. మద్రాసు. వెల ౧ రూపాయ.

శ్రీ రాయప్రోలు సుబ్బరావు, విశ్వనాథ సత్యనారాయణ, కాటూరి వేంకటేశ్వరరావు, దువ్వూరి రామిరెడ్డిగార్లు మొదలైన సిద్ధహస్తుల రచనలతో ఈ సంచిక సరిక్రొత్తరూపము దాల్చియున్నది.

ధంకాసంవత్సరాదిసంచిక

ప్రత్యేకవ్యాసములు, ప్రత్యేక చిత్రములతో, వందకు పైబడిన పుటలతో ఇనుమిక్కిలి రూపం దియున్నది. వెల ఒక రూపాయ. కార్యస్థానము : ౬ సుంకురామచెట్టి వీధి, జి. టి. మదరాసు.

గ్రంథ స్వీకారము

సే వాం జ లి

పార్థివ ఉగాదినాడు ఘనపురం స్టేషను (నైజాము) సారస్వతసేవాసమితివారు సమర్పించిన వివిధరచనాసంపుటి. వెల రూపాయిపావలా.

మహాకవి - మహాపురుషుడు
గురజాడ అప్పారావు

రచన : సెట్టి ఈశ్వరరావుగారు. ప్రకాశకులు : ప్రజాశక్తికార్యాలయము, బెజవాడ. వెల ౧౦ అణాలు.

చు క్కా ని

రచయిత : మంచళ్ల సుదర్శనాచార్యులుగారు, 'గ్రీన్ గేట్సు,' సైఫాబాదు, హైదరాబాదు (దక్కను) వెల రూ. ౨-౮-౦.

సం యు క్త

పద్యనాటిక. రచయిత : వేమూరి వెంకటరామనాథంగారు. ప్రాప్తిస్థానము : ఓరియంటల్ పబ్లిషింగ్ కంపెనీ, గుంటూరు. వెల ౧౦ అణాలు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.

ఇండియన్ టీలలో అత్యుత్తమమైనది



చక్కని రుచి, ఘుమ ఘుమలాడే సువాసన, నేత్ర పర్వంగావుండే రంగు, తక్కువధర, వీటి అన్నింటి నిబట్టి లిప్టన్స్ టీ గర్ల్ మిగతా వాటిని తలదన్ని అత్యాధిక గౌరవాన్ని తెచ్చుకున్నది.



లిప్టన్స్ టీ గర్ల్

మృదు మధురమైన ఇండియన్ డస్ట్ టీ

LTK 84G



ఆశ్రితరక్షణ

బుద్ధుడు ఉపవాసానంతరము గాలివానచే తపింపబడినప్పుడు ముచిలిందుడు అను నాగరాజు ఆశ్రయమిచ్చుట.

(నాగార్జునకొండ శిల్పము.)

—చిత్రకారుడు : శ్రీ తేజోమూర్తుల కేశవరావు.